




# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక

ప్రశ్నించడం మన హక్కు



సంపుటి : 1 సంచిక : 213 పేజీలు :8 | సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) | ప్రచురణ : ఎన్.టి.ఆర్ జిల్లా | బుధవారం 12 ఆగస్టు 2026 | వెల : 5/-రూ ॥

VOLUME :1 ISSUE : 213 PAGES :8 | EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) | PUBLISHED : NTR DIST, | WED 12 AUGUST 2026 | PRICE : 5/- RS

Simultaneously Published form Tirupati, Chittoor,Srikakulam,Ongole,Visakhapatnam,Kakinada,West Godavari,Bapatla,Narasarao Peta, Ongole, SPSR Nellore, Tirupati, YSR Kadapa,Circulated by : manyam,Vizianagaram,East Godavari, Eluru,Guntur,Kurnool,Anantapur


# పరుగులు పెడుతున్న ఏపీ ఆర్థిక వ్యవస్థ.. జాతీయ సగటు కంటే మెరుగైన వృద్ధి



- జాతీయ సగటును మించి ఏపీ ఆర్థిక వృద్ధి నమోదు
- 2025-26లో 9.9 శాతానికి చేరిన రాష్ట్ర స్థూల ఉత్పత్తి వృద్ధి రేటు
- వ్యవసాయ, పారిశ్రామిక, సేవా రంగాల్లో గణనీయమైన ప్రగతి
- ఎల్ నినో ప్రభావంపై సీఎం చంద్రబాబు ఆందోళన
- సంక్షోభంలోనూ 15% వృద్ధి లక్ష్యంగా పనిచేయాలని అధికారులకు ఆదేశం

పెన్ పవర్ డెస్క్:ఆంధ్రప్రదేశ్ ఆర్థిక వ్యవస్థ స్థిరమైన వృద్ధి పథంలో పయనిస్తోంది. జాతీయ వృద్ధి రేటును అధిగమించి, వరుసగా రెండో ఏడాది కూడా రాష్ట్రం మెరుగైన ప్రగతిని నమోదు చేసింది. 2025-26 ఆర్థిక సంవత్సరంలో రాష్ట్ర స్థూల ఉత్పత్తి వృద్ధి రేటు 9.9 శాతానికి చేరుకున్నట్లు జులై 2026 నెలవారీ ఆర్థిక నివేదిక స్పష్టం చేసింది. ముఖ్యమంత్రి క్యాంపు కార్యాలయంలో సీఎం చంద్రబాబు నాయుడుకు ప్రణాళికా

- మిగతా 2లో



## నకిలీ పోలీసులతో ర్యాలీలా?

### వైసీపీపై హోంమంత్రి అనిత నిప్పులు

- పోలీసు వ్యవస్థను వైసీపీ నేతలు అవమానిస్తున్నారన్న అనిత
- క్రిమినల్ రాజకీయాలు చేసేవారికి రాజకీయాల్లో కొనసాగే అర్హత లేదని వ్యాఖ్య
- వ్యవస్థలను దిగజార్చాలని చూస్తే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరిక

పెన్ పవర్ డెస్క్:నకిలీ పోలీసులతో ర్యాలీలు నిర్వహిస్తూ వైసీపీ నాయకులు రాష్ట్ర పోలీసు వ్యవస్థను తీవ్రంగా అవమానిస్తున్నారని ఆంధ్రప్రదేశ్ హోంమంత్రి వంగలపూడి అనిత తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. కేవలం ప్రజలను తప్పుదోవ పట్టించేందుకు, రాజకీయ ప్రయోజనాల కోసమే ఆ పార్టీ నేతలు ఇలాంటి

- మిగతా 2లో

# దేశ నిర్మాణంలో భాగస్వాములు కండి

## సీఎం చంద్రబాబు పిలుపు

- 'పార్ట్‌నర్స్ ఇన్ నేషన్ బిల్డింగ్'కు సీఎం చంద్రబాబు పిలుపు
- 'రోడ్ డాక్టర్' పేరుతో గుంతల్లేని రహదారుల మిషన్
- ప్రజలు, ఉద్యోగులు అంతా భాగస్వాములు కావాలని సూచన
- జులై నెలలో 10.70 శాతం ఆర్థిక వృద్ధి నమోదు
- ఎల్ నినో ప్రభావంపై అప్రమత్తంగా ఉండాలని హెచ్చరిక



పెన్ పవర్ డెస్క్:ప్రజలు, ఉద్యోగులు, అధికారుల సమష్టి భాగస్వామ్యంతో 'పార్ట్‌నర్స్ ఇన్ నేషన్ బిల్డింగ్' కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పిలుపునిచ్చారు. రాష్ట్రంలో గుంతలు లేని రహదారులే లక్ష్యంగా 'రోడ్ డాక్టర్' పేరుతో 'జీరో పాట్ హోల్ మిషన్'ను యుద్ధ ప్రాతిపదికన చేపట్టాలని అధికారులను ఆదేశించారు. మంగళవారం సచివాలయంలోని ఆర్టీజీఎస్ కేంద్రం నుంచి వివిధ శాఖల పనితీరుపై ఆయన ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు.

ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ, ప్రభుత్వ సేవలను ప్రజలకు మరింత సులభతరంగా చేరువ చేయడం ద్వారా ప్రతి ఒక్కరినీ జాతి నిర్మాణంలో భాగస్వాములను చేయాలని ఆకాంక్షించారు. వికసిత్ భారత్, స్వర్ణాంధ్ర లక్ష్యాల సాధనకు ప్రతి అధికారి, ఉద్యోగి అంకితభావంతో కృషి చేయాలని సూచించారు. రాష్ట్రవ్యాప్తంగా దెబ్బతిన్న రహదారులకు తక్షణమే మరమ్మతులు చేపట్టేలా 'రోడ్ డాక్టర్' కార్యక్రమాన్ని పకడ్బందీగా అమలు చేయాలని స్పష్టం చేశారు. ప్రభుత్వం సంక్షేమం, అభివృద్ధి పనులను చిత్తశుద్ధితో చేపట్టినప్పుడు ప్రజల మద్దతు ఎప్పుడూ ఉంటుందని, భోగాపురం విమానాశ్రయ పనుల పురోగతికి లభిస్తున్న స్పందనే ఇందుకు నిదర్శనమని ఆయన పేర్కొన్నారు. వాస్తవాలను ప్రజలకు వివరిస్తే వారే ప్రభుత్వానికి అండగా నిలుస్తారని, కర్నూలులో డీఎస్సీ-2025 ఉపాధ్యాయ అభ్యర్థులు చేపట్టిన కార్యక్రమమే ఇందుకు ఉదాహరణ అని తెలిపారు. జులై నెలలో రాష్ట్రం 10.70 శాతం ఆర్థిక వృద్ధిని సాధించిందని వెల్లడించిన ఆయన, రాబోయే రోజుల్లో ఎల్ నినో ప్రభావం తీవ్రంగా ఉండే అవకాశం ఉన్నందున ఎదురయ్యే సవాళ్లను అధిగమించేందుకు సిద్ధంగా ఉండాలని హెచ్చరించారు. ఈ సమీక్షా సమావేశంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సాయి ప్రసాద్‌తో పాటు పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

- మిగతా 2లో



## డీఎస్సీ వ్యవహారంపై సీబీఐ విచారణ జరగాల్సిందే..

### నారా లోకేశ్ తక్షణమే రాజీనామా చేయాలి

- పుత్తూరులో రోజా ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ
- డీఎస్సీలో భారీగా అక్రమాలు, అవకతవకలు జరిగాయన్న రోజా
- నిరుద్యోగుల జీవితాలతో ఆడుకోవద్దని ప్రభుత్వానికి హితవు

పెన్ పవర్ డెస్క్:కూటమి ప్రభుత్వం చేపట్టిన మెగా డీఎస్సీలో భారీగా అక్రమాలు, అవకతవకలు జరిగాయని, ఈ కుంభకోణానికి బాధ్యత వహిస్తూ విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ తక్షణమే తన పదవికి రాజీనామా చేయాలని మాజీ మంత్రి, వైసీపీ నాయకురాలు ఆర్కే రోజా డిమాండ్ చేశారు. నిరుద్యోగులను నట్టేట ముంచిన డీఎస్సీ ప్రక్రియపై సీబీఐ చేత తటస్థ విచారణ జరిపించాలని కోరుతూ నగరి నియోజకవర్గం పుత్తూరు పట్టణంలో ఆమె ఆధ్వర్యంలో భారీ నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా అంబేద్కర్ విగ్రహం వద్ద ఆమె మీడియాతో మాట్లాడుతూ ప్రభుత్వంపై నిప్పులు చెరిగారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఇచ్చిన మొట్టమొదటి ఉద్యోగ నోటిఫికేషన్‌లోనే పేపర్ లీకేజీలు, అవినీతి అక్రమాలు రాజ్యమేలాయని రోజా తీవ్రస్థాయిలో ఆరోపించారు. ప్రశ్నాపత్రాన్ని తయారు చేసిన నవీన్ అనే వ్యక్తికే మొదటి ర్యాంక్ రావడమే పేపర్ లీక్ అయిందనడానికి సజీవ సాక్ష్యమని స్పష్టం చేశారు. పేపర్ లీకేజీ నిజం కాకపోతే మొదటి ర్యాంకర్ నవీన్‌కు ఉద్యోగం ఇవ్వకుండా, రెండో ర్యాంక్ నుంచి ఎందుకు నియామకాలు చేపట్టారో ప్రభుత్వం సమాధానం చెప్పాలని సవాల్ విసిరారు. మరోవైపు స్పోర్ట్స్ కోటా పేరుతో దొంగ జీవోలను తెచ్చి

- మిగతా 2లో

## ఆక్వా రంగానికి 'పవర్' ఊరట:

### పాలకొల్లు సభలో జగన్‌పై మంత్రి అచ్చెన్నాయుడు నిప్పులు

- ఆక్వారంగానికి రూ. 1,150 కోట్ల విద్యుత్ సబ్సిడీ జీవోను విడుదల చేసిన అచ్చెన్న
- ఆక్వారంగం చంద్రబాబు మానసపుత్రిక అని వ్యాఖ్య
- జగన్ చవకబారు రాజకీయాలు చేస్తున్నారని మండిపాటు

- మిగతా 2లో





## ఆగస్టు 18 నుంచి కేబీఆర్ పార్క్ చుట్టూ వన్-వే ట్రాఫిక్

- ఫ్లైఓవర్ నిర్మాణ పనుల కారణంగా ట్రాఫిక్ రద్దీ నియంత్రణకు చర్యలు
- ఇప్పటికే ట్రయల్ రన్ విజయవంతమైందని తెలిపిన పోలీసులు
- ప్రయాణికులు కొత్త మార్గాలను అనుసరించాలని సూచన

- మిగతా 2లో

## భారత్‌లో అరుణాచల్ అంతర్భాగం.. మార్చడం ఎవరితరం కాదు

- ఈ వాస్తవాన్ని ఎవరూ మార్చలేరన్న విదేశాంగ శాఖ
- 27 ప్రాంతాలకు భారత పేర్లపై చైనా అభ్యంతరం
- సరిహద్దులో శాంతి అత్యంత కీలకమన్న భారత్
- ఆగస్టు 6న ఎల్ఏసీ పరిస్థితిపై చర్చలు
- దౌత్య, సైనిక మార్గాలు కొనసాగించేందుకు అంగీకారం



పెన్ పవర్ డెస్క్:అరుణాచల్‌ప్రదేశ్ భారత్‌లో అంతర్భాగమని విదేశాంగ శాఖ మరోసారి స్పష్టం చేసింది. అది ఎప్పటికీ భారత్‌లో అంతర్భాగంగానే ఉంటుందని పేర్కొంది.

- మిగతా 2లో

## తప్పులకు 'ఏఐ'ని నిందిస్తే కుదరదు:

### బ్యాంకులకు ఆర్బీఐ గట్టి హెచ్చరిక



- ఏఐపై అర్థవంతమైన మానవ పర్యవేక్షణ ఉండాలని సూచన
- 'అల్గారిథమ్ నిర్ణయించింది' అనే సమాధానం ఆమోదయోగ్యం కాదన్న ఆర్బీఐ
- రుణాలు, కస్టమర్ సేవలో ఏఐ ఎంతో ఉపయోగకరమని వెల్లడి
- ఏఐతో జరిగే మోసాలను ఎదుర్కోవడానికీ ఏఐయే అవసరమని వ్యాఖ్య

- మిగతా 2లో

## 'కేరళ' ఇకపై 'కేరళం'.. బిల్లుకు లోక్‌సభ ఆమోదం

- కేరళ పేరును 'కేరళం'గా మార్చే బిల్లుకు లోక్‌సభ ఆమోదం
- విపక్షాల నిరసనల మధ్య చర్చ లేకుండానే ఆమోదముద్ర
- కేరళ అసెంబ్లీ చేసిన తీర్మానం మేరకు కేంద్రం చర్యలు

- మిగతా 2లో





## ప్రతి ఇంటా త్రివర్ణ పతాకం.. ఆగస్టు 15ను పండుగలా జరుపుకుందాం

- 'హర్ ఘర్ తిరంగా'లో పాల్గొనాలని మోదీ పిలుపు
- ఆగస్టు 15న ప్రతి ఇంటా త్రివర్ణ పతాకం ఎగరేయాలని సూచన
- స్వాతంత్ర్య సమరయోధులకు నివాళులర్పించాలని విజ్ఞప్తి
- 'వికసిత్ భారత్' నిర్మాణానికి ప్రతిజ్ఞ చేయాలని పిలుపు
- ఈ ఏడాది 'వందేమాతరం'కు ప్రత్యేక ప్రాధాన్యం

- మిగతా 2లో

## ఎడిటర్ వ్యూ

### జమిలి ఎన్నికలకు బ్రేక్ పడినట్లేనా?.. తెలుగు రాష్ట్రాలలో సీట్ల పెంపు లేనట్లేనా?

2029 లో జమిలి ఎన్నికలకు సంబంధించి కొంత సందిగ్ధత నెలకొంది. దీంతో పాటు ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో అసెంబ్లీ సీట్ల పెంపుదల కూడా కష్టమేనని అనిపిస్తుంది. పార్లమెంటు సమావేశాలు జరుగుతున్న తీరును చూస్తుంటే ప్రస్తుతం ఉభయ సభల్లో డీలిమిటేషన్ కు సంబంధించిన బిల్లులు ఆమోదం పొందే అవకాశాలు లేవు. ఇప్పటికే ఒకసారి వీగిపోయిన డీ లిమిటేషన్, మహిళా రిజర్వేషన్ బిల్లు మరోసారి ఉభయ సభల ముందుకు తెచ్చి ఆమోదం పొందుదామని కేంద్ర ప్రభుత్వం ఎంత ప్రయత్నించినా వీలు కుదరడం లేదు. వన్ నేషన్.. వన్ ఎలక్షన్ అనేది కూడా జరిగేది కష్టంగానే కనిపిస్తుంది. కేంద్ర ప్రభుత్వం ఆలోచనలకు విపక్షాలు అడ్డుకట్ట వేస్తుండటంతో ఈ దఫా రెండు తెలుగు రాష్ట్రాల్లో సీట్ల సంఖ్య పెరుగుదలపై కూడా పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

**బొద్దింకల ఉద్యమంతో...**

నీట్ ప్రశ్నాపత్రం లీకేజీ కారణంగ జెన్ జీల ఉద్యమం తర్వాత రాజకీయ పరిణామాలు వేగంగా మారుతున్నాయి. నిన్న మొన్నటి వరకూ డీలిమిటేషన్ కు మద్దతిచ్చిన విపక్షాల్లోని డీఎంకే వంటివి కూడా ఇప్పుడు వెనక్కుతగ్గాయి. దీంతో వన్ నేషన్ వన్ ఎలక్షన్, డీలిమిటేషన్, మహిళ రిజర్వేషన్ల అమలుపై నీలి నీడలు కమ్ముకుంటున్నట్లుంది. జమిలి ఎన్నికలకు రాజ్యాంగ, న్యాయ, సవరణలు అవసరం. ఈ అడ్డంకులను అధికమించేందుకు బీజేపీ చేస్తున్న ప్రయత్నాలు ఫలించడం లేదు. ఉభయ సభల్లో మేజార్టీ కోసం వ్యూహాత్మకంగా అడుగులు వేస్తున్నా అది బెడిసి కొడుతుంది. వర్షాకాలం పార్లమెంటు సమావేశాల్లో డీలిమిటేషన్, మహిళ రిజర్వేషన్ బిల్లులను తేవాలని ఆలోచించిన ప్రభుత్వం చివరి నిమిషంలో విరమించుకుంది. తృణమూల్ కాంగ్రెస్ ను చీల్చి ఎంపీలను తమ వైపునకు తిప్పుకున్నా అనుకున్న మెజారిటీ మాత్రం రాలేదు.

**మెజారిటీ లేకపోవడంతో...**

లోక్ సభలో ఎన్డీయేకు తగిన మేజార్టీ ఉన్నప్పటికీ రాజ్యసభలో లేదు, ప్రతిపక్ష ఇండి కూటిమికి బలం ఉంది. జమిలి ఎన్నికల కోసం రాజ్యాంగ సవరణ బిల్లులు లోక్‌సభలో ఆమోదం పొందిన రాజ్యసభలో గట్టెక్కే పరిస్థితి లేదు. బీజేపీ తన లక్ష్యాన్ని చేరుకోవడానికి చేస్తున్న ప్రయత్నాలు ఫలితం ఇవ్వడం లేదు. అన్నీ సాఫీగా జరుగుతున్న సమయంలో బీజేపీపై బొద్దింకలు వచ్చి పడ్డాయి. రాష్ట్ర విభజన తర్వాత తెలుగు రాష్ట్రాలు తమ అసెంబ్లీ స్థానాలను పెంచుకోవచ్చు. విభజన చట్టం సెక్షన్ 26 ప్రకారం, ఏపీ అసెంబ్లీ స్థానాలు 175 నుండి 225కి, తెలంగాణ స్థానాలు 119 నుండి 153కి పెరగాలి కానీ దానిని కేంద్రం అమలు చేయలేదు. తమకు అవసరమైన జమ్ము కాశ్మీర్ వంటి చోట్ల అసెంబ్లీ స్థానాలను బీజేపీ పెంచింది కానీ, తెలుగు రాష్ట్రాల్లో పెంచడం లేదు. దీంతో ఈ సారి కూడా ఏపీ, తెలంగాణలో సీట్ల పెంపుదల కష్టమేనని ఢిల్లీ వర్గాలు చెబుతున్నాయి. మరి ఏం జరుగుతుందన్నది చూడాలి.

# పరుగులు పెడుతున్న ఏపీ ఆర్థిక వ్యవస్థ.. జాతీయ సగటు కంటే మెరుగైన వృద్ధి

- మొదటి పేజీ తరువాయి

విభాగం అధికారులు ఈ నివేదికను సమర్పించారు. నివేదిక ప్రకారం, వ్యవసాయ, పారిశ్రామిక, సేవా రంగాల్లో రాష్ట్రం గణనీయమైన వృద్ధిని సాధించింది. 2025-26 రెండో త్రైమాసికంలో వ్యవసాయ రంగం 13.5 శాతం, పారిశ్రామిక రంగం 10.6 శాతం, సేవా రంగం 9.9 శాతం వృద్ధిని నమోదు చేశాయి. ముఖ్యంగా సుగంధ ద్రవ్యాల ఉత్పత్తి 304 శాతం, వాణిజ్య వాహనాల విక్రయాలు 51.6 శాతం, ఎస్‌టిపిఐ (స్టాx) ఎగుమతులు 32.2 శాతం మేర పెరిగాయి. సాంకేతికత వినియోగం ద్వారా జీఎస్టీ వసూళ్లు 21 శాతం వృద్ధితో రూ.13,282 కోట్లకు చేరాయి. రాష్ట్రంలోకి పెట్టుబడుల ప్రవాహం కూడా ఆశాజనకంగా ఉంది. రూ. 2.88 లక్షల కోట్ల విలువైన మెగా ప్రాజెక్టుల పెట్టుబడుల్లో 75.4 శాతం మేర గ్రౌండింగ్ పూర్తయింది.

ఈ నివేదికను సమీక్షించిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, రాష్ట్రం ఎదుర్కొంటున్న ప్రస్తుత సవాళ్లపై అధికారులకు పలు సూచనలు చేశారు. ఎల్ నినో ప్రభావంతో వర్షపాతం తక్కువగా నమోదైందని, కృష్ణా నదిలో నీటి లభ్యత లేక శ్రీశైలం, నాగార్జునసాగర్ వంటి ప్రధాన ప్రాజెక్టులు నిండలేదని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఇటువంటి సంక్షోభ పరిస్థితుల్లోనూ రాష్ట్ర స్థూల ఉత్పత్తి లక్ష్యాలు దెబ్బతినకుండా పటిష్ఠమైన కార్యాచరణ రూపొందించాలని అధికారులను ఆదేశించారు.

రాష్ట్రం 15 శాతం వృద్ధి రేటును సాధించేలా ప్రణాళికలు సిద్ధం చేయాలని సీఎం స్పష్టం చేశారు. అన్ని ప్రభుత్వ శాఖల్లోనూ సాంకేతికతను సమర్థవంతంగా వినియోగించుకోవాలని, ప్రజలపై ధరల భారం పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. జిల్లా, నియోజకవర్గం, మండలాల వారీగా నివేదికలు రూపొందిస్తే లక్ష్యాల సాధన సులభమవుతుందని పేర్కొన్నారు. ఈ సమీక్షా సమావేశంలో ఆర్థిక, ప్రణాళికా శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## భారత్‌లో అరుణాచల్ అంతర్భాగం.. మార్చడం ఎవరితరం కాదు

- మొదటి పేజీ తరువాయి

ఈ వాస్తవాన్ని మార్చడం ఎవరితరం కాదని తేల్చిచెప్పింది. అరుణాచల్‌లో 27 ప్రాంతాలకు భారత పేర్లను అధికారికంగా గుర్తించడంపై చైనా చేసిన వ్యాఖ్యల నేపథ్యంలో భారత్ ఈ మేరకు స్పందించింది. విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి రణ్‌ధీర్ జైస్వాల్ మంగళవారం నిర్వహించిన మీడియా సమావేశంలో మాట్లాడారు. అరుణాచల్‌ప్రదేశ్ భారత్‌లో విడదీయలేని, అంతర్భాగమని పేర్కొన్నారు. ఈ విషయంలో ఎలాంటి సందేహాలకు తావులేదన్నారు. భారత నిర్ణయాన్ని 'చెల్లదు' అంటూ చైనా చేసిన ప్రకటనను పరోక్షంగా ప్రస్తావిస్తూ.. ఈ వాస్తవాన్ని ఎవరూ మార్చలేరని స్పష్టం చేశారు. భారత్-చైనా సంబంధాల్లో సరిహద్దు అంశాలు అత్యంత కీలకమైనవని జైస్వాల్ తెలిపారు. సరిహద్దుల్లో శాంతి, ప్రశాంతత కొనసాగడం రెండు దేశాల విస్తృత సంబంధాలకు ఎంతో ముఖ్యమన్నారు. సరిహద్దు పరిస్థితులు ద్వైపాక్షిక సంబంధాలపై ప్రభావం చూపుతాయని స్పష్టం చేశారు.

ఆగస్టు 6న జరిగిన భారత్-చైనా సరిహద్దు వ్యవహారాల సంప్రదింపులు, సమన్వయ యంత్రాంగం 36వ సమావేశంలో వాస్తవాధీన రేఖ వెంట పరిస్థితిని సమీక్షించినట్లు తెలిపారు. సరిహద్దుల్లో శాంతి, ప్రశాంతత కొనసాగించాల్సిన అవసరాన్ని భారత్ మరోసారి నొక్కి చెప్పిందన్నారు. పెండింగ్ సమస్యల పరిష్కారానికి ఇప్పటికే ఉన్న దౌత్య, సైనిక మార్గాలను కొనసాగించాలని రెండు దేశాలు అంగీకరించినట్లు జైస్వాల్ తెలిపారు. డబ్ల్యూఎంసీసీ సమావేశాలు, స్థానిక కమాండర్ స్థాయి చర్చలు సహా ఇతర అంగీకరించిన మార్గాల ద్వారా సమస్యలను పరిష్కరించేందుకు ప్రయత్నిస్తామని చెప్పారు.

## నకిలీ పోలీసులతో ర్యాలీలా? వైసీపీపై హోంమంత్రి అనిత నిప్పులు

- మొదటి పేజీ తరువాయి

దిగజారుడు చర్యలకు ఒడిగడుతున్నారని ధ్వజమెత్తారు. అసలు నకిలీ పోలీసుల ముసుగులో ర్యాలీలు చేస్తూ సమాజానికి ఏం సందేశం ఇవ్వాలనుకుంటున్నారని ప్రశ్నించిన ఆమె, ముసుగులు వేసుకుని క్రిమినల్ రాజకీయాలు చేసేవారికి రాజకీయాల్లో కొనసాగే అర్హతే లేదని తేల్చి చెప్పారు. పోలీసు వ్యవస్థ గౌరవాన్ని, విశ్వసనీయతను దెబ్బతీసే ఏ ఒక్క చర్యను కూడా కూటమి ప్రభుత్వం ఉపేక్షించబోదని హోంమంత్రి స్పష్టం చేశారు. స్వార్థ రాజకీయాల కోసం ప్రభుత్వ వ్యవస్థలను దిగజార్చాలని చూస్తే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. ఈ ఘటనలో ర్యాలీలో పాల్గొన్న నకిలీ పోలీసులతో పాటు, వారి వెనకుండి నడిపించిన అసలు వైసీపీ సూత్రధారులపైనా చట్టపరంగా అత్యంత కఠిన చర్యలు తీసుకుంటామని హోంమంత్రి అనిత హెచ్చరించారు.

## డీఎస్సీ వ్యవహారంపై సీబీఐ విచారణ జరగాల్సిందే.. నారా లోకేశ్ తక్షణమే రాజీనామా చేయాలి

- మొదటి పేజీ తరువాయి

, పోస్టులను విచ్చలవిడిగా అమ్ముకుని రూ. కోట్లు దోచుకున్నారని మండిపడ్డారు. విద్యార్థులు, నిరుద్యోగుల భవిష్యత్తుతో ఆడుకోవడం ఆపి, వెంటనే పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్‌తో పాటు నిరుద్యోగ భృతిని విడుదల చేయాలని ఆర్కే రోజా డిమాండ్ చేశారు.

## తప్పులకు 'ఏఐ'ని నిందిస్తే కుదరదు: బ్యాంకులకు ఆర్బీఐ గట్టి హెచ్చరిక

కృత్రిమ మేధ (ఏఐ) వినియోగంలో బ్యాంకులు అత్యంత బాధ్యతాయుతంగా వ్యవహరించాలని భారతీయ రిజర్వ్ బ్యాంక్ (ఆర్బీఐ) గవర్నర్ సంజయ్ మల్హోత్రా స్పష్టం చేశారు. 'ఏఐ' వ్యవస్థలు తీసుకునే నిర్ణయాలకు సంబంధించి పూర్తి జవాబుదారీతనం బ్యాంకులదేనని, పొరపాటు జరిగినప్పుడు ఏఐ మోడళ్లను నిందించడం ఆమోదయోగ్యం కాదని గట్టిగా హెచ్చరించారు. మంగళవారం ముంబైలో ఫిక్కీ, ఇండియన్ బ్యాంక్స్ అసోసియేషన్ సంయుక్తంగా నిర్వహించిన 'ఫైబాక్ 2026' సదస్సులో ఆయన ఈ కీలక వ్యాఖ్యలు చేశారు.

ఏదైనా నిర్ణయం విషయంలో అంతిమ బాధ్యత బ్యాంకుదే తప్ప, సేవలు అందించిన వెండార్‌ది, అల్గారిథమ్‌ది కాదని మల్హోత్రా స్పష్టం చేశారు. "ఈ నిర్ణయం తీసుకున్నది మోడల్ అని చెప్పడం సమర్థనీయం కాదు. రెగ్యులేటర్‌గా మేము కానీ, కస్టమర్లు కానీ ఇటువంటి సమాధానాలను ఎప్పటికీ అంగీకరించం" అని ఆయన తేల్చి చెప్పారు. మానవ మేధస్సుకు ప్రత్యామ్నాయంగా కాకుండా, దానికి అదనపు తోడ్పాటునిచ్చే సాధనంగా మాత్రమే ఏఐని వినియోగించుకోవాలని సూచించారు. ఏఐ అందించే సిఫార్సులను విశ్లేషించగలగడం, అవసరమైనప్పుడు జోక్యం చేసుకుని వాటిని సవరించగలగడం వంటి పటిష్టమైన మానవ పర్యవేక్షణ వ్యవస్థలో అంతర్భాగంగా ఉండాలని మల్హోత్రా నొక్కిచెప్పారు. ప్రతి బ్యాంకు బోర్డు ఆమోదించిన నిర్దిష్ట ఏఐ విధానాన్ని కలిగి ఉండాలని, థర్డ్-పార్టీల నుంచి సేవలు పొందినప్పటికీ ఫలితాలకు బ్యాంకులే జవాబుదారీగా ఉండాలని స్పష్టం చేశారు. కస్టమర్ సేవలను మెరుగుపరచడం, జీఎస్టీ ఫైలింగ్స్, డిజిటల్ ఫుట్‌ప్రింట్స్ వంటి డేటా ఆధారంగా రుణ సదుపాయాలను విస్తరించడం, మోసాలను గుర్తించడం వంటి అంశాల్లో ఏఐకి అపారమైన సామర్థ్యం ఉందని గవర్నర్ పేర్కొన్నారు. అదే సమయంలో, మోడల్ పక్షపాతం, డేటా గోప్యత, సైబర్ భద్రతా ముప్పుల పట్ల బ్యాంకులు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. ఏఐ ద్వారా జరిగే మోసాలను అడ్డుకోవడానికి కూడా తిరిగి అదే ఏఐ సాంకేతికతను ఆయుధంగా వినియోగించుకోవాలని వ్యాఖ్యానించారు.

## ఆక్వా రంగానికి 'పవర్' ఊరట:

రాష్ట్రాన్ని ఐదేళ్లపాటు వెంటిలేటర్‌పై పడేసిన వాళ్లకు, తాడేపల్లి ప్యాలెస్ దాటని మాజీ సీఎం జగన్‌కు ఆక్వా రైతుల కష్టాల గురించి మాట్లాడే హక్కే లేదంటూ వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. గొడ్డలి పార్టీతో ప్రజలు జాగ్రత్తగా ఉండకపోతే భవిష్యత్తుకే ప్రమాదమని ఆయన హెచ్చరించారు. సంక్షోభంలో ఉన్న ఆక్వా రంగానికి ఊపిరి పోస్తూ రూ.1,150 కోట్ల విద్యుత్ సబ్సిడీకి సంబంధించిన జీవోను మంత్రి విడుదల చేశారు. పాలకొల్లులో ఆక్వా రైతులు ఏర్పాటు చేసిన భారీ బహిరంగ సభకు మంత్రులు గొట్టిపాటి రవికుమార్, నిమ్మల రామానాయుడు, అసెంబ్లీ ఉపసభాపతి రఘురామకృష్ణరాజులతో కలిసి అచ్చెన్నాయుడు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఆక్వారంగం అనేది సీఎం చంద్రబాబు నాయుడి మానసపుత్రిక అని అభివర్ణించిన ఆయన, ఐదు కోట్ల ఆంధ్రులు చేసుకున్న పూర్వజన్మ సుకృతం వల్లనే చంద్రబాబు వంటి దార్శనిక నేత దక్కారని కొనియాడారు. 2019లో ప్రజలు ఆవేశపడి దోపిడీదారులకు అధికారం కట్టబెట్టడం వల్లే రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ ఐదేళ్లపాటు తీవ్ర ఐసీయూ స్థితిలోకి వెళ్లిందని, నాటి వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకు ఇప్పుడు జగన్ ప్రతి చిన్న విషయాన్నీ సమస్యగా చిత్రీకరించే చవకబారు రాజకీయాలు చేస్తున్నారని మండిపడ్డారు.

ఎంతటి నిధుల కొరత ఉన్నప్పటికీ ఆక్వా రైతులను ఆదుకోవాలనే ఏకైక సంకల్పంతో ఈ భారీ విద్యుత్ సబ్సిడీని సకాలంలో విడుదల చేశామని మంత్రి వెల్లడించారు. మేనిఫెస్టోలో ఇచ్చిన ప్రతీ హామీతో పాటు, చెప్పని అనేక సంక్షేమ కార్యక్రమాలను సైతం ఈ 26 నెలల స్వల్ప వ్యవధిలోనే నెరవేర్చామని గర్వంగా ప్రకటించారు. ప్రధాని నరేంద్ర మోదీ సాయంతో ఏపీ అభివృద్ధి పథంలో పరుగులు తీస్తోందని, రాష్ట్రానికి ఉన్న సుదీర్ఘ తీరప్రాంతాన్ని ప్రధాన ఆదాయ వనరుగా మారుస్తూ 'బ్లూ ఎకానమీ' దిశగా ఆంధ్రప్రదేశ్‌ను సరికొత్త శిఖరాలకు తీసుకెళ్తున్నామని చెప్పారు.

## ప్రతి ఇంటా త్రివర్ణ పతాకం.. ఆగస్టు 15ను పండుగలా జరుపుకుందాం

స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా 'హర్ ఘర్ తిరంగా' కార్యక్రమంలో ప్రజలు చురుగ్గా పాల్గొనాలని ప్రధాని నరేంద్ర మోదీ పిలుపునిచ్చారు. ఆగస్టు 15న ప్రతి ఇంటా త్రివర్ణ పతాకాన్ని ఎగురవేసి స్వాతంత్య్ర సమరయోధులకు నివాళులర్పించాలని కోరారు. 'హర్ ఘర్ తిరంగా.. ఘర్ ఘర్ తిరంగా.. హర్ మన్ తిరంగా' అంటూ దేశ ప్రజల్లో స్ఫూర్తి నింపారు. ఇన్‌స్టాగ్రామ్‌లో ఓ రీల్‌ను షేర్ చేసుకున్న ప్రధాని.. ఆగస్టు 15ను గర్వంగా జరుపుకోవాలని సూచించారు. 'వికసిత్ భారత్' నిర్మాణానికి కృషి చేస్తామని ప్రతిజ్ఞ చేయాలని పిలుపునిచ్చారు. "ప్రతి ఇంటా హర్ ఘర్ తిరంగాను ఓ వేడుకగా మార్చుకుందాం" అని పేర్కొన్నారు. ఇటీవల 'ఎక్స్' వేదికగానూ మోదీ 'హర్ ఘర్ తిరంగా'లో ఉత్సాహంగా పాల్గొనాలని ప్రజలను కోరారు. త్రివర్ణ పతాకం దేశ గర్వానికి ప్రతీక అని తెలిపారు. దేశం కోసం అత్యుత్తమంగా పనిచేయాలనే స్ఫూర్తిని అది అందిస్తుందని పేర్కొన్నారు.

ఈ ఏడాది 'హర్ ఘర్ తిరంగా' కార్యక్రమాన్ని 'వందేమాతరం' 150వ వార్షికోత్సవానికి అంకితం చేస్తున్నట్లు ప్రధాని తెలిపారు. దేశభక్తి, త్రివర్ణం పతాకంపై గర్వం, మాతృభూమిపై ప్రేమను చాటేలా కార్యక్రమాన్ని నిర్వహించాలని సూచించారు. 'ఆజాదీ కా అమృత్ మహోత్సవ్'లో భాగంగా ప్రారంభమైన 'హర్ ఘర్ తిరంగా' ద్వారా జాతీయ పతాకంతో ప్రజలకు మరింత వ్యక్తిగత అనుబంధం ఏర్పడేలా ప్రోత్సహిస్తున్నారు.


## ఆగస్టు 18 నుంచి కేబీఆర్ పార్క్ చుట్టూ వన్-వే ట్రాఫిక్

హైదరాబాద్‌లోని కాసు బ్రహ్మానంద రెడ్డి (కేబీఆర్) నేషనల్ పార్కు పరిసరాల్లో ట్రాఫిక్ రద్దీని నియంత్రించేందుకు హైదరాబాద్ ట్రాఫిక్ పోలీసులు కీలక నిర్ణయం తీసుకున్నారు. ఆగస్టు 18వ తేదీ నుంచి పార్కు చుట్టూ వన్-వే ట్రాఫిక్ విధానాన్ని అమలు చేయనున్నట్లు ప్రకటించారు. హెచ్-సిటీ ప్రాజెక్టులో భాగంగా చేపట్టిన ఫ్లైఓవర్లు, అండర్‌పాస్‌ల నిర్మాణ పనుల దృష్ట్యా ఈ మార్పులు చేస్తున్నట్లు వెల్లడించారు. నిర్మాణ పనుల కారణంగా రహదారి వెడల్పు తగ్గడంతో పాటు వాహనాల రద్దీ గణనీయంగా పెరిగిందని పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనార్ వివరించారు. దీనివల్ల ఉభయ దిశల్లో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతోందని, అందుకే వన్-వే విధానాన్ని అమలు చేయాలని నిర్ణయించినట్లు తెలిపారు. ఈ విధానాన్ని పూర్తిస్థాయిలో అమల్లోకి తీసుకురావడానికి ముందు నిర్వహించిన పైలట్ ట్రయల్స్ ద్వారా ప్రణాళికను మరింత మెరుగుపరిచినట్లు ఆయన పేర్కొన్నారు. నూతన విధానం అమలు కోసం పోలీసులు పకడ్బందీ ఏర్పాట్లు పూర్తి చేశారు. ప్రధాన కూడళ్లలో లేన్ మార్కింగ్, లేన్ ఛేంజర్లు, దిశను సూచించే సైన్ బోర్డులను ఏర్పాటు చేశారు. వాహనాల రాకపోకలను క్రమబద్ధీకరించేందుకు 24 గంటల పాటు ట్రాఫిక్ సిబ్బంది విధుల్లో ఉంటారని తెలిపారు. అలాగే, నావిగేషన్ యాప్‌లను సైతం అప్‌డేట్ చేశారు. ఇంటిగ్రేటెడ్ కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్, సీసీటీవీ నెట్‌వర్క్, డ్రోన్ల ద్వారా పరిస్థితిని నిరంతరం పర్యవేక్షిస్తూ, అవసరమైన చోట తక్షణ మార్పులు చేస్తామని వెల్లడించారు. నిర్మాణ పనులు పూర్తయ్యే వరకు ఈ వన్-వే విధానం అమలులో ఉంటుందని పోలీసులు స్పష్టం చేశారు. వాహనదారులు తమ ప్రయాణాలను ముందుగానే ప్రణాళిక చేసుకోవాలని, నిర్దేశించిన మార్గాల్లోనే ప్రయాణించాలని కోరారు. ముఖ్యంగా ట్రాఫిక్ నిబంధనలకు విరుద్ధంగా వ్యతిరేక దిశలో వాహనాలు నడపవద్దని వారు సూచించారు.

## 'కేరళ' ఇకపై 'కేరళం'.. బిల్లుకు లోక్‌సభ ఆమోదం

కేరళ రాష్ట్రం పేరును 'కేరళం'గా మారుస్తూ ప్రతిపాదించిన బిల్లుకు లోక్‌సభ ఆమోదం తెలిపింది. మంగళవారం విపక్ష సభ్యుల నినాదాలు, నిరసనల మధ్య ఎటువంటి చర్చ లేకుండానే ఈ బిల్లును సభ మూజువాణి ఓటుతో ఆమోదించింది. ఫలితంగా రాష్ట్రం పేరు మార్పు ప్రక్రియలో మరో కీలక ఘట్టం పూర్తయింది. కేంద్ర హోంమంత్రి అమిత్ షా సభలో లేకపోవడంతో, ఆయన తరఫున హోం శాఖ సహాయ మంత్రి నిత్యానంద రాయ్ 'కేరళ (పేరు మార్పు) బిల్లు, 2026'ను ప్రవేశపెట్టారు. ఢిల్లీలో నిరసనకారులపై పోలీసుల చర్యలతో పాటు ఇతర కీలక అంశాలపై అమిత్ షా వివరణ ఇవ్వాలని డిమాండ్ చేస్తూ విపక్షాలు ఆందోళన చేపట్టాయి. ఈ గందరగోళ పరిస్థితుల నడుమనే బిల్లుకు సభ ఆమోదం ముద్రవేసింది. మలయాళంలో తమ రాష్ట్రాన్ని 'కేరళం' అని పిలుస్తారని, అధికారికంగా కూడా అదే పేరును ఖరారు చేయాలని కేరళ శాసనసభ 2024 జూన్‌లో తీర్మానం చేసింది. ఈ ప్రతిపాదనకు కేంద్ర మంత్రివర్గం ఆమోదం తెలిపిన అనంతరం, రాష్ట్రపతి ఈ ముసాయిదా బిల్లును రాష్ట్ర అసెంబ్లీకి పంపారు. 2026 జులైలో అసెంబ్లీ దీనికి ఏకగ్రీవంగా మద్దతు తెలిపింది. ఈ బిల్లు ఆమోదంతో రాజ్యాంగంలోని మొదటి షెడ్యూల్‌లో సవరణలు జరగనున్నాయి.

# దుర్గమ్మ భక్తులకు గుడ్ న్యూస్.. ఇక ఏటీఎంలో లడ్డూ!



**విజయవాడ: పెన్ పవర్, ఆగస్ట్, 11 :** ఇంద్రకీలాద్రి కనకదుర్గమ్మ ఆలయంలో భక్తుల సౌకర్యార్థం సరికొత్త టెక్నాలజీని అందుబాటులోకి తీసుకురావడానికి ఆలయ అధికారులు ప్రణాళిక సిద్ధం చేస్తున్నారు. ఆన్‌లైన్‌లో లడ్డూ ప్రసాదాన్ని బుక్ చేసుకున్న భక్తులు ప్రత్యేక ఏటీఎం తరహా మిషన్‌లో ఓటీపీ నమోదు చేస్తే లడ్డూలు నేరుగా పొందే విధానాన్ని ప్రవేశపెట్టనున్నారు. ఒక్కసారి 1 నుంచి 6 లడ్డూల వరకు మిషన్ ద్వారా తీసుకునే అవకాశం కల్పించనున్నారు. మొత్తం ఆలయంలో 6 లడ్డూ ఏటీఎం మిషన్లు ఏర్పాటు చేయాలని అధికారులు భావిస్తున్నారు. దసరా నవరాత్రుల నాటికి ఈ సదుపాయాన్ని ప్రారంభించాలని ప్రణాళిక రూపొందిస్తున్నారు. దసరా వంటి పర్వదినాల్లో లడ్డూ ప్రసాదానికి భారీగా డిమాండ్ ఉంటుంది. ఏటా సుమారు 30 నుంచి 35 లక్షల లడ్డూల విక్రయాలు జరుగుతుండగా, ఈ ఏడాది భక్తుల రద్దీ మరింత పెరిగే అవకాశం ఉంది. క్యూ లైన్లలో గంటల తరబడి వేచి ఉండాల్సిన అవసరం లేకుండా ఈ విధానం భక్తులకు సౌకర్యంగా ఉంటుందని ఆలయ అధికారులు తెలిపారు.

పెన్ పవర్
సెంట్రల్ ఆంధ్ర
ఏన్.టి.ఆర్ జిల్లా । కృష్ణా । గుంటూరు । పల్నాడు । బాపట్ల

# స్వాతంత్ర్య దినోత్సవ ఏర్పాట్లు పక్కాగా ఉండాలి

## : జిల్లా కలెక్టర్ సి.యం.సాయికాంత్ వర్మ

**గుంటూరు, పెన్ పవర్, ఆగస్ట్, 11 :** రాజధాని పెరేడ్ గ్రౌండ్స్ లో నిర్వహిస్తున్న స్వాతంత్ర్య దినోత్సవ ఏర్పాట్లు పక్కాగా ఉండాలని జిల్లా కలెక్టర్ సి.యం.సాయికాంత్ వర్మ అన్నారు. స్వాతంత్ర్య దినోత్సవ ఏర్పాట్లపై సి.ఆర్.డి.ఏ కార్యాలయంలో మంగళ వారం సంబంధిత అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ 13వ తేదీన ఫుల్ డ్రెస్ రిహార్సల్స్ నిర్వహించుటకు సిద్ధం చేయాలని స్పష్టం చేశారు. రాష్ట్ర ముఖ్యమంత్రి, మంత్రులు, న్యాయాధికారులు, అఖిల భారత సర్వీసుల అధికారులు, మీడియా తదితరులు కూర్చునే ప్రదేశాల వద్ద ఏర్పాట్లు చేయాలని అన్నారు. అతిథులు వచ్చే మార్గాలు, పార్కింగ్ ప్రదేశం, వాహనాల రద్దీ దృష్ట్యా ట్రాఫిక్ ప్లాన్ పక్కాగా ఉండాలని స్పష్టం చేశారు. ప్రభుత్వ శాఖలు తమ ప్రగతిని ప్రదర్శించే శకటాలుహొతయారీ పూర్తి చేయాలని, 13వ తేదీన జరిగే తుది రిహార్సల్స్ లో పూర్తి స్థాయిలో ప్రదర్శన చూపాలని ఆదేశించారు. అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి విజయవంతం చేయాలని ఆదేశించారు. అంతకముందు 13వ తేదీన



సీడ్ యాక్సెస్ రోడ్, స్టీల్ బ్రిడ్జిల ప్రారంభోత్సవాల దృష్ట్యా ఏర్పాట్లను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో గుంటూరు జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్, నగరపాలక సంస్థ కమిషనర్ కె.మయూర్ అశోక్, జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ, ప్రోటోకాల్ డైరెక్టర్ మోహన్ రావు, రెవిన్యూ డివిజనల్ అధికారి కె.శ్రీనివాస రావు, తహసిల్దార్ హరిబాబు తదితరులు పాల్గొన్నారు.

# స్వాతంత్ర్య దినోత్సవం ఏర్పాట్లలో ఎలాంటి అలసత్వానికి తావులేదు : జిల్లా కలెక్టర్ లక్ష్మీశ

**విజయవాడ, పెన్ పవర్,ఆగస్టు 11 :** ఎన్టీఆర్ జిల్లాలో ఆగస్టు 15న నిర్వహించనున్న స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను రాష్ట్రస్థాయి వేడుకలకు దీటుగా ఘనంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ అధికారులను ఆదేశించారు. విజయవాడ సింగ్‌నగర్‌లోని మాకినేని బసవ పున్నయ్య స్టేడియంలో నిర్వహించనున్న వేడుకల్లో రాష్ట్ర ఐటీ, విద్యాశాఖల మంత్రి నారా లోకేష్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించనున్నారు. వేడుకల ఏర్పాట్లను మంగళవారం కలెక్టర్, జాయింట్ కలెక్టర్ ఎస్.ఇలక్కియ, విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ హెచ్.ఎం.ధ్యాన్ చంద్రతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అనంతరం అధికారులతో సమీక్ష నిర్వహించారు. వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని రైన్‌ప్రూఫ్ టెంట్లు, తాగునీరు, సిట్టింగ్ అరేంజ్‌మెంట్లు, వైద్య శిబిరం, నిరంతర విద్యుత్ సరఫరా, అదనపు జనరేటర్లను సిద్ధంగా ఉంచాలని సూచించారు. సుమారు 4 వేల మంది హాజరయ్యే అవకాశం ఉన్నందున పటిష్టమైన పోలీసు బందోబస్తు,



సీసీ కెమెరాలు, కేడింగ్, ప్రత్యేక రాకపోకల మార్గాలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. పోలీస్, ఎన్‌సీసీ, స్కౌట్స్ అండ్ గైడ్స్, రెడ్‌క్రాస్ తదితర శాఖలతో నిర్వహించే పెరేడ్‌ను క్రమశిక్షణతో ఆకట్టుకునేలా నిర్వహించాలని కలెక్టర్ సూచించారు. విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు, పోలీస్ బైక్ విన్యాసాలు, అమరావతిపై ప్రత్యేక గీతం, డ్రమ్స్ ప్రదర్శన వంటి కార్యక్రమాలు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించేలా వివిధ శాఖల శకటాలను ఆకర్షణీయంగా రూపొందించాలని ఆదేశించారు. స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు జిల్లాకు ప్రతిష్టాత్మకమైన కార్యక్రమమని, అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి ఏర్పాట్లను సకాలంలో పూర్తి చేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు. చివరి నిమిషంలో ఇబ్బందులు తలెత్తకుండా ప్రతి అంశాన్ని ముందుగానే తనిఖీ చేయాలని, ఏర్పాట్లలో ఎలాంటి అలసత్వానికి తావులేదని అధికారులను ఆదేశించారు

# అవయవ దానం - మరణం తర్వాత కూడా జీవించే మహాదానం.

## బాపట్ల జిల్లా కలెక్టర్ డాక్టర్ వాసుదేవ వినోద్ కుమార్ .

**బాపట్ల:( పెన్ పవర్),ఆగస్టు 11 :** ఒక మనిషి మరణించిన తర్వాత కూడా మరొకరికి జీవితాన్ని అందించే అత్యున్నత దానం అవయవ దానం అని బాపట్ల జిల్లా కలెక్టర్ & మెజిస్ట్రేట్ మరియు రెడ్ క్రాస్ జిల్లా అధ్యక్షులు డాక్టర్ వాసుదేవ వినోద్ కుమార్ అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. అవయవ దాన పక్షోత్సవాలలో భాగంగా బాపట్ల జిల్లా రెడ్ క్రాస్ రూపొందించిన పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమంలో మాట్లాడుతూ ప్రపంచంలో అనేక మంది గుండె, కాలేయం, మూత్రపిండాలు, ఊపిరితిత్తులు వంటి అవయవాలు పనిచేయక తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్నారు. వారికి సరైన సమయంలో అవయవ మార్పిడి జరిగితే కొత్త జీవితాన్ని పొందే అవకాశం ఉంటుంది. కానీ అవసరమైన అవయవాల కొరత కారణంగా ఎంతోమంది చికిత్స కోసం ఎదురుచూస్తున్నారు. అవయవ దానం ఒక మనిషి జీవితాన్ని మాత్రమే కాదు, అనేక కుటుంబాల భవిష్యత్తును మార్చగలదు. మరణించిన వ్యక్తి అవయవాలు అవసరమైన వారికి మార్పిడి చేయడం ద్వారా గుండె, కాలేయం, మూత్రపిండాలు, ఊపిరితిత్తులు వంటి అవయవాలను అవసరమైన సందర్భాల్లో ఉపయోగించవచ్చు. కళ్ల దానం ద్వారా చూపును కోల్పోయిన వారికి వెలుగును అందించే అవకాశం ఉంటుంది. అవయవ దానం గురించి సమాజంలో ఇంకా అనేక అపోహలు ఉన్నాయి. అవయవ దానం వల్ల శరీరానికి గౌరవం తగ్గుతుందని,




మతపరమైన సమస్యలు వస్తాయని కొందరు భావిస్తారు. వాస్తవానికి, చట్టబద్ధమైన వైద్య విధానాల ప్రకారం, కుటుంబ సభ్యుల సమ్మతి మరియు సంబంధిత నియమాలను పాటిస్తూ అవయవ దానం నిర్వహించబడుతుంది. అందువల్ల ప్రజలు సరైన సమాచారాన్ని తెలుసుకుని అపోహలను తొలగించుకోవాలి. యువతలో ముఖ్యంగా అవయవ దానంపై అవగాహన పెంచడం చాలా అవసరం. పాఠశాలలు, కళాశాలలు, స్వచ్ఛంద సంస్థలు, వైద్య సంస్థలు ప్రజలకు అవయవ దానం గురించి అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలి. ప్రతి కుటుంబం కూడా ఈ విషయంపై ముందుగానే చర్చించుకోవడం వల్ల అవసరమైన సమయంలో నిర్ణయం తీసుకోవడం సులభమవుతుంది. మన జీవితం ముగిసిన తర్వాత కూడా మనలోని ఒక భాగం మరొకరి జీవితంలో కొనసాగడం కంటే గొప్ప మానవతా సందేశం మరొకటి ఉండదు. మన మరణం ఒక కుటుంబానికి విషాదం కావచ్చు; కానీ మన అవయవ దానం మరొక కుటుంబానికి ఆనందంగా మారవచ్చు. అందుకే **"మరణంతో జీవితం ముగియదు.. :** అవయవ దానంతో మరొకరి జీవితంలో మనం కొనసాగవచ్చు." అని కలెక్టర్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో టెట్రాన్ జిల్లా కోఆర్డినేటర్ విన్నిబోయిన శ్రీమన్నారాయణ,.డీఎఫ్ఓ రాజేష్, నవనీత్, కృష్ణ పాల్గొన్నారు.

# జాతీయ స్థాయి పోటీలలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి పతకాలు సాధించిన బాపట్ల జిల్లా కానిస్టేబుల్

**11వ ఆల్ ఇండియా పోలీస్ జూడో క్లస్టర్ - 2026లో స్వర్ణ, కాంస్య పతకాలతో సత్తా చాటిన కానిస్టేబుల్ వి.నరేంద్ర**

**ఆస్ట్రేలియాలో జరగనున్న 'వరల్డ్ పోలీస్ అండ్ ఫైర్ గేమ్స్'కు ఎంపిక**

**గడిచిన 2 సంవత్సరాల కాలంలో 7 జాతీయ పతకాలను సాధించిన నరేంద్ర**

**కానిస్టేబుల్ నరేంద్రను అభినందించిన జిల్లా ఎస్పీ బి.ఉమామహేశ్వర్,**

**"బాపట్ల జిల్లా పోలీస్ ఖ్యాతిని జాతీయ స్థాయిలో ఇనుమడింపజేయడం అభినందనీయం**

**పోలీస్ శాఖలో వృత్తిపరమైన విధులతో పాటు క్రీడల్లో కూడా సత్తా చాటాలి**

**క్రీడల్లో ప్రతిభ కనబరిచిన వారిని ఎల్లప్పుడూ ప్రోత్సహిస్తాం : జిల్లా ఎస్పీ బి.ఉమామహేశ్వర్,**



**బాపట్ల:( పెన్ పవర్ ), ఆగస్టు11** బాపట్ల జాతీయ స్థాయి పోటీలలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి పతకాలు సాధించిన బాపట్ల జిల్లా పోలీస్ కానిస్టేబుల్ వి.నరేంద్ర మంగళవారం జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో జిల్లా ఎస్పీ బి.ఉమామహేశ్వర్,ని మర్యాదపూర్వకంగా కలిశారు. హైదరాబాద్‌లోని గచ్చిబౌలి జీఎమ్‌సీబీ ఇండోర్ స్టేడియంలో సెంట్రల్ ఇండస్ట్రియల్ సెక్యూరిటీ ఫోర్స్ ఆధ్వర్యంలో జూలై 23 నుండి 30 వరకు నిర్వహించిన 11వ ఆల్ ఇండియా పోలీస్ జూడో క్లస్టర్ - 2026 పోటీలలో నరేంద్ర బంగారు, కాంస్య పతకాలను సాధించారు. ఈ పోటీలలో భాగంగా కానిస్టేబుల్ వి.నరేంద్ర పెన్‌చాక్ సిలాట్ (o110 కేజీల విభాగం) బంగారు పతకం, వుషు (o100 కేజీల విభాగం) లో కాంస్య పతకం సాధించారు. ఆంధ్రప్రదేశ్ పోలీస్ శాఖకు 'వుషు' విభాగంలో నరేంద్ర సాధించిన మెడల్ మొట్టమొదటిది. ఇతడికి ముందు వుషు విభాగంలో ఆంధ్రప్రదేశ్ పోలీస్ శాఖ నుండి ఎవరూ మెడల్ సాధించలేదు. గడిచిన రెండేళ్ల వ్యవధిలోనే నరేంద్ర వివిధ జాతీయ స్థాయి పోటీలలో మొత్తం 7 నేషనల్ మెడల్స్ సాధించి బాపట్ల జిల్లా పోలీస్ శాఖ గర్వించేలా చేశారు. తాజాగా సాధించిన మెడల్స్‌తో 2027 మార్చిలో ఆస్ట్రేలియాలో జరగనున్న అంతర్జాతీయ 'వరల్డ్ పోలీస్ అండ్ ఫైర్ గేమ్స్' కు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ నరేంద్రను ప్రత్యేకంగా అభినందించి, పతకాలతో సత్కరించారు. జాతీయ స్థాయిలో జరిగిన పోటీలలో పతకాలు సాధించి రాష్ట్ర, బాపట్ల జిల్లా పోలీస్ శాఖల కీర్తిప్రతిష్టలను ఇనుమడింపజేయడం ఎంతో గర్వకారణమన్నారు. భవిష్యత్తులో కూడా ఇదే విధమైన క్రీడా స్ఫూర్తిని కొనసాగిస్తూ, 2027 మార్చిలో ఆస్ట్రేలియాలో జరిగే అంతర్జాతీయ పోటీలలో సైతం సత్తా చాటి మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. నరేంద్ర, నాగవాణిలను స్ఫూర్తిగా తీసుకుని జిల్లా పోలీస్ శాఖలో విధులు నిర్వహించే పోలీస్ అధికారులు, సిబ్బంది సైతం క్రీడలలో పాల్గొని రాణించాలన్నారు. వృత్తిరీత్యా పోలీస్ శాఖలో విధులు ఎంతో ఒత్తిడితో కూడుకుని ఉంటాయని, క్రీడల వలన ఆ ఒత్తిడి దూరమవ్వడంతో పాటు శారీరక ఆరోగ్యం, మానసిక ప్రశాంతత చేకూరుతుందన్నారు. క్రీడలలో ప్రతిభ కనబరిచే పోలీస్ అధికారులు, సిబ్బందికి ప్రోత్సాహం అందిస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఏఆర్ డిఎస్పీ కృష్ణంరాజు, అడ్మిన్ ఆర్ఐ మౌలుద్దీన్, ఇతర పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# గ్రామపంచాయతీ ఆస్తులను పరిరక్షించాలి

## : జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్.వి

**బాపట్ల:( పెన్ పవర్), ఆగస్టు 11** బాపట్ల పంచాయతీ అధికారులకు పలు సూచనలు చేశారు. మంగళవారం స్థానిక కలెక్టరేట్లోని వీక్షణ సమావేశం మందిరంలో జిల్లా స్థాయి కమిటీ సమీక్ష సమావేశం జిల్లా కలెక్టర్ వారి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ వి మాట్లాడుతూ, గ్రామ పంచాయతీల ఆస్తుల పరిరక్షణకు ప్రభుత్వం ప్రత్యేక ఉత్తర్వులు ఇచ్చినట్లు ఆయన చెప్పారు. ఇందుకు సంబంధించి ఒక కమిటీ ఏర్పాటు చేసినట్లు ఆయన చెప్పారు. ఈ కమిటీ గ్రామపంచాయతీ ఆస్తులను పరిరక్షిస్తుందని ఆయన చెప్పారు. నిబంధనల మేరకు గ్రామపంచాయతీకి చెందిన భూములు, ఆస్తులను స్థూలంగా మూడు వర్గాలుగా వర్గీకరించబడ్డాయని ఆయన చెప్పారు. అందు కేటగిరి- ఏ నందు సొంత మరియు అర్జించిన ఆస్తులు, కేటగిరి - బి నందు బహుమతులు విరాళాలు మరియు బదిలీలు, కేటగిరి - సి నందు గ్రామపంచాయతీ పరిధిలోని ఆస్తుల వివరాలను నమోదు చేస్తున్నట్లు ఆయన చెప్పారు. సొంత మరియు ఆర్జించిన ఆస్తులు అనగా సాధారణ రహదారులు, కాలువలు, పశువుల పౌండ్లు, పశువుల కొట్టాలు, సాధారణ మార్కెట్ ప్రాంతాలు, ఆమోదించబడిన లేఔట్లలో 10% ఖాళీ స్థలాలు, గ్రామపంచాయతీలచే కొనుగోలు చేయబడిన సేకరించబడిన ప్రస్తుత పార్కులు మరియు భూములు, బహుమతులు విరాళాలు మరియు బదిలీలు అనగా బహుమతిగా ఇచ్చిన భూములు,




గ్రామపంచాయతీలకు విరాళంగా ఇవ్వబడినవి లేదా బదిలీ చేయబడినవి, గ్రామపంచాయతీ పరిధిలోకి వచ్చే ఆస్తులు ప్రజా నీటి పనులు, నీటి కోర్సులు, స్ప్రింగ్స్, రిజర్వాయర్లు, ట్యాంకులు, సిస్టన్స్, ఫోన్ ట్రైమ్స్, బావులు, స్టాండ్ పైపులు మరియు ఇతర నీటి పనులు, చిన్న నీటిపారుదల ట్యాంకులు మొదలైనవి గ్రామపంచాయతీ ఆస్తుల కోవలోనికి వస్తాయని ఆయన చెప్పారు. గ్రామపంచాయతీ ఆస్తులను గ్రామసభ మరియు గ్రామపంచాయతీలో ధృవీకరించాలని ఆయన చెప్పారు. గ్రామ పంచాయతీ ఆమోదించిన జాబితా వివరాలను జిల్లా గెజిట్లో ప్రచురించాలని, జిల్లా గెజిట్లో ప్రచురించిన సమాచారాన్ని వెబ్ డొమైన్ లో ఉంచి ఎప్పటికప్పుడు నవీకరించవలెనని కలెక్టర్ కమిటీ సభ్యులకు తెలిపారు. ఈ సమావేశమును ప్రతి మూడు నెలలకు ఒకసారి నిర్వహించి గ్రామపంచాయతీ ఆస్తులను పరిరక్షించాలని ఆయన అన్నారు. గ్రామపంచాయతీ లోని భూములు ఆక్రమణకు గురైనట్లయితే ఆ భూములు ఏ రకంగా వినియోగంలో ఉన్నాయో చూసి నిబంధనల మేరకు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ వి పంచాయతీ అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంయుక్త కలెక్టర్ భావన వశిష్ట, ఇంచార్జి జిల్లా రెవెన్యూ అధికారి లవన్న, జిల్లా పంచాయతీ అధికారి కే ప్రభాకర్, సర్వే మరియు ల్యాండ్ రికార్డ్స్ ఏ డి శేషగిరిరావు, ఏడి మైనింగ్ శ్రీనివాసరావు మరియు ఇతర కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# ఇతరులు అనే పదం ఉండటానికి వీల్లేదు : బాపట్ల జిల్లా కలెక్టర్

**బాపట్ల:( పెన్ పవర్) ఆగస్టు 11** బాపట్ల రీ సర్వే నిర్వహించిన భూములలో ఇతరులు అనే పదం ఉండటానికి వీలులేదని జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ వి రెవెన్యూ అధికారులకు సూచించారు. మంగళవారం స్థానిక కలెక్టరేట్ లోని వీక్షణ సమావేశ మందిరంలో 22 ఏ, రీ సర్వే, ల్యాండ్ ఎలిమినేషన్ పై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ వి మాట్లాడుతూ, జిల్లాలో 22 ఏ కేసులు పెండింగ్లో ఉన్నాయని వాటిని వెంటనే పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని ఆయన చెప్పారు. 22 ఏ కేసుల పరిష్కార బాధ్యతలను రెవిన్యూ డివిజన్ అధికారులకు బదలాయిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చినట్లు ఆయన చెప్పారు. 22 ఏ కేసులను పూర్తిగా పరిశీలించి వాటిని పరిష్కరించాలన్నారు. చుక్కల భూముల సమస్యల పరిష్కారం కొరకు వాటిని జిల్లా స్థాయి కమిటీ సమీక్ష సమావేశంలో ఉంచి వాటికి పరిష్కారం మార్గం చూపాలని కలెక్టర్ రెవెన్యూ అధికారులకు తెలిపారు. రాష్ట్రంలో మార్చి 2027 నాటికి రెవెన్యూ భూ సమస్యలు లేకుండా చూస్తానని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి చెప్పినట్లు జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ వి చెప్పారు. వేటపాలెం మండలంలో 19 గ్రామాల్లో రీ సర్వే పూర్తి చేసి పుల్లూరి పాలెం లో రీ సర్వే పూర్తి చేయకపోవుటకు గల కారణాలపై ఆయన ఆరా తీశారు. ఆ ప్రాంతంలో జాయింట్ ఎల్పీఎంలు ఎక్కువగా ఉన్నందున వాటిని పరిశీలించి పరిష్కరించాల్సిన అవసరం ఉందని రెవెన్యూ అధికారులు ఆయన దృష్టికి తీసుకువచ్చారు. వేటపాలెం మండలం వేటపాలెం గ్రామంలో డ్రాఫ్ట్ ఈ కేవైసీ పెండింగ్ ఉందన్నారు. 22 ఏ భూములకు



సంబంధించి రెవెన్యూ డివిజనల్ అధికారులు వ్యక్తిగతంగా పర్యవేక్షణ చేయాలన్నారు. రీ సర్వే జరిగే గ్రామంలో ఎంతమంది వీఆర్వోలు ఉంటే అంత మంది ఆ పనికి హాజరు కావాలని ఆయన చెప్పారు. రీ సర్వే పూర్తి అయిన గ్రామాలలో ఇతరులు ఉండటానికి వీలు లేదని అన్నారు. అలా ఉన్న గ్రామాలలో విఆర్ఓ లపై తగు చర్యలు తీసుకోబడతాయని ఆయన హెచ్చరించారు. వీఆర్వో లాగిన్ లో ఉన్న ఇతరులను ఏ విధంగా తొలగించాలో ఆ యొక్క విధానాన్ని కలెక్టర్ రెవెన్యూ అధికారులకు క్లుప్తంగా వివరించారు. భూ సమస్యలపై ప్రతిరోజు నిర్దిష్ట లక్ష్యాలను ఎంచుకొని వాటిని పూర్తి చేసి గ్రూప్ లో ఉంచాలన్నారు. సెప్టెంబర్ సైకిల్లో 10 గ్రామాలు నిర్దేశించినట్లు, వాటికి సంబంధించి డేటా ఎంట్రీ 100% పూర్తి చేయాలన్నారు. పర్చూరు, చీరాల మండలాల్లో రైతు బజార్ ల ఏర్పాటుకు కావలసిన భూమిని గుర్తించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ వి రెవిన్యూ డివిజనల్ అధికారులకు సూచించారు. మండలాల్లో కావలసిన భూమి లేనప్పుడు అగ్రికల్చర్ మార్కెట్ యార్డ్ లలో భూమిని గుర్తించి రెండు రోజుల్లో నివేదిక సమర్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంయుక్త కలెక్టర్ భావన వశిష్ట, ఇంచార్జి జిల్లా రెవెన్యూ అధికారి లవన్న, ల్యాండ్ రికార్డ్స్ ఏ డి శేషగిరిరావు, వీక్షణ సమావేశం ద్వారా ఆర్డీవోలు, తహసిల్దార్లు, వీఆర్వోలు, గ్రామ సర్వేయర్లు మరియు తదితరులు పాల్గొన్నారు.

## విదేశాలకు రాఖీలు, బహుమతులు పంపేందుకు పోస్టల్ శాఖ ప్రత్యేక సేవలు సీనియర్ సూపరింటెండెంట్ ఎమ్. నరసింహ స్వామి



**విజయవాడ:పెన్‌పవర్, ఆగస్ట్ 11 :** రాఖీ పూర్ణిమ సందర్భంగా విదేశాల్లో నివసిస్తున్న సోదర సోదరీమణులకు రాఖీలు, బహుమతులు సకాలంలో చేరేలా ఆంధ్రప్రదేశ్ పోస్టల్ శాఖ ప్రత్యేక సౌకర్యాలు అందుబాటులోకి తీసుకొచ్చింది. పోస్ట్ ఆఫీసులు, బ్రాంచ్ పోస్ట్ ఆఫీసుల ద్వారా అంతర్జాతీయ పార్శిల్, స్పీడ్ పోస్ట్ సేవలు అందుబాటులో ఉన్నాయని అధికారులు తెలిపారు. వీటి ద్వారా రాఖీలు, బహుమతులు, ఇతర వస్తువులను విదేశాలకు సురక్షితంగా పంపించుకోవచ్చని పేర్కొన్నారు. ఆగస్టు 28న రాఖీ పూర్ణిమ జరగనున్న నేపథ్యంలో ప్రజలు చివరి నిమిషం వరకు వేచి ఉండకుండా ముందుగానే సమీప పోస్టాఫీసును సంప్రదించి పార్శిళ్లను పంపించాలని పోస్టల్ శాఖ విజ్ఞప్తి చేసింది. ముఖ్యంగా గ్రామీణ ప్రాంత ప్రజలు ఈ సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరింది.

## గుంటూరు జిల్లాలో నకిలీ విలేకరుల సమస్యకు చెక్ పెట్టేందుకు చర్యలు



**గుంటూరు, పెన్ పవర్, ఆగస్ట్, 11 :** అర్హత లేకుండా కొందరు నకిలీ విలేకరులుగా చలామణి అవుతుండటంతో నిజమైన జర్నలిస్టులకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని ఆంధ్రప్రదేశ్ బ్రాడ్‌కాస్టింగ్ జర్నలిస్ట్ అసోసియేషన్ పోలీస్ శాఖను కోరడం జరిగింది. గుంటూరు జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు పోలీస్ శాఖ నుంచి అక్రిడిటేషన్ కలిగిన ప్రతి జర్నలిస్టుకు క్యూఆర్ కోడ్‌తో కూడిన ప్రత్యేక గుర్తింపు స్టిక్కర్ ఇవ్వాలని అసోసియేషన్ తరఫున కోరారు. దీంతో నిజమైన జర్నలిస్టులను సులభంగా గుర్తించడంతో పాటు. నకిలీ విలేకరుల కార్యకలాపాలకు అడ్డుకట్ట వేయవచ్చు. గుంటూరు జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ నిబంధనల ప్రకారం అర్హులైన ప్రతి జర్నలిస్టుకు పోలీస్ శాఖ తరఫున గుర్తింపు స్టిక్కర్లను పరిశీలిస్తామని సానుకూలంగా స్పందించారు. నిజమైన జర్నలిస్టుల గుర్తింపుకు పోలీస్ శాఖ తీసుకోబోయే ఈ నిర్ణయం. నకిలీ విలేకరులకు చెక్ పెట్టడంలో కీలకంగా మారనుంది.

## గ్రీన్ గుంటూరులో సామూహిక మొక్కలు నాటే కార్యక్రమం పర్యావరణ ఇంజనీర్ ఎం.డి.నజీనా



**గుంటూరు,పెన్ పవర్,ఆగస్టు 11 :** గ్రీన్ గుంటూరులో భాగంగా ఆటోనగర్ ఎ.పి.ఐ.ఐ.సి ప్రాంగణంలో సామూహిక మొక్కలు నాటే కార్యక్రమాన్ని మంగళవారం చేపట్టారు. ఎ.పి.ఐ.ఐ.సి గుర్తించిన ఖాళీ ప్రదేశాల్లో మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపడుతున్నారు. మంగళవారం జరిగిన కార్యక్రమంలో కాలుష్య నియంత్రణ మండలి పర్యావరణ ఇంజనీర్ ఎం.డి.నజీనా బేగం పాల్గొన్నారు. మొక్కలు నాటారు. అనంతరం ఆమె మాట్లాడుతూ గ్రీన్ గుంటూరు కార్యక్రమం ఉన్నతమైన కార్యక్రమం అన్నారు. ఆహ్లాదకర వాతావరణం కల్పించుటమే కాకుండా వాతావరణ సమతుల్యతకు దోహదం చేస్తుందన్నారు. ప్రతీ ఒక్కరూ ఈ కార్యక్రమంలో భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. జిల్లా యంత్రాంగం కూడా ప్రతీ ఒక్కరూ ఆరు అడుగుల మొక్కలను నాటి సెల్ఫీ తీసి పంపించాలని కోరడం జరిగిందన్నారు. గుంటూరు నగరాన్ని హరిత నగరంగా, పరిశుభ్రమైన నగరంగా తీర్చిదిద్దుటకు తీసుకున్న సంకల్పంలో భాగస్వామ్యమై పచ్చదనాన్ని నింపాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎ.పి.ఐ.ఐ.సి అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## విద్యార్థులకు పోలీసుల అవగాహన కార్యక్రమం

### దేశాయిపేట హైస్కూల్‌లో అవగాహన క్యాంప్ విద్యార్థులతో కలిసి భోజనం చేసిన ఎస్ఐ



**వేటపాలెం, పెన్ పవర్, ఆగస్టు 11 :** ఎస్పీ ఆదేశాల మేరకు నిర్వహిస్తున్న వీక్లీ షెడ్యూల్‌లో భాగంగా వేటపాలెం ఎస్ఐ జనార్ధన్ మంగళవారం దేశాయిపేట హైస్కూల్‌లో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. అనంతరం ప్రభుత్వం నిర్వహిస్తున్న డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకంలో భాగంగా విద్యార్థులతో కలిసి ఎస్ఐ భోజనం చేశారు. విద్యార్థులతో ఆప్యాయంగా మమేకమై వారి సమస్యలు, విద్యాభ్యాసం తదితర అంశాలపై మాట్లాడారు. పోలీసు శాఖ ప్రజలకు, ముఖ్యంగా విద్యార్థులకు మరింత చేరువ కావాలనే ఉద్దేశంతో ఇలాంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

## త్రాగునీటి సరఫరా, పారిశుధ్యంవంటి మౌలిక వసతులపై ఎప్పటికప్పుడు చర్యలు తీసుకోవాలి : నగరకమిషనర్ కె.మయూర్ అశోక్





**గుంటూరు, పెన్ పవర్, ఆగస్ట్, 11 :** మంగళవారం గుంటూరు తూర్పు నియోజకవర్గ శాసనసభ్యులు నసీర్ అహ్మద్ తో కలిసి కబాడీగూడెం, సంగడిగుంట, ఆనందపేట తదితర ప్రాంతాల్లో పర్యటించి, త్రాగునీటి సరఫరా, డ్రైన్ల నిర్మాణం, పారిశుధ్య పనులపై తీసుకోవాల్సిన చర్యలపై అధికారులకు తగు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా కబాడీగూడెంలో పెండింగ్ లో ఉన్న మేజర్ డ్రైన్ నిర్మాణ పనులు చేపట్టాలని, తద్వారా షుమారు 6 వార్డ్ ల ప్రజలు మురుగునీటి ముంపు నుండి బయటపడతారని శాసన సభ్యులు నసీర్ అహ్మద్ తెలియచేయగా, కమిషనర్ పరిశీలించి, మేజర్ డ్రైన్ నిర్మాణంకు వెంటనే మార్కింగ్ చేపట్టాలని సిటి ప్లానర్ ని ఆదేశించారు. మార్కింగ్ మేరకు డ్రైన్ నిర్మాణంకు చర్యలు తీసుకోవాలని ఎస్ఈని ఆదేశించారు. త్రాగునీటి సరఫరాలో సమస్య రాకుండా చర్యలు తీసుకోవాలని ఎస్ఈని ఆదేశించారు. అలాగే ప్రస్తుతం నగరానికి త్రాగునీటి సరఫరా జరిగే ప్రకాశం బ్యారేజిలోకి పులిచింతల నుండి నీరు వస్తున్నందున, నీటి సరఫరా సమయంలో తగు మోతాదులో క్లోరిన్ ఉండేలా హెడ్ వాటర్ వర్క్స్ ఇంజినీరింగ్ అధికారులు, క్షేత్ర స్థాయిలో శ్యాంపిల్స్ తీసి సిఎంఎం యాప్ లో అప్ లోడ్ చేయాలని ఎమినిటి కార్యదర్శులును ఆదేశించారు. పిచ్చి మొక్కలు పెరిగిన ఖాళీ స్థలాలు సంబందిత యజమానులు శుభ్రం చేసుకోవాలని నోటీసులు ఇవ్వాలని, స్పందించని వాటిని జిఎంసి ప్రజారోగ్య విభాగం శుభ్రం చేసి, జిఎంసి బోర్డ్ లు ఏర్పాటు చేయాలన్నారు. డ్రైన్లను ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలని, సిల్ట్ ని వెంటనే తరలించాలన్నారు. సంగడి గుంట మెయిన్ రోడ్ డ్రైన్ పై నిర్మాణాలు తొలగించాలని ఏసిపీని ఆదేశించారు. అలాగే రోడ్లపై భవన నిర్మాణ సామగ్రి ఉండడానికి వీలు లేదని, నిర్మాణదారులు రోడ్లపై వేస్తె తొలగించాలని ప్లానింగ్ కార్యదర్శులకు స్పష్టం చేశారు. స్థానికంగా ఉన్న బోర్లు మరమత్తు చేయాలని ప్రజలు కోరగా వాటిని 2 రోజుల్లోగా చేయాలని ఆదేశించారు. పర్యటనలో డిప్యూటీ కమిషనర్ జి.సాంబశివరావు, సిటి ప్లానర్ రాంబాబు, ఎస్ఈ సుందర్రామిరెడ్డి, ఎంహెచ్ఓ డాక్టర్ సురేష్, పట్టణ ప్రణాళిక, ఇంజినీరింగ్, ప్రజారోగ్య అధికారులు, సచివాలయ ప్లానింగ్ కార్యదర్శులు పాల్గొన్నారు.

## కిసాన్ మేళాలు ఎంతో ఉపయోగకరం

### : ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు







**గుంటూరు, పెన్ పవర్, ఆగస్టు 11 :** ఎల్‌నినో ప్రభావంతో ఏర్పడే వర్షాభావ పరిస్థితులను సమర్థవంతంగా ఎదుర్కొనేలా రైతులకు అవగాహన కల్పించడంలో కిసాన్ మేళాలు కీలక పాత్ర పోషిస్తాయని ప్రత్తిపాడు ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు అన్నారు. మంగళవారం లాంలోని కృష్ణ ఆడిటోరియంలో జిల్లా వ్యవసాయ శాఖ, ఆత్మ ఆధ్వర్యంలో నిర్వహించిన కిసాన్ మేళాకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా రైతులతో శాస్త్రవేత్తల ముఖాముఖి కార్యక్రమంతో పాటు వ్యవసాయ అనుబంధ శాఖల విజ్ఞాన ప్రదర్శన నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ వాతావరణ మార్పులు, ఎల్‌నినో ప్రభావంతో ఎదురయ్యే వర్షాభావ పరిస్థితులను అధిగమించేందుకు రైతులకు ఆధునిక సాగు పద్ధతులు, సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన కల్పించాలన్నారు. శాస్త్రవేత్తలు, రైతుల మధ్య సన్నిహిత సంబంధం ఉండాలని, రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకుని శాస్త్రీయ పరిష్కారాలు సూచించాలని కోరారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, నూతన సాగు పద్ధతులు, వ్యవసాయ యాంత్రీకరణను విస్తృతంగా వినియోగించుకోవడం ద్వారా వ్యవసాయాన్ని మరింత లాభసాటిగా మార్చుకోవచ్చని తెలిపారు. కిసాన్ మేళాలో నిపుణులు వివిధ పంటల సాగు పద్ధతులు, నూతన సాంకేతిక పరిజ్ఞానం, వ్యవసాయ అనుబంధ రంగాలపై రైతులకు అవగాహన కల్పించారు. రైతులు తమ సందేహాలను శాస్త్రవేత్తలను నేరుగా అడిగి నివృత్తి చేసుకున్నారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి పద్మావతి, ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం డైరెక్టర్ ఆఫ్ ఎక్స్‌టెన్షన్ రామచంద్రరావు, లాం ఫారం ఏడీఆర్ దుర్గాప్రసాద్, ఆత్మ పీడీ వెంకటేశ్వర్లు, జిల్లా పశుసంవర్థక అధికారి డాక్టర్ సత్యనారాయణ, మార్క్‌ఫెడ్ డీఎం నరసింహారెడ్డి, డీపీఎం రాజకుమారి తదితరులు పాల్గొన్నారు.

## విజయ ఢంకా మ్రోగించిన చేవెంద్ర చిన్నారులు







**పెడన, పెన్ పవర్, ఆగస్టు 11 :** జాతీయ ఆదాయ ప్రతిభా స్కాలర్‌షిప్ పథకం (ఎన్ ఎమ్ ఎమ్ ఎస్ ) పరీక్ష ఫలితాల్లో చేవెంద్ర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభ చాటారు. నేడు విడుదలైన ఫలితాల్లో పాఠశాలకు చెందిన కోన థామస్ ధరహాస్, జూట్రు వెంకట కార్తిక్, తల్లిబోయిన ఐశ్వర్యలు ప్రతిభ కనబరిచి సత్తా చాటారు. పేద మరియు మధ్యతరగతి కుటుంబాలకు చెందిన ప్రతిభావంతులైన విద్యార్థులను ప్రోత్సహించేందుకు కేంద్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న ఎన్ ఎమ్ ఎమ్ ఎస్ పరీక్షలో ఉత్తమ ప్రతిభ కనబరచడం పట్ల పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేశారు. విద్యార్థుల విజయానికి ఉపాధ్యాయుల మార్గదర్శకత్వం, విద్యార్థుల కృషి, తల్లిదండ్రుల ప్రోత్సాహం దోహదపడిందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు పరిశే కరుణానిధి, ఉపాధ్యాయులు విజయవంతమైన విద్యార్థులను అభినందించారు. భవిష్యత్తులో మరిన్ని ఉన్నత విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. గ్రామ పెద్దలు కూడా విద్యార్థులను అభినందిస్తూ, చేవెంద్రకు, పాఠశాలకు మంచి పేరు తీసుకురావడం గర్వకారణమని అన్నారు.

## చిన్నారుల కోసం ఓ చిన్న ప్రపంచం చిల్డ్రన్స్ లైబ్రరీ : రాయపాటి శైలజ





**గుంటూరు , పెన్ పవర్,ఆగస్టు 11 :** ఆంధ్రప్రదేశ్ మహిళా కమిషన్ కార్యాలయంలో చిన్నారుల కోసం ఏర్పాటు చేసిన ప్లే ఏరియా, చిల్డ్రన్స్ లైబ్రరీని మహిళా కమిషన్ చైర్‌పర్సన్ రాయపాటి శైలజ మంగళవారం ప్రారంభించారు. ఇన్నర్ వీల్ క్లబ్ ఆఫ్ విజయవాడ మిడ్‌టౌన్ సహకారంతో, తనీషా సింగల్ తన నానమ్మ లక్ష్మీదేవి సింగల్(లేటు) పేరుతో ఈ సౌకర్యాలను ఏర్పాటు చేశారు. కుటుంబ సమస్యలు, కౌన్సెలింగ్ కోసం ఆంధ్రప్రదేశ్ మహిళా కమిషన్ కార్యాలయానికి తల్లిదండ్రులతో పాటు చిన్నారులు కూడా వస్తుంటారు. ఈ సమయంలో కుటుంబ వివాదాలు, వాదోపవాదాల ప్రభావం చిన్నారులపై పడకుండా వారికి సురక్షితమైన, ఆహ్లాదకరమైన వాతావరణాన్ని కల్పించాలనే ఉద్దేశంతో ఆంధ్రప్రదేశ్ మహిళా కమిషన్ ఈ ప్లే ఏరియా ఏర్పాటుకు శ్రీకారం చుట్టింది. తల్లిదండ్రులు కౌన్సెలింగ్‌లో పాల్గొనే సమయంలో చిన్నారులు ఆటలు ఆడుతూ, పుస్తకాలు చదువుతూ సంతోషంగా సమయం గడిపేలా ఈ సౌకర్యాలను అందుబాటులోకి తీసుకువచ్చారు. ఆటల ద్వారా పిల్లల్లో ఆత్మవిశ్వాసం, శారీరక చురుకుదనం, సృజనాత్మకత పెంపొందడంతో పాటు, చిల్డ్రన్స్ లైబ్రరీ ద్వారా చదువుపై ఆసక్తిని పెంచేలా పుస్తకాలు, డ్రాయింగ్ మరియు కలరింగ్ పుస్తకాలు, పజిల్స్, ఆట వస్తువులను అందుబాటులో ఉంచారు. కుటుంబ సమస్యల మధ్య మహిళా కమిషన్‌ను ఆశ్రయించే పిల్లలకు సానుకూలమైన, సురక్షితమైన వాతావరణాన్ని కల్పించడమే మహిళా కమిషన్ ప్రధాన ఉద్దేశమని రాయపాటి శైలజ తెలిపారు.

## 20 సూత్రాల పథకాల అమలుపై సమీక్ష



**బాపట్ల, పెన్‌పవర్, ఆగస్టు 11 :** పేదరిక నిర్మూలన, గ్రామీణాభివృద్ధి, సామాజిక న్యాయం, ఉపాధి, విద్య, ఆరోగ్యం తదితర రంగాల్లో వేగవంతమైన అభివృద్ధి సాధించేందుకు కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న 20 సూత్రాల పథకాల పురోగతిపై బాపట్ల జిల్లా కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాల్‌లో సమీక్ష సమావేశం నిర్వహించారు. జిల్లా కలెక్టర్ డాక్టర్ వి. వినోద్‌కుమార్‌తో కలిసి రాష్ట్ర 20 సూత్రాల పథకాల అమలు చైర్మన్ లంక దినకర్, చీరాల ఎమ్మెల్యే మద్దులూరి మాలకొండయ్య సమావేశంలో పాల్గొన్నారు. జిల్లాలో 20 సూత్రాల పథకాల అమలు, పురోగతి, లబ్ధిదారులకు అందుతున్న ప్రయోజనాలపై అధికారులు సమీక్షించారు. ఈ సమావేశంలో ఇన్‌చార్జి డీఆర్ఓ, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ లవన్న, ఆర్డీఓ ఏ. హరికుమార్, సీపీఓ ఏఎస్ రాజు, సీపీఎన్‌సీఎల్ ఎస్‌సీ ఆంజనేయులు, డీపీఓ ఎల్. ప్రభాకర్‌రావు, గ్రామీణ నీటి సరఫరా శాఖ ఈఈ అనంతరాజు, జిల్లా పర్యాటక శాఖ అధికారి కె. బెన్‌హర్, డీఆర్డీఏ, డ్వామా, గృహ నిర్మాణ సంస్థ పీడీలు బి. సింగయ్య, విజయలక్ష్మి, వెంకటేశ్వరరావు, ఎస్ఎస్ఏ పీఓ శ్రీనివాసరావు, జడ్పీ డిప్యూటీ సీఈఓలు ఓ. బాలమ్మ, శ్రీకృష్ణ, పంచాయతీరాజ్ ఈఈ సత్యనారాయణ, మున్సిపల్ కమిషనర్ ఎం. హాసిని తదితరులు పాల్గొన్నారు.

## డీఎస్సీపై వైసీపీ దుష్ప్రచారం దారుణం : ఎమ్మెల్యే గళ్లా మాధవి




**గుంటూరు: పెన్ పవర్, ఆగస్ట్, 11 :** రాష్ట్రంలో అత్యంత పారదర్శకంగా నిర్వహించిన మెగా డీఎస్సీపై వైసీపీ నేతలు నిరాధార ఆరోపణలు చేస్తూ నిరుద్యోగ యువతను తప్పుదోవ పట్టిస్తున్నారని గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే గళ్లా మాధవి మండిపడ్డారు. ఫలితాలు వెలువడిన సమయంలో డీఎస్సీని అభినందించిన వైసీపీ నేతలే ఇప్పుడు అదే పరీక్షను బోగస్‌గా చిత్రీకరించడం వారి ద్వంద్వ వైఖరికి నిదర్శనమన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ప్రత్యేక చొరవతో ఎన్నో ఏళ్లుగా డీఎస్సీ కోసం ఎదురుచూస్తున్న నిరుద్యోగ యువత కలను కూటమి ప్రభుత్వం సాకారం చేసిందన్నారు. గత ప్రభుత్వ హయాంలో డీఎస్సీ నిర్వహణలో కాలయాపన తప్ప నిరుద్యోగులకు చేసిందేమీ లేదని విమర్శించారు. ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధి, విద్యారంగ సంస్కరణలు, ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి మంత్రి నారా లోకేష్ తీసుకుంటున్న చర్యలు అభినందనీయమని గళ్లా మాధవి పేర్కొన్నారు. రాజకీయ ప్రయోజనాల కోసం యువత భవిష్యత్తుతో చెలగాటం ఆడకుండా వైసీపీ నేతలు అసత్య ప్రచారాలకు స్వస్తి పలకాలని ఆమె హితవు పలికారు.

## తల్లి బిడ్డ ఎక్స్‌ప్రెస్ వాహనాలు ప్రారంభం

### బాపట్ల ఏరియా వైద్యశాలలో 102 సేవలకు నూతన వాహనాలు





**బాపట్ల, పెన్ పవర్, ఆగస్టు 11:** బాపట్ల ఏరియా వైద్యశాల ఆవరణలో నూతనంగా ఏర్పాటు చేసిన 'తల్లి బిడ్డ ఎక్స్‌ప్రెస్' (102) వాహనాలను చీరాల ఎమ్మెల్యే మద్దులూరి మాలకొండయ్య, బాపట్ల ఎమ్మెల్యే వేగేశన నరేంద్ర వర్మ రాజు మంగళవారం ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యేలు స్వయంగా వాహనాన్ని నడిపి, అందులోని సౌకర్యాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాలకొండయ్య మాట్లాడుతూ ఆసుపత్రుల్లో ప్రసవం పొందిన బాలింతలు, పసిపాపలను క్షేమంగా ఇళ్లకు చేర్చడంలో 102 తల్లి బిడ్డ ఎక్స్‌ప్రెస్ సేవలు కీలకంగా నిలుస్తున్నాయని అన్నారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల పేద ప్రజలకు ఉచితంగా నాణ్యమైన వైద్య రవాణా సేవలు అందించేందుకు నూతన వాహనాలు ఎంతగానో ఉపయోగపడతాయని తెలిపారు. మాతా శిశు సంక్షేమానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందని, ప్రజలు 102 వాహన సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, ఏరియా వైద్యశాల వైద్యాధికారులు, సిబ్బంది, నాయకులు పాల్గొన్నారు.

## ప్రముఖ న్యాయవాది నీలి కస్తూరినాథ్ మృతి



**చీరాల, పెన్‌పవర్, ఆగస్టు 11 :** బాపట్ల జిల్లా చీరాల హరిప్రసాద్‌నగర్‌కు చెందిన ప్రముఖ న్యాయవాది నీలి కస్తూరినాథ్ మంగళవారం మృతి చెందారు. ఆయన మృతి పట్ల కుటుంబ సభ్యులు, బంధువులు, స్నేహితులు, సహచర న్యాయవాదులు, పరిచయస్తులు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. న్యాయవాదిగా చీరాల ప్రాంతంలో ఎంతోమందికి న్యాయ సేవలు అందించిన కస్తూరినాథ్ తనకంటూ ప్రత్యేక గుర్తింపు పొందారు. ఆయన మృతి కుటుంబ సభ్యులతో పాటు బంధువులు, మిత్రులు, సహచర న్యాయవాదులకు తీరని లోటుగా మారింది. కస్తూరినాథ్ మృతి వార్త తెలిసిన పలువురు ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించి సానుభూతి తెలిపారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని, కుటుంబ సభ్యులకు భగవంతుడు మనోధైర్యం ప్రసాదించాలని ప్రార్థించారు.

# విద్యార్థినులకు 'శక్తి యాప్'పై అవగాహన




**చీరాల, పెన్ పవర్, ఆగస్టు 11 :** మహిళలు, బాలికల భద్రత కోసం పోలీస్ శాఖ అందిస్తున్న 'శక్తి యాప్' వినియోగంపై చీరాల శ్రీ గౌతమి కళాశాలలో విద్యార్థినులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. బాపట్ల జిల్లా ఎస్పీ బి. ఉమామహేశ్వర్ ఐపీఎస్ ఆదేశాల మేరకు, చీరాల డీఎస్పీ ఎం.డి. మోయిన్, వన్‌టౌన్ సీఐ సోమశేఖర్ సూచనలతో శక్తి టీం ఎస్సై హరిబాబు, కానిస్టేబుల్ సుబ్బారావు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా విద్యార్థినులకు శక్తి యాప్‌లోని యస్ ఓ యస్ సదుపాయం, అత్యవసర పరిస్థితుల్లో 112 నంబర్ ద్వారా పోలీసులను సంప్రదించే విధానం, మహిళల భద్రతకు పోలీస్ శాఖ అందిస్తున్న సేవలను వివరించారు. ఈవ్‌టీజింగ్, అసభ్యకర వ్యాఖ్యలు, వెంటపడటం, బెదిరింపులు వంటి వేధింపులను సహించకుండా వెంటనే పోలీసులను ఆశ్రయించాలని సూచించారు. కళాశాల కరస్పాండెంట్ ఎం.సి.హెచ్. వెంకటేశ్వర్లు మాట్లాడుతూ, వేధింపులు విద్యార్థినుల విద్యాభ్యాసం, మానసిక ప్రశాంతత, ఆత్మవిశ్వాసంపై ప్రభావం చూపుతాయని అన్నారు. బస్టాప్‌లు, కళాశాల పరిసరాలు, ప్రజా ప్రదేశాలు, సామాజిక మాధ్యమాల్లో ఎదురయ్యే వేధింపులపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఎస్సై హరిబాబు మాట్లాడుతూ, అత్యవసర పరిస్థితుల్లో విద్యార్థినులు భయపడకుండా శక్తి యాప్‌లోని యస్ ఓ యస్ ద్వారా లేదా 112కు ఫోన్ చేసి పోలీసులను సంప్రదించాలని సూచించారు. మహిళల భద్రతకు పోలీస్ శాఖ ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటుందని తెలిపారు. విద్యార్థినులు చదువుతో పాటు ఆత్మవిశ్వాసం, క్రమశిక్షణ, సమయపాలన, ఆత్మరక్షణ నైపుణ్యాలను పెంపొందించుకోవాలని, చట్టాలు, హక్కులపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. వేధింపులు లేని సురక్షితమైన విద్యా వాతావరణం కోసం విద్యార్థులు, అధ్యాపకులు, తల్లిదండ్రులు, ప్రజలు సమష్టిగా కృషి చేయాలని శక్తి బృందం పిలుపునిచ్చింది. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ వరప్రసాద్, కరస్పాండెంట్ ఎం.సి.హెచ్. వెంకటేశ్వర్లు, శక్తి టీం కానిస్టేబుల్ సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

# సూర్యలంక అభివృద్ధిలో అన్ని ప్రతిపాదనలు మావే: కోన రఘుపతి



**బాపట్ల: (పెన్ పవర్), ఆగస్టు 11 :** బాపట్ల సూర్యలంక పేరు, సహజ అందాలను కాపాడుతూ పర్యాటకంగా మరింత అభివృద్ధి చేయాలనే ఉద్దేశంతో తమ హయాంలోనే పలు బలమైన ప్రతిపాదనలు రూపొందించామని మాజీ ఎమ్మెల్యే కోన రఘుపతి తెలిపారు. కోన చాంబర్స్ లో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం చేపడుతున్న నిర్మాణాలతో సూర్యలంక సహజ స్వరూపం దెబ్బతింటోందని ఆయన విమర్శించారు. సూర్యలంకలో కాంక్రీట్ నిర్మాణాలు పెరిగిపోవడంతో సముద్రం కనిపించని పరిస్థితి ఏర్పడుతోందని కోన రఘుపతి ఆవేదన వ్యక్తం చేశారు. పర్యాటక ప్రాంతాన్ని అభివృద్ధి చేసే పేరుతో భారీగా కాంక్రీట్ నిర్మాణాలు చేపట్టడం వల్ల సూర్యలంక ప్రత్యేకతకు నష్టం కలుగుతుందని అన్నారు.

**రూ.47 కోట్లతో 47 షాపుల నిర్మాణం ఏమిటని ప్రశ్న:** రూ. 47 కోట్ల వ్యయంతో 47 షాపులు నిర్మించేందుకు చేపట్టిన చర్యలు ఆశ్చర్యకరంగా ఉన్నాయని కోన రఘుపతి అన్నారు. ఇంత భారీ మొత్తాన్ని ఖర్చు చేసి పరిమిత సంఖ్యలో షాపులు నిర్మించడం వల్ల పర్యాటకులకు, స్థానికులకు ఎంతమేర ప్రయోజనం కలుగుతుందో ప్రభుత్వం స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. సూర్యలంక అభివృద్ధికి తమ ప్రభుత్వం హయాంలోనే పలు సమగ్ర ప్రతిపాదనలు చేశామని ఆయన తెలిపారు. పర్యాటకుల సౌకర్యాలు పెంచడంతో పాటు సూర్యలంక సహజ వాతావరణాన్ని కాపాడేలా అభివృద్ధి ప్రణాళికలు రూపొందించామని చెప్పారు. సూర్యలంకను కేవలం కాంక్రీట్ నిర్మాణాలకు పరిమితం చేయకుండా, ప్రకృతి అందాలను కాపాడుతూ పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయాలని కోన రఘుపతి కోరారు. ప్రభుత్వం చేపడుతున్న పనులపై సమగ్ర సమీక్ష నిర్వహించి, ప్రజలకు ఉపయోగపడే విధంగా అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టాలని ఆయన సూచించారు. కూటమి ప్రభుత్వం సూర్యలంక అభివృద్ధి విషయంలో తమ ప్రతిపాదనలను పరిగణనలోకి తీసుకోవాలని, ప్రాంతం యొక్క సహజ స్వరూపం, పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యం ఇవ్వాలని మాజీ ఎమ్మెల్యే కోన రఘుపతి డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ వైసీపీ నాయకులు, మాజీ ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# ఉప్పుటూరు హోమియో వైద్యశాలకు అదనపు నిధులు, సిబ్బంది కల్పించాలి

### ఆయుష్ డైరెక్టర్‌కు గ్రామస్తులు, రోగుల వినతి



**పర్చూరు, పెన్ పవర్,ఆగస్టు 11 :** ఉప్పుటూరు ప్రభుత్వ హోమియో వైద్యశాల అభివృద్ధికి అదనపు నిధులు మంజూరు చేసి, వైద్య సిబ్బందిని పెంచడంతో పాటు ల్యాబ్ సౌకర్యం కల్పించాలని గ్రామస్తులు, రోగులు కోరారు. ఈ మేరకు ఆయుష్ డైరెక్టర్‌కు రాసిన వినతిపత్రాన్ని మంగళవారం ఉదయం ప్రభుత్వ హోమియో వైద్యశాల వైద్యుడు డాక్టర్ దాసరి చంద్రశేఖర్‌కు అందజేశారు. గ్రామస్తులు మాట్లాడుతూ స్థానిక ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు చొరవతో జడ్పీ నిధుల నుంచి రూ.10 లక్షలు మంజూరు కావడంతో నూతన హోమియో వైద్యశాల భవన నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయని తెలిపారు. అయితే ఈ నిధులు భవన నిర్మాణానికి సరిపోకపోవడంతో అదనపు నిధులు మంజూరు చేసి పనులను సకాలంలో పూర్తి చేయాలని కోరారు. అదేవిధంగా వైద్యశాలలో డాక్టర్ దాసరి చంద్రశేఖర్ అంకితభావంతో సేవలందిస్తున్నప్పటికీ ఒక్కరే వైద్యుడు ఉండటంతో రోగులకు సకాలంలో వైద్య సేవలు అందడం లేదని తెలిపారు. అదనపు వైద్య సిబ్బందిని నియమించాలని, నూతన భవనంలో ల్యాబ్ సౌకర్యం ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. వైద్య పరీక్షల కోసం దూర ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తోందని, వైద్యశాలలో రోగులు గంటల తరబడి వేచి ఉండాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. డాక్టర్ దాసరి చంద్రశేఖర్ మాట్లాడుతూ ఉప్పుటూరు ప్రభుత్వ హోమియో వైద్యశాలలో నెలకొన్న సమస్యలను ఇప్పటికే ఆయుష్ శాఖ డైరెక్టర్ దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. గ్రామస్తులు అందించిన వినతిపత్రాన్ని మరోసారి ఉన్నతాధికారులకు అందజేసి సమస్య తీవ్రతను తెలియజేస్తానని చెప్పారు. కార్యక్రమంలో ఉప్పుటూరు గ్రామస్తులు, వైద్యశాలకు వచ్చిన రోగులు పాల్గొన్నారు.

# ఉన్నత పాఠశాలలను సందర్శించిన జాతీయ ఆర్థిక కార్యదర్శి సుధీర్ బాబు



**బాపట్ల:( పెన్ పవర్), ఆగస్టు11** ఆల్ ఇండియా సెకండరీ టీచర్స్ ఫెడరేషన్ జాతీయ ఆర్థిక కార్యదర్శి సిహెచ్ జోసెఫ్ సుధీర్ బాబు బాపట్ల జిల్లా బాపట్ల మండలం నందు గల ఉన్నత పాఠశాలలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులకు ప్రభుత్వం కేటాయించిన ఆకస్మిక సెలవులను అనారోగ్య, అత్యవసర సమయాల్లో కూడా వాడవద్దని, 100 హాజరు ఉండాలని, మహిళా ఉపాధ్యాయులు వారి పిల్లల సంరక్షణ కోసం కేటాయించిన చైల్డ్ కేర్ లీవు లను కూడా వాడుకోకుండా జిల్లా అధికారులు ఆంక్షలు విధించటం గర్హనీయం అని పేర్కొన్నారు. వయస్సు రీత్యా అనారోగ్య సందర్భంలో సెలవు పెడితే అధికారులు సెలవు మంజూరు చేయకుండా పరిమితి విధిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్రంలోని ఉపాధ్యాయులకు టెట్ అర్హత పరీక్షను రద్దు చేయాలని, అప్పటి వరకు సర్వీస్ లో ఉన్న ఉపాధ్యాయులకు ప్రత్యేక టెట్ ను మార్కులను తగ్గించి నిర్వహించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అదేవిధంగా పిఆర్సి కమిటీని వెంటనే నియమించాలని, మధ్యంతర భృతిని వెంటనే ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఉపాధ్యాయులకు బోధనకు ఆటంకం లేకుండా అన్ని యాప్లను రద్దుచేసయాలని, ఐ గాట్ కర్మయోగి, లీప్ యాప్ డౌన్లోడింగ్ వంటి పనులను ఉపాధ్యాయులకు సంబంధం లేకుండా అకడమిక్ ఇన్స్ట్రక్టర్ల ద్వారా డేటాను సేకరించాలని తెలిపారు. మిషన్ మార్చి పేరిట హై స్కూల్ లోని ఉపాధ్యాయులకు సిలబస్ కంప్లీట్ కాకుండా ఆందోళనకు గురిచేసే చర్యలను మానుకోవాలని తెలిపారు. ప్రభుత్వం విద్య, ఉపాధ్యాయ వ్యతిరేక విధానాలు మానుకోవాలని డిమాండ్ చేశారు. మూడు దశాబ్దాలుగా ఉపాధ్యాయ సమస్యలపై అలుపెరుగని పోరాటం చేస్తున్న నన్ను రాబోయే కృష్ణా గుంటూరు జిల్లాల ఉపాధ్యాయ శాసన మండలి ఎన్నికల్లో ప్రథమ ప్రాధాన్యత ఓటుతో బలపరచాలని ఉపాధ్యాయులకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ అభ్యర్థి సిహెచ్ జోసెఫ్ సుధీర్ తో పాటు రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుడివాడ అమర్నాథ్, బాపట్ల జిల్లా అధ్యక్షులు బడుగు శ్రీనివాస్, బాపట్ల జిల్లా ప్రధాన కార్యదర్శి బొంత వెంకటేశ్వర్లు , బాపట్ల జిల్లా ఆర్థిక కార్యదర్శి పి వి నాగరాజు, బాపట్ల జిల్లా ఉపాధ్యాయ వాణి కన్వీనర్ ఎన్ బి సుభాని, జిల్లా ఉపాధ్యక్షులు బత్తుల నాగరాజు, బాపట్ల మండల అధ్యక్షులు ఏవి నారాయణ, ప్రధాన కార్యదర్శి పీలా శివాంజనేయులు, నగరం మండల అధ్యక్షుడు తోట శివయ్య, బాపట్ల మున్సిపాలిటీ అధ్యక్షుడు ముక్తేశ్వరరావు, సీనియర్ కార్యకర్త బాల కోటేశ్వరరావు, సీనియర్ కార్యకర్త లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# విద్యుత్ సరఫరాలో అంతరాయాలు లేకుండా చర్యలు : సీఎండీ పి. పుల్లారెడ్డి సమీక్ష



**గుంటూరు, పెన్ పవర్,ఆగస్టు 11:** గుంటూరు సర్కిల్ పరిధిలో విద్యుత్ సరఫరా పరిస్థితి, వినియోగదారుల సేవలు, విద్యుత్ అంతరాయాల నివారణ, నష్టాల నియంత్రణ, భద్రతా చర్యలపై ఏపీసీపీడీసీఎల్ సీఎండీ పి. పుల్లారెడ్డి అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. సబ్‌స్టేషన్లు, ఫీడర్లు, ట్రాన్స్‌ఫార్మర్ల పనితీరును నిరంతరం పర్యవేక్షిస్తూ వినియోగదారులకు నాణ్యమైన, నిరంతరాయ విద్యుత్ అందించాలని ఆయన ఆదేశించారు. విద్యుత్ అంతరాయాలను సాధ్యమైనంత త్వరగా గుర్తించి సరఫరాను పునరుద్ధరించాలని సూచించారు. వినియోగదారుల ఫిర్యాదులను నిర్ణీత సమయంలో పరిష్కరించాలని, ముఖ్యంగా 1912 కాల్ సెంటర్, ద్వారా అందుతున్న ఫిర్యాదులపై ప్రత్యేక దృష్టి పెట్టాలని తెలిపారు. కొత్త విద్యుత్ సర్వీసు కనెక్షన్ల దరఖాస్తులను కూడా గడువులోగా పరిష్కరించాలన్నారు. విద్యుత్ ప్రమాదాల నివారణకు ప్రాధాన్యతనిస్తూ ప్రమాదకర స్తంభాలు, వేలాడుతున్న తీగలు, దెబ్బతిన్న ట్రాన్స్‌ఫార్మర్లను గుర్తించి తక్షణమే చర్యలు చేపట్టాలని ఆదేశించారు. అధిక విద్యుత్ నష్టాలు నమోదవుతున్న ఫీడర్లను గుర్తించి నష్టాల నియంత్రణకు ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలని సూచించారు. రూఫ్‌టాప్ సోలార్, వంటి పునరుత్పాదక ఇంధన పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని సీఎండీ తెలిపారు. అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ విద్యుత్ వ్యవస్థ పనితీరును పర్యవేక్షించాలని సూచించారు. సమీక్షలో డైరెక్టర్లు ఆవుల మురళీకృష్ణ యాదవ్, టీవీఎస్ఎన్ మూర్తి, ఎస్. వెంకటేశ్వర్లు, గుంటూరు సర్కిల్ సూపరింటెండెంట్ చల్లా రమేష్, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# అంగన్ వాడీ సిబ్బంది సమస్యల్ని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్తా : ప్రత్తిపాటి

### అంగన్ వాడీ సిబ్బంది ప్రత్యేక శిక్షణా తరగతులు ప్రారంభించి, వారికి సమవస్త్రాలు పంపిణీ చేసిన ఎమ్మెల్యే





**చిలకలూరిపేట , పెన్ పవర్, ఆగస్టు 11:** అంగన్ వాడీ సిబ్బందికి నిజమైన ఆర్థిక, సామాజిక గుర్తింపును అందించిన నాయకుడు చంద్రబాబు మాత్రమేనని, ఆయన నాయకత్వంలోనే సిబ్బంది జీతభత్యాలు పెరిగాయని, స్మార్ట్ ఫోన్లు అందించడం ద్వారా పనిభారం తగ్గించారని శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు పేర్కొన్నారు. పట్టణంలోని శారదా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం ప్రారంభమైన అంగన్ వాడీ సిబ్బంది ప్రత్యేక శిక్షణా తరగతుల్ని ముఖ్య అతిథి హోదాలో ఎమ్మెల్యే ప్రత్తిపాటి ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రభుత్వం సిబ్బందికి సమకూర్చిన నూతన సమవస్త్రాలను ప్రత్తిపాటి పంపిణీ చేశారు. అనంతరం వారిని ఉద్దేశించి ఆయన మాట్లాడారు.

**అంగన్ వాడీలను హార్డ్ వర్క్ నుంచి స్మార్ట్ వర్క్ వైపు మళ్లించింది చంద్రబాబే**

అంగన్ వాడీ సిబ్బంది ఉత్తమ పనితీరుతో ప్రభుత్వానికి మంచిపేరు తీసుకురావాలని, వారి జీతభత్యాల పెంపు అంశంపై స్వయంగా తానే ముఖ్యమంత్రితో మాట్లాడతానని ప్రత్తిపాటి హామీ ఇచ్చారు. అంగన్ వాడీ టీచర్లు, మినీటీచర్లు, సహాయకులకు ఆర్థిక భరోసా కల్పించడంతో పాటు.. వారి కుటుంబాలకు ప్రభుత్వ ప్రయోజనాలు అందచేయడంలో ముఖ్యమంత్రి చంద్రబాబు ఉదారంగా వ్యవహరించారని ప్రత్తిపాటి తెలిపారు. ఆయన ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు మాత్రమే అంగన్ వాడీలకు నిజమైన లబ్ధి చేకూరిందన్నారు. అంగన్ వాడీ సిబ్బంది జీతాలు రెండుసార్లు పెంచిన ఘనత చంద్రబాబుకే దక్కుతుందని, అలానే ప్రతినెలా 1నే వారి ఖాతాల్లో తమ కష్టార్జితం జమయ్యేలా చర్యలు తీసుకున్నారని ప్రత్తిపాటి కొనియాడారు. రాష్ట్రంలోని దాదాపు 60వేల మంది అంగన్ వాడీ వర్కర్లు, సూపర్ వైజర్లు, బ్లాక్ కోఆర్డినేటర్లకు 5జీ స్మార్ట్ ఫోన్లు అందించి వారిని హార్డ్ వర్క్ నుంచి స్మార్ట్ వర్క్ వైపు మళ్లించిన ఘనత కూడా చంద్రబాబుకే దక్కుతుందన్నారు. తాజాగా మంత్రి లోకేశ్ అంగన్ వాడీలకు అదనపు ప్రయోజనం అందించారని, గత పాలకుల మోసాలకు బలైన అంగన్ వాడీలకు తల్లికి వందనం సాయం అందించి, నిజమైన మానవతావాదిగా నిలిచారని ప్రత్తిపాటి కొనియాడారు. జగన్ అంగన్ వాడీ సిబ్బందికి తీవ్ర అన్యాయం చేశారని, ఎన్నికల ముందు కల్లబొల్లి మాటలతో నమ్మించి, అధికారంలోకి వచ్చాక వారికిచ్చిన హామీల్లో ఒక్కటీ అమలు చేయలేదని ప్రత్తిపాటి స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ అబ్జర్వార్ ఆడక స్వాములు, సమన్వయకర్త నెల్లూరి సదాశివరావు, మార్కెట్ యార్డు చైర్మన్ షేక్ కరిముల్లా, పట్టణ అధ్యక్షులు పఠాన్ సమద్ ఖాన్, ప్రధాన కార్యదర్శి మద్దుమాల రవి, మున్సిపల్ మాజీ చైర్మన్ షేక్ రఫాని, రాష్ట్ర డైరెక్టర్ కందుల రమణ, మార్కెట్ యార్డు వైస్ చైర్మన్ పిల్లి కోటేశ్వరరావు, బీజేపీ నేతలు మల్లెల శివనాగేశ్వరరావు, నెల్లూరి రంజిత్, టీడీపీ నాయకులు ముల్లా కరిముల్లా, తుపాకుల అప్పారావు, గెరా రాము, పిల్లి లెనిన్, ఎఖోషవ, వడ్డనీ చిన్న, దార్ల సుబ్బారావు, చైర్మన్ పిల్లి ధనలక్ష్మి, కొప్పుల రాంబాబు, హెడ్ మాస్టర్ రత్నా జ్యోతి, అగన్వాడి టీచర్లు, తదితరులు పాల్గొన్నారు.

# నగరంలో భారీ హర్ ఘర్ తిరంగా యాత్ర

### : కమాండింగ్ ఆఫీసర్ కల్నల్ రూపేష్






**విజయవాడ, పెన్ పవర్, ఆగస్ట్, 11 :** సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్ (సీబీసీ) ఆధ్వర్యంలో చారిత్రాత్మక మచిలీపట్నంలో భారీ మువ్వన్నెల జెండా యాత్ర ఘనంగా జరిగింది. హర్ ఘర్ తిరంగా " ప్రచార కార్యక్రమంలో భాగంగా రెండు వందల అడుగుల పొడవు భారీ మువ్వన్నెల పతాకంతో నిర్వహించిన ర్యాలీని ఎన్సీసీ 16వ బెటాలియన్ కమాండింగ్ ఆఫీసర్ కల్నల్ రూపేష్ అవస్థి జెండా ఊపి ప్రారంభించారు. నగరంలోని వివిధ విద్యా సంస్థలు, పాఠశాలలకు చెందిన మూడు వందలకు పైగా ఎన్సీసీ క్యాడెట్లు త్రివర్ణ పతాకాన్ని ప్రదర్శనగా దేశ భక్తి, వందేమాతరం, హర్ ఘర్ తిరంగా నినాదాలతో చేసిన ర్యాలీ ప్రజలను ఆకట్టుకున్నది. భారతి కళాసమితి డప్పు కళాకారులు ప్రదర్శన అగ్రభాగాన లయబద్ధమైన సంగీతంతో ఆకర్షణగా నిలిచారు. కోనేరు సెంటర్ నుంచి ప్రారంభమైన ర్యాలీ పట్టణ వీధులగుండా సాగి ఆంధ్ర జాతీయ కళాశాల వద్ద ముగిసింది. హర్ ఘర్ తిరంగా ర్యాలీని ప్రారంభించి మాట్లాడుతూ, ప్రతి ఇంటా మువ్వన్నెల పతాకాన్ని ఎగురవేసి స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించుకోవడమే కాకుండా, నషా ముక్త్ భారత్, టీబీ ముక్త్ భారత్ వంటి సామాజిక సందేశాలను ఇవ్వడమే లక్ష్యమని కల్నల్ రూపేష్ అవస్థి చెప్పారు. స్వాతంత్ర్య ఉద్యమంలో కీలక ఘట్టాలకు కేంద్రమైన మచిలీపట్నంలో మువ్వన్నెల జెండాను జాతీయ పతాక రూపకర్త శ్రీ పింగళి వెంకయ్య స్వయంగా పనిచేసిన ఆంధ్ర జాతీయ కళాశాల వరకూ ప్రదర్శించడం ద్వారా విద్యార్థులు ఒక చారిత్రాత్మక అనుభవంలో భాగమయ్యారని సీబీసీ అసిస్టెంట్ డైరెక్టర్ శ్రీ ఆర్ రమేష్ చంద్ర అన్నారు. అదే విధంగా, ఈగల్ విభాగం సహకారంతో మత్తు పదార్థాలకు వ్యతిరేకంగా నినాదాలతో ఎన్సీసీ 16వ బెటాలియన్ కేడెట్లు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎన్సీసీ కమాండెంట్ శ్రీ చందన్ ఠాకూర్ తో పాటు పలువురు ఉన్నతాధికారులు, జిల్లా పోలీసు అధికారులు పాల్గొన్నారు.

# మంచినీటి సమస్య రానివ్వం: ఎమ్మెల్యే నసీర్



**గుంటూరు: పెన్ పవర్, ఆగస్ట్, 11 :** తూర్పు నియోజకవర్గంలోని ప్రతి ప్రాంతానికి సక్రమంగా మంచినీటి సరఫరా అందేలా చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే మహ్మద్ నసీర్ తెలిపారు. సంగడిగుంట ప్రాంతంలో మంచినీటి సమస్యపై నగర కమిషనర్ మయూర్ అశోక్‌తో కలిసి ఆయన క్షేత్రస్థాయిలో పర్యటించారు. స్థానిక ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను కమిషనర్‌కు వివరించి, తక్షణమే పరిష్కరించాలని కోరారు. సంగడిగుంట, కబాడీగూడెం ప్రాంతాల్లో రోడ్లు, డ్రెయిన్లు, పారిశుధ్య సమస్యలపై ఎమ్మెల్యే అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఖాళీ స్థలాల్లో పిచ్చిమొక్కలు పెరిగి ప్రజలకు ఇబ్బందులు కలుగుతున్నందున యజమానులకు నోటీసులు జారీ చేయాలని సూచించారు. సచివాలయాలకు వచ్చే ప్రజలకు సిబ్బంది అందుబాటులో ఉండేలా పర్యవేక్షణ పెంచాలని కోరారు. పీకలవాగు స్ట్రామ్ డ్రెయిన్ నిర్మాణాన్ని పూర్తి చేసి 6, 7 వార్డుల్లో మురుగు సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని కమిషనర్‌ను కోరారు. అవసరమైన ప్రాంతాల్లో మంచినీటి ట్యాంకులు నిర్మించడంతో పాటు, మురుగు సమస్య శాశ్వత పరిష్కారానికి ప్రత్యేక కార్యాచరణ చేపడుతున్నామని ఎమ్మెల్యే తెలిపారు. రూ. 1.35 కోట్లతో ఔట్‌ఫాల్ డ్రెయిన్‌కు శంకుస్థాపన జామియానగర్ గొట్టాల రోడ్డులో రూ. 1.35 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టనున్న ఔట్‌ఫాల్ డ్రెయిన్ నిర్మాణానికి ఎమ్మెల్యే నసీర్ శంకుస్థాపన చేశారు. వర్షాకాలంలో మురుగు, పారిశుధ్య సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపడుతున్నామని, శంకుస్థాపన చేసిన పనులను వేగంగా పూర్తి చేస్తామని ఆయన తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గుంటూరు తూర్పు నియోజకవర్గంలో అభివృద్ధి పనులను వేగవంతం చేశామని ఎమ్మెల్యే నసీర్ పేర్కొన్నారు.

# హసీనాను అత్యంత కిరాతకంగా హతమార్చిన దుర్మార్గుడిని ఎన్ కౌంటర్ చేసినా తప్పులేదు : ప్రత్తిపాటి

**చట్టాన్ని మీరకూడదు కాబట్టి, రాజ్యాంగాన్ని గౌరవిస్తూ, పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్ కు పంపారు.**
**నిందితుడికి ఉరిశిక్ష పడేలా చంద్రబాబు ప్రభుత్వం చట్టప్రకారం అన్నిచర్యలు తీసుకుంటుంది.**
**భవిష్యత్ లో ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం, పోలీస్ శాఖ కఠిన చర్యలు చేపడుతుంది**

**చిలకలూరిపేట , పెన్ పవర్, ఆగస్టు 11 :** బీటెక్ పూర్తిచేసి, మంచి ఉద్యోగంచేస్తూ తన కుటుంబానికి అండగా నిలిచిన చిలకలూరిపేటకు చెందిన మైనారిటీ యువతి షేక్ హసీనాను, ప్రేమోన్మాది బాలసైదులు బలితీసుకోవడం అత్యంత దుర్మార్గమని, జరిగిన ఘటన తలుచుకుంటే హృదయం తరుక్కుపోతోందని శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం చిలకలూరిపేట 38వ వార్డులోని హసీనా నివాసానికి వెళ్లిన ప్రత్తిపాటి, మృతురాలి తల్లిదండ్రులు రిహానా, మస్తాన్ లను పరామర్శించారు. చేతికందివచ్చిన బిడ్డను కోల్పోయి గుండెలవిసేలా రోదిస్తున్న దంపతుల్ని ఓదార్చిన ప్రత్తిపాటి.. అన్ని విధాలా అండగా ఉంటామని, అధైర్యపడవద్దని భరోసా ఇచ్చారు. నిందితుడు బాలసైదులుకు కఠిన శిక్షపడేలా చూస్తానని, ప్రభుత్వం తరుపున తమ కుటుంబానికి న్యాయం జరిగేలా చూస్తానని వారికి హామీ ఇచ్చిన ప్రత్తిపాటి.. అనంతరం విలేకరులతో మాట్లాడారు.

**హసీనా తల్లిదండ్రుల వేదన మనసును కదిలించింది:** ఎదిగిన కుమార్తెను కోల్పోయిన హసీనా తల్లిదండ్రుల వేదన మనసును కదిలించిందని, వారికి జరిగిన అన్యాయానికి తగిన న్యాయం జరిగినప్పుడే వారి మనసు కుదుటపడుతుందని ప్రత్తిపాటి తెలిపారు. హసీనా తండ్రి మస్తాన్ పంచర్ షాప్ నిర్వహిస్తుండగా, తల్లి టిఫిన్ బండి పెట్టుకొని జీవనం సాగిస్తున్నారని, వారు ఎంతో కష్టపడి ఇద్దరు కుమార్తెలను చదివించారని, పెద్దమ్మాయి హసీనా ఈ విధంగా మరణించడంతో బాగా కుంగిపోయారని ప్రత్తిపాటి పేర్కొన్నారు. హసీనా హత్యోదంతాన్ని ముఖ్యమంత్రికి తెలియచేసి, యువతి కుటుంబానికి తగిన న్యాయం జరిగేలా చూస్తానని ప్రత్తిపాటి ఈ సందర్భంగా భరోసా ఇచ్చారు.

**బాలసైదుల్ని ఎన్ కౌంటర్ చేసినా తప్పులేదు :** పట్టణానికి చెందిన మైనారిటీ యువతి హసీనాను కారంపూడికి చెందిన బాలసైదులు ప్రేమిస్తున్నానంటూ నాలుగేళ్లుగా వేధిస్తున్నాడని, ఆ అమ్మాయి అతన్ని తిరస్కరించిందన్న అక్కసుతో ద్వేషం పెంచుకొని ఈ దారుణానికి ఒడిగట్టాడని ప్రత్తిపాటి తెలిపారు.



4వ తేదీ మధ్యాహ్నం మాట్లాడాలని మభ్యపెట్టి హసీనాను బయటకు తీసుకెళ్లిన బాలసైదుల.. కారంపూడి అటవీప్రాంతానికి తీసుకెళ్లి కత్తితో పొడిచి, పెట్రోల్ పోసి దహనం చేశాడు. 5వ తేదీన హసీనా తల్లిదండ్రులు ఫిర్యాదు చేయగా, 7వ తేదీన నిందితుడిని పోలీసులు హైదరాబాద్ లో అదుపులోకి తీసుకున్నారు. ఫోన్లు మార్చి తప్పించుకునే ప్రయత్నం చేసినా చిలకలూరిపేట పోలీసులు చాకచక్యంగా వ్యవహరించి బాలసైదుల్ని పట్టుకున్నారు. ఇంతటి దుర్మార్గానికి ఒడిగట్టిన బాలసైదుల్ని ఎన్ కౌంటర్ చేసినా తప్పులేదని, కానీ చట్టాన్ని మీరకూడదు కాబట్టి పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్ కు పంపారని ప్రత్తిపాటి చెప్పారు. హసీనా వద్ద ఉన్న8 సవర్ల బంగారాన్ని బాలసైదులు కాజేశాడని యువతి తల్లిదండ్రులు చెబుతున్నారని, ఆ బంగారం ఏమైంది.. హత్యలో బాలసైదులుకు ఎవరైనా సహకరించారా అనే కోణంలోనూ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. బాలసైదుల్ని సకాలంలో పట్టుకోవడంలో సమర్థవంతంగా వ్యవహరించిన పోలీసుల్ని ప్రత్యేకంగా అభినందిస్తున్నట్టు ప్రత్తిపాటి తెలిపారు.

**భవిష్యత్ లో ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా కఠిన చర్యలు తీసుకోవాలి.** భవిష్యత్ లో ఇటువంటి దారుణ ఘటనలు పునరావృతం కాకుండా పోలీసులు, ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని ప్రత్తిపాటి డిమాండ్ చేశారు. ప్రేమ పేరుతో పైశాచికంగా ప్రవర్తించే దుర్మార్గులకు, హసీనా ఉదంతం ఒక మంచి గుణపాఠంగా నిలిచిపోయేలా తగిన చర్యలు చేపట్టాలని ప్రభుత్వాన్ని కోరుతున్నామన్నారు. చట్టప్రకారం ప్రభుత్వం నిందితుడిని కఠినంగా శిక్షిస్తుందని, హసీనా తల్లిదండ్రులకు అండగా ఉంటుందని ప్రత్తిపాటి భరోసా ఇచ్చారు.

**ఆ దుర్మార్గుడికి ఏ శిక్ష వేసినా తక్కువే : మస్తాన్ (హసీనా తండ్రి)**
ఇంటినుంచి బయటకు రాకుండా ఇద్దరు బిడ్డల్ని జాగ్రత్తగా పెంచి పెద్దచేశామని, మా పని చేసుకోవడం తప్ప, మరే విషయాల్లోనూ జోక్యం చేసుకోమని, అలాంటి మాకు ఇలా జరగిందని హసీనా తండ్రి మస్తాన్ కన్నీటి పర్యంతమయ్యారు. తన కుమార్తెను చంపిన దుర్మార్గుడికి ఏ శిక్ష వేసిన తక్కువే అవుతుందని, ప్రభుత్వం తమకు న్యాయం చేయాలని ఆయన వేడుకున్నారు.

**ఈ ప్రభుత్వం మాకు న్యాయం చేయాలి : రిహానా (హసీనా తల్లి)**
కష్టపడి తన బిడ్డను బీటెక్ చదివించామని, జాగ్రత్తగా పెంచుకున్న తన బిడ్డను ఒక నీచుడు గద్దలా తన్నుకుపోయాడని, అతడికి ఉరిశిక్ష వేయాలని హసీనా తల్లి రిహానా డిమాండ్ చేశారు. ఈ ప్రభుత్వంలో ఇలా జరగడం బాధగా ఉందని, తమకు సరైన న్యాయం చేయాలని ఆమె అభ్యర్థించారు. నా బిడ్డను కాల్చినట్టే ఆ దుర్మార్గుడిని కాల్చి చంపేయాలని, ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, ఎమ్మెల్యే ప్రత్తిపాటిని వేడుకుంటున్నానని, బాలసైదులు తన బిడ్డతో పాటు.. తనను చంపేశాడని రిహానా కన్నీళ్లు పెట్టుకున్నారు.

## ఎర్రుపాలెం - నంబూరు రైల్వే లైన్ భూసేకరణ వేగవంతం చేయాలి : జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ



**విజయవాడ ,పెన్ పవర్ ఆగస్టు 11 :** అమరావతిని అనుసంధానిస్తూ ప్రతిపాదించినఎర్రుపాలెం--నంబూరు కొత్త రైల్వే లైన్‌కు అవసరమైన భూసేకరణ పనులను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ అధికారులను ఆదేశించారు. మంగళవారం వీరులపాడు మండలం జుజ్జూరు గ్రామం వద్ద భూసేకరణ ప్రక్రియను కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. భూ యజమానులకు ఇప్పటికే నోటీసులు జారీ చేసిన నేపథ్యంలో నిబంధనల ప్రకారం తదుపరి ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. ఎన్టీఆర్ జిల్లా వీరులపాడు మండలంలోని ఆరు గ్రామాల్లో సుమారు 175 ఎకరాలు, కంచికచర్ల మండలంలోని రెండు గ్రామాల్లో సుమారు 120 ఎకరాల భూమిని భూసేకరణలోకి తీసుకున్నట్లు తెలిపారు. భూ యజమానులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పారదర్శకంగా భూసేకరణ చేపట్టాలని, పెండింగ్ అంశాలను త్వరితగతిన పరిష్కరించాలని కలెక్టర్ ఆదేశించారు. ఎర్రుపాలెం నుంచి అమరావతి మీదుగా గుంటూరు జిల్లా నంబూరు వరకు ఏర్పాటు కానున్న ఈ రైల్వే మార్గం అమరావతి, పరిసర ప్రాంతాల రవాణా మరియు ఆర్థిక అభివృద్ధికి కీలకంగా నిలుస్తుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో నందిగామ ఆర్డీఓ గడ్డిపాటి అనిల్ కుమార్, భూసేకరణ అధికారి భాస్కర నాయుడు, తహసీల్దార్ పాలపర్తి రవికుమార్, ఎంపీడీఓ శేఖర్, రెవెన్యూ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## గూడూరులో ఇంటింటికీ 'రెండేళ్ల నమ్మకం - అభివృద్ధి, సంక్షేమం'



**గూడూరు, పెన్ పవర్, ఆగస్టు 11 :** కూటమి ప్రభుత్వం రెండేళ్ల పాలనలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరిస్తూ గూడూరు గ్రామంలో కూటమి నాయకులు మంగళవారం డోర్ టు డోర్ కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలతో కూడిన కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాజీ సర్పంచ్ పోతన రామోజీ మాట్లాడుతూ.. ఇంటింటికీ వెళ్లి కరపత్రాలు పంపిణీ చేస్తుంటే ప్రజలు స్వచ్ఛందంగా ఎదురొచ్చి కూటమి ప్రభుత్వ పాలనలో అంతా మంచే జరుగుతోందని ఆనందం వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ నాయకత్వంలో రాష్ట్రం మరింత అభివృద్ధి పథంలో ముందుకు సాగుతుందనే ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. ప్రజలకు అందుతున్న సంక్షేమ పథకాలు, గ్రామాల్లో జరుగుతున్న అభివృద్ధి పనులను మరింత విస్తృతంగా వివరించేందుకు ఇలాంటి కార్యక్రమాలు కొనసాగిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర తెలుగు యువత కార్యదర్శి ఎన్.ఏ. బేగ్, మండల టీడీపీ కార్యదర్శి యారా ప్రసాద్, ప్రభుత్వ ఆసుపత్రి డైరెక్టర్ బేతాళ స్వామి, బచ్చుల రామాంజనేయులు, సాత కుమారస్వామి, శీలం పవన్ కళ్యాణ్, అలుగు సారథి, మొహమ్మద్ ఖాజా తదితరులు పాల్గొన్నారు.

# ఇంటింటికీ తెలుగుదేశానికి ప్రజల నుంచి అనూహ్య స్పందన : ప్రత్తిపాటి

**రూ.9 లక్షలతో నిర్మించనున్న సీసీరోడ్డు, డ్రైనేజ్ లకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే.**
**చెత్త సేకరణ నిమిత్తం రూ.22 లక్షలతో కొనుగోలు చేసిన మున్సిపల్ ట్రాక్టర్లు ప్రారంభించిన ప్రత్తిపాటి.**





**చిలకలూరిపేట , పెన్ పవర్, ఆగస్టు 11:** కూటమి ప్రభుత్వ రెండేళ్ల పాలనా విజయాలను వివరిస్తూ, తెలుగుదేశం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇంటింటికీ తెలుగుదేశం కార్యక్రమానికి ప్రజల నుంచి అనూహ్య స్పందన వస్తోందని శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు తెలిపారు. మంగళవారం ఆయన చిలకలూరిపేట పట్టణంలోని 33వ వార్డులో పార్టీశ్రేణులతో కలిసి ఇంటింటికీ తెలుగుదేశం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పలు ఇళ్లకు వెళ్లిన ప్రత్తిపాటి.. ప్రభుత్వ పనితీరుపై ప్రజల మనోగతం తెలుసుకున్నారు. వారు తెలియచేసిన సమస్యల్ని అధికారుల దృష్టికి తీసుకెళ్లిన ప్రత్తిపాటి.. వీలైనంత త్వరగా వాటిని పరిష్కరించాలని ఆదేశించారు. అనంతరం రూ. 9 లక్షలతో నిర్మించనున్న సీసీరోడ్డు, డ్రైనేజ్ నిర్మాణ పనులకు పార్టీ శ్రేణులతో కలిసి ప్రత్తిపాటి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ప్రత్తిపాటి మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వంలో ప్రధాన పక్షమైన తెలుగుదేశం చేపట్టిన ఇంటింటికీ తెలుగుదేశం కార్యక్రమం విజయవంతంలో పార్టీ శ్రేణులతో పాటు. మిత్ర పక్షాలైన జనసేన, బీజేపీ శ్రేణులు కూడా కలిసి రావడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. కూటమి విజయాలు, రెండేళ్లలో సాధించిన అభివృద్ధి, నిరంతరం అందుతున్న సంక్షేమ పథకాలపై ప్రజల్లో సంతోషం వ్యక్తమవుతోందన్నారు.

**ట్రాక్టర్లు ప్రారంభించిన ప్రత్తిపాటి:** 33వ వార్డులో కార్యక్రమానంతరం ప్రత్తిపాటి.. స్థానిక మున్సిపల్ కార్యాలయ ఆవరణలో రూ. 22 లక్షలతో కొనుగోలు చేసిన నూతన ట్రాక్టర్లను ప్రారంభించారు. చెత్తసేకరణ వాహనాల నిర్వహణలో అశ్రద్ధ పనికిరాదని, డ్రైవర్లు, మున్సిపల్ సిబ్బంది తమ విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించవద్దని ఈ సందర్భంగా ప్రత్తిపాటి సూచించారు. కార్యక్రమంలో నియోజకవర్గ అబ్జార్వార్ ఆడక స్వాములు, సమన్వయకర్త నెల్లూరి సదాశివరావు, మార్కెట్ యార్డు చైర్మన్ షేక్ కరిముల్లా, పట్టణ అధ్యక్షులు పఠాన్ సమద్ ఖాన్, మున్సిపల్ మాజీ చైర్మన్ షేక్ రఫాని, ప్రధాన కార్యదర్శి మద్దుమాల రవి, రాష్ట్ర డైరెక్టర్ కందుల రమణ, బీజేపీ నేతలు మల్లెల శివనాగేశ్వరరావు, నెల్లూరి రంజిత్, టీడీపీ నాయకులు మద్దిబోయిన శివ, ముల్లా కరిముల్లా, షేక్ మస్తాన్ వలి, ఇనగంటి జగదీష్, అజిత్ జోసెఫ్, ముకిరి సతీష్, సురేష్, కొండేపాటి రమేష్, తోట బ్రాహ్మస్వాములు, బేరింగ్ మౌలాలి కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## సీపీఐ ప్రచార పాదయాత్ర

**కేంద్రప్రభుత్వ విధానాలపై తీవ్ర విమర్శలు**




**చిలకలూరిపేట , పెన్ పవర్, ఆగస్టు 11:** కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగడుతూ సీపీఐ ఆధ్వర్యంలో పేటలో ప్రచార పాదయాత్రను ప్రారంభించారు. ఆగస్టు 6 నుంచి 15 వరకు సాగే ఈ యాత్రలో భాగంగా సీపీఐ ఏరియా కార్యదర్శి తాళ్లూరి బాబురావు మాట్లాడుతూ.కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఉద్యోగాల కల్పన తదితర ఎన్నికల హామీలను గాలికొదిలేసి, మత విద్వేషాలను రెచ్చగొడుతోందని విమర్శించారు. దేశ సంపదను కార్పొరేట్లకు కట్టబెడుతూ, దర్యాప్తు సంస్థలను రాజకీయ కక్షసాధింపులకు వాడుకుంటోందని మండిపడ్డారు. ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా సాగుతున్న ఈ పాదయాత్రకు, అలాగే సెప్టెంబర్ 1న నిర్వహించే 'చలో ఢిల్లీ' కార్యక్రమానికి ప్రజలు పెద్దఎత్తున మద్దతు తెలిపి జయప్రదం చేయాలని ఆయన తెలిపారు.


## కమ్మవారిపాలెం గ్రామ పరిధిలో జింక మృతి

**అనారోగ్యంతోనే చనిపోయినట్లు అధికారుల నిర్ధారణ.**



**చిలకలూరిపేట రూరల్ , పెన్ పవర్, ఆగస్టు 11 :** పల్నాడు జిల్లా చిలకలూరిపేట రూరల్ పరిధిలో విషాదకర సంఘటన చోటు చేసుకుంది. కమ్మవారిపాలెం గ్రామ పరిధిలోని పోలేరమ్మ గుడి ఎదురుగా ఉన్న పంట కాలువ పక్కన ఒక జింక మృతి చెందింది. స్థానికులు గమనించిన వెంటనే అందించిన సమాచారంతో అటవీశాఖ అధికారులు వెంటనే అప్రమత్తమై ఘటనాస్థలికి చేరుకున్నారు. కోటప్పకొండ బీట్ ఆఫీసర్ కిరణ్ ఆధ్వర్యంలో అధికారులు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. అనంతరం పశువైద్యులు జింక మృతదేహానికి అక్కడే పోస్టుమార్టం నిర్వహించారు. వైద్యుల ప్రాథమిక నిర్ధారణ ప్రకారం జింకకు ఎలాంటి బాహ్య గాయాలు లేవని, కేవలం అనారోగ్యంతోనే ఇది మృతి చెందిందని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా అటవీశాఖ అధికారులు మాట్లాడుతూ,అటవీ ప్రాంతం చుట్టుపక్కల ఎక్కడైనా వన్యప్రాణులు మృతి చెందినా లేదా గాయపడినా ప్రజలు వెంటనే తమకు సమాచారం అందించాలని సూచించారు. వన్యప్రాణుల సంరక్షణకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు.


## సంగీత సాహిత్యాలు సరితూచిన త్రాసు - ఆదిభట్ల నారాయణదాసు



**మచిలీపట్నం, పెన్ పవర్,ఆగస్టు 11 :** ఈడేపల్లి శ్రీ ప్రసన్నాంజనేయ స్వామి దేవస్థానంలో భక్త బృందం ఆధ్వర్యంలో నిర్వహించిన శ్రీమదజ్జాడ ఆదిభట్ల నారాయణదాసు ఆరాధనోత్సవాలు మంగళవారం ఘనంగా ముగిశాయి. మూడో రోజు కార్యక్రమాలు హనుమాన్ చాలీసా సమిష్టి పారాయణంతో ప్రారంభమయ్యాయి. అనంతరం ప్రముఖ న్యాయవాది, సాహితీ మిత్రులు అధ్యక్షులు లంకిశెట్టి బాలాజీ అధ్యక్షతన సభ జరిగింది. బాలాజీ మాట్లాడుతూ తెలుగు సాంస్కృతిక, సాహిత్య, కళారంగాలకు ఎనలేని సేవలందించిన బహుముఖ ప్రజ్ఞాశాలి ఆదిభట్ల నారాయణదాసు విగ్రహాన్ని భోగాపురం విమానాశ్రయం సమీపంలో ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ముఖ్యఅతిథి ఉడత్తు కిషోర్ మాట్లాడుతూ మచిలీపట్నంలో నారాయణదాసు ఆరాధనోత్సవాలను ఘనంగా నిర్వహించడం అభినందనీయమన్నారు. వడ్లమూడి వీరాంజనేయులు మాట్లాడుతూ హరికథను జ్ఞానం, భక్తి, నీతి, సాహిత్య రసాస్వాదనలకు వేదికగా మలిచిన దార్శనికుడు నారాయణదాసు అన్నారు. ఈ సందర్భంగా ప్రముఖ హరికథకుడు కొత్తపల్లి వేణుమాధవ్ భాగవతార్, ప్రముఖ వాయులీన విద్వాంసుడు డాక్టర్ పాణ్యం దక్షిణామూర్తిని ఘనంగా సత్కరించారు. అనంతరం మడవల రాంబాబు భాగవతార్ 'సతీతులసి' హరికథను ఆలపించారు. పాణ్యం దక్షిణామూర్తి, కాపవరపు సుబ్బారావులు వాద్య సహకారం అందించారు. గంజాల కొండయ్య, అప్పినేడి పోతురాజు కార్యక్రమాలను పర్యవేక్షించారు. అనుముకొండ వెంకటేశ్వరరావు, తోట హనుమంతరావు, మెట్టు ఆదిశేషు, తాతా శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## అంతరిక్ష శాస్త్రవేత్తకు ప్రతిష్టాత్మక అవార్డు..

**బాపట్లలో మూలాలు**



**బాపట్ల:( పెన్ పవర్), ఆగస్టు 11** బాపట్ల బెంగళూరులోని యు.ఆర్. రావు సాటిలైట్ సెంటర్‌లో అంతరిక్ష శాస్త్రవేత్తగా పనిచేస్తున్న నెల్లూరు వాసి వట్యం సాయి క్రాంతికి 2025 సంవత్సరానికి గాను ఆస్ట్రోనాటికల్ సొసైటీ ఆఫ్ ఇండియా ప్రతిష్ఠాత్మక ఉడియమాన్ యువ అచీవ్‌మెంట్ అవార్డుకు ఎంపికయ్యారు. ప్రస్తుతం ఆయన భారతదేశ ప్రతిష్ఠాత్మక భారత్ అంతరిక్ష స్టేషన్ ప్రాజెక్టులో పనిచేస్తున్నారు. దేశంలోని అన్ని ఇస్రో కేంద్రాల నుంచి యువ శాస్త్రవేత్తల విభాగంలో ఈ అవార్డుకు సాయి క్రాంతి ఒక్కరే ఎంపిక కావడం విశేషం. ఈ నెల 12న అహ్మదాబాద్‌లో అవార్డును ప్రదానం చేయనున్నారు. సాయి క్రాంతి భార్య కే. శాలిని బాపట్ల విజయలక్ష్మీపురానికి చెందిన బాపట్ల ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల పూర్వ విద్యార్థిని ఎస్. సుజాత (బి.ఏ.) కుమార్తె. దీంతో సాయి క్రాంతికి ప్రతిష్ఠాత్మక అవార్డు రావడంతో బాపట్లలోని కుటుంబ సభ్యులు, బంధువులు, స్నేహితులు హర్షం వ్యక్తం చేస్తూ సుజాతకు ఫోన్ చేసి శుభాకాంక్షలు తెలియజేస్తున్నారు. సాయి క్రాంతి నెల్లూరులో విద్యాభ్యాసం పూర్తి చేసి జేఈఈ మెయిన్స్ అడ్వాన్స్ లో ప్రతిభ కనబరిచి తిరువనంతపురంలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ స్పేస్ సైన్స్ అండ్ టెక్నాలజీ లో ఏవియానిక్స్‌లో ఇంజినీరింగ్ పూర్తి చేశారు. 2017లో యు.ఆర్. రావు సాటిలైట్ సెంటర్‌లో శాస్త్రవేత్తగా చేరారు. బాపట్లకు చెందిన కుటుంబ సభ్యుడి అల్లుడిగా సాయి క్రాంతి అంతరిక్ష రంగంలో జాతీయ స్థాయిలో గుర్తింపు పొందడం పట్ల స్థానికులు గర్వం వ్యక్తం చేస్తున్నారు.

## మార్పు రావాలి - మార్పు కావాలి.



**బాపట్ల:(పెన్ పవర్) ఆగస్టు 11** బాపట్ల పట్టణంలో మార్పు రావాలి – మార్పు కావాలి లో భాగంగా సీపీఐ పాదయాత్ర లో అధిక ధరలు తగ్గించాలని నిరుద్యోగులకు నిరుద్యోగ భృతి ఇవ్వాలని రైతులకు లాభసాటి ధర ఇవ్వాలని కౌలు రైతులకు గుర్తింపు కార్డులు ఇచ్చి రుణ సదుపాయం సిపిఐ జిల్లా కార్యదర్శి తన్నీరు సింగరకొండ తెలిపారు. బాపట్ల పట్టణంలో సిపిఐ ఆధ్వర్యంలో ఎర్ర టవళ్ల ముఠా యూనియన్ ఆఫీస్ నుంచి పెద్ద అంబేద్కర్ బొమ్మ గడియార స్తంభం సెంటర్ మార్కెట్ సెంటర్ నందు కరపత్రాలు పంపిణీ చేశారు. సిపిఐ ఆధ్వర్యంలో ప్రచార ఆందోళనలు పాదయాత్రలు జీబు యాత్రలు జయప్రదం చేయాలని సెప్టెంబర్ ఒకటవ తేదీన చలో ఢిల్లీకి కదిలి రావాలని అయన పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ మహిళా రిజర్వేషన్లు వెంటనే అమలు చేయాలని, దళిత ఆదివాసీలు,మహిళలపై చేస్తున్న అత్యాచారాలను, దాడులను అరికట్టాలన్నారు. రొయ్యల మేతల ధరలు తగ్గించి ఆక్వారంగాన్ని ఆదుకోవాలని, ప్రభుత్వ రంగంలో ఖాళీగా ఉన్న అన్ని పోస్టులను భర్తీ చేయాలని, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న నిరంకుశ ప్రజా వ్యతిరేక విధానాలను త్రిప్పి కొట్టాలన్నారు. భారత రాజ్యాంగాన్ని ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించాలని కోరుతూ బాపట్ల పట్టణంలో రెండవ విడత సిపిఐ ఆధ్వర్యంలో పాదయాత్రను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు, ఏఐటీయూసీ నాయకులు తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా సీనియర్ నాయకులు ముత్తిరెడ్డి శ్రీనివాసరావు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు పమిడిబోయిన రామాంజనేయులు, బాపట్ల పట్టణ కార్యదర్శి మామిడి బత్తుల అశోక్, రైతు సంఘం జిల్లా నాయకులు చీరాల సూర్యనారాయణ రెడ్డి, మహిళా సమైక్య జిల్లా కన్వీనర్ జే రత్నకుమారి, డిహెచ్పిఎస్ జిల్లా కార్యదర్శి దాసి నాగేశ్వరరావు, ఫణీంద్ర, వెంకటేష్,మురళి, వెంకటేశ్వర్లు, తదితరులు సిపిఐ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## శ్రీవారి పాటలు వేలన చేసిన వైసిపి పార్టీని వెంటనే రద్దు చేయాలి : రాచకొండ లక్ష్మయ్య



**గుంటూరు, పెన్ పవర్, ఆగస్ట్, 11 :** శ్రీవారి పాట ను అవహేళన చేసిన జగన్మోహన్ రెడ్డి పార్టీ ని వెంటనే రద్దుచేయాలని రజక హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షులు రాచకొండ లక్ష్మయ్య బహిరంగ లేఖ. శ్రీవారి గీతాన్ని అవహేళన చేసి కోట్లాది మంది హిందువుల మనోభావాలను దెబ్బతీసి ,సనాతన ధర్మాన్ని కించపరిచే విధంగా వ్యవహరించిన వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ని రద్దు చేయాలని, నాయకులు ను వెంటనే అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు .గత 25 సంవత్సరాల నుండి లక్ష ల మంది ని మత మార్పిడి చేసిన మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి కుటుంబం , సనాతనం ధర్మం మీద చేసే కుట్రలు అడ్డు కోవాలని, కుల మత ప్రాంతాల మధ్య చిచ్చు పెట్టి ముఖ్యమంత్రి కావడం కోసం జగన్మోహన్ రెడ్డి ఏకైక లక్ష్యం అనిఈ లేఖలో లక్ష్మయ్య పేర్కొన్నారు. భారత ఎన్నికల సంఘం ముఖ్య కమిషనర్ వెంటనే స్పందించి చర్యలు తీసుకోవాలని, లేనిపక్షంలో దేశం విచ్ఛిన్నం అయ్యే ప్రమాదం ఉందని రజక హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షులు రాచకొండ లక్ష్మయ్య ఆందోళన వ్యక్తం చేశారు.

# ఏపీలో కుటుంబ రాజకీయాలు..సమీకరణలు!

**విజయవాడ, ఆగస్టు 11 పెన్ పవర్:** వైయస్ రాజశేఖర్ రెడ్డి అకాల మరణంతో కాంగ్రెస్ పార్టీ నుంచి బయటికి వచ్చారు జగన్మోహన్ రెడ్డి. రాజశేఖర్ రెడ్డి రాజకీయ వారసత్వంగా ముఖ్యమంత్రి పదవి కోరుకుంటే ఆ ఫ్యామిలీ. అందుకు పార్టీ హై కమాండ్ అంగీకరించకపోవడంతో జగన్మోహన్ రెడ్డి పార్టీకి రాజీనామా చేశారు. కేసుల రూపంలో సంక్లిష్ట పరిస్థితులను ఎదుర్కొన్నారు. ఆ సమయంలో ఫ్యామిలీ మొత్తం జగన్మోహన్ రెడ్డికి అండగా నిలబడింది.. ఆ ఫ్యామిలీ మద్దతుతోనే పార్టీని ఏర్పాటు చేశారు. తొలి ఎన్నికల్లో అధికార పార్టీకి ధీటుగా సీట్లు తెచ్చుకున్నారు. 2019 ఎన్నికల్లో ఘనవిజయం సాధించారు. తల్లి విజయలక్ష్మి, చెల్లెలు షర్మిల, బాబాయ్ వివేకానంద రెడ్డి, సోదరులు అవినాష్ రెడ్డి, మేనమామ రవీంద్రనాథ్ రెడ్డి.. ఇలా చెప్పుకుంటే ఆ ఫ్యామిలీ మొత్తం జగన్మోహన్ రెడ్డికి అండగా నిలబడింది. అయితే అదే సమయంలో టిడిపిలో చూస్తే మాత్రం చంద్రబాబుతో పాటు లోకేష్ కు సొంత కుటుంబం దన్ను అంతగా లేకపోయింది. కానీ ఇప్పుడు జగన్ కు ఫ్యామిలీ అండ తగ్గింది. చంద్రబాబుకు గణనీయంగా పెరుగుతూ వస్తోంది.తెలుగుదేశం అధినేత చంద్రబాబు విషయంలో కుటుంబ పరంగా ఒక భిన్న వాతావరణం ఉండేది. నందమూరి హరికృష్ణ అండగా నిలిచేవారు. కానీ అదే సమయంలో రెబల్గా కూడా వ్యవహరించేవారు. ఎప్పుడు ఎలా ఉండేవారో తెలియంది కాదు. మరోవైపు తోడల్లుడు దగ్గుబాటి వెంకటేశ్వరరావు, పురందేశ్వరి దంపతులు సైతం వ్యతిరేకంగా ఉండేవారు. చంద్రబాబు రాజకీయ ప్రత్యర్థులతో చేతులు కలిపారు. మరోవైపు సమీప బంధువు, జూనియర్ ఎన్టీఆర్ మామ నార్నియా శ్రీనివాసరావు సైతం చంద్రబాబుకు పూర్తిగా వ్యతిరేకంగా మారిపోయారు. ఇలా సొంత కుటుంబ సభ్యులే చికాకుల మీద చికాకులు తెచ్చి పెట్టేవారు. మరోవైపు లోకేష్ ఆశించిన స్థాయిలో పట్టు పెంచుకోలేదు అప్పట్లో.అయితే కాలం ఎప్పుడూ ఒకేలా ఉండదు. ఎవరు మనసులో ఏముంటుందో కూడా చెప్పలేము. అప్పుడు జగన్ కు ఫ్యామిలీ అండగా నిలబడగా.. ఇప్పుడు అదే ఫ్యామిలీ వ్యతిరేకంగా మారిపోయింది. మొదట చెల్లెలు షర్మిల దూరమయ్యారు. ఆమెకు అండగా నిలిచేందుకు జగన్మోహన్ రెడ్డికి దూరమయ్యారు తల్లి విజయమ్మ. బాబాయ్ వివేకానంద రెడ్డి హత్య కేసుతో కుటుంబం అంతా అడ్డగోలుగా చీలిపోయింది. మరో చెల్లెలు సునీత పూర్తిగా ప్రత్యర్థిగా మారిపోయారు. ఇప్పుడు కేవలం జగన్మోహన్ రెడ్డి వెంట కుటుంబంలో నిలిచేది అవినాష్ రెడ్డి, ఆయన ఫ్యామిలీ. మిగతా వారంతా దూరమైనట్టే. కేవలం దూరం మాత్రమే కాదు రాజకీయంగా విభేదించడం కూడా మొదలుపెట్టారు. మొన్నటి ఎన్నికల్లో ప్రభావం కూడా చూపారు..అయితే ఇప్పుడు చంద్రబాబు విషయానికి వద్దాం. నందమూరి ఫ్యామిలీ పూర్తిగా ఆయనకు అండగా నిలుస్తోంది. జూనియర్ ఎన్టీఆర్ సైతం మౌనం వహించక తప్పడం లేదు. తోడల్లుడు దగ్గుబాటి వెంకటేశ్వరరావు, పురందేశ్వరి దంపతులు సైతం రాజీ పడ్డారు. మొన్నటి ఎన్నికల్లో బిజెపితో తెలుగుదేశం పొత్తుకు పురందేశ్వరి ఒక కారణం. ప్రస్తుతం వారి కుమారుడు సైతం నారా లోకేష్ తో పనిచేసేందుకు సిద్ధంగా ఉన్నారు. ఇంకోవైపు నారా రోహిత్ అంటే చంద్రబాబు తమ్ముడి కుమారుడు సైతం లోకేష్ తో కలిసి పని చేస్తున్నారు. ఇంకో వైపు లోకేష్ తోడల్లుడు, నందమూరి బాలకృష్ణ చిన్న అల్లుడు శ్రీ భరత్ సైతం పార్టీకి అండదండగా నిలుస్తూ వచ్చారు.. ఇలా చెప్పుకుంటే ఫ్యామిలీలన్నీ ఇప్పుడు అంతా ఒక్కటై చంద్రబాబుకు అండగా నిలబడుతున్నాయి. జగన్మోహన్ రెడ్డితో పోల్చుకుంటే చంద్రబాబుకు ఇప్పుడు ఫ్యామిలీ బలం అదనం.

03
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
కోర్టు పబ్లికేషన్ యాడ్స్
కేవలం
యాడ్ 500/-
'పొ. 12 సెం.మీ, వె. 8 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

## వైసీపీకి బూమ్ రాంగ్ అవుతోందా

**విజయవాడ, ఆగస్టు 11 పెన్ పవర్:** రాజకీయాల్లో సుదీర్ఘ అనుభవం, చట్టాలు-పరిపాలనపై క్షుణ్ణమైన అవగాహన ఉన్న ధర్మాన ప్రసాదరావు, బొత్స సత్యనారాయణ వంటి వైఎస్సార్సీపీ సీనియర్ నేతలకు ఏది ప్రజాదరణ పొందే అంశమో, ఏది శూన్యమైన విమర్శో స్పష్టంగా తెలుసు. దశాబ్దాల తరబడి ఎన్నికల రాజకీయాలను ఒంటబట్టించుకున్న ఈ అనుభవజ్ఞులకు.. కనీస ఆధారం లేకుండా ప్రతిపక్షం లేవనెత్తే అంశాలు ప్రతికూలతను పెంచుతాయే తప్ప, ప్రజల నుంచి ఒక్క శాతం కూడా సానుకూలతను తీసుకురావు అనే నిలువెత్తు సత్యం తెలియంది కాదు. అయినా సరే, పార్టీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి నిర్దేశిస్తున్న వ్యూహాలకు తలొగ్గి, తమ సొంత రాజకీయ క్రెడిబిలిటీని బలిపీఠం ఎక్కించేసుకుంటున్నారు.గతంలో ఉమ్మడి ఏపీ కాంగ్రెస్ హయాం నుంచి నేటి వైఎస్సార్సీపీ వరకు సీనియర్ నాయకులుగా చెరగని ముద్ర వేసుకున్న ఈ నేతలు.. జగన్ అనుసరిస్తున్న ఏకపక్ష రాజకీయ శైలి వల్ల సమాజంలో తమ ఆత్మగౌరవాన్ని కోల్పోతున్నారనే చర్చ నడుస్తోంది. డీఎస్సీ వంటి నిరుద్యోగ సున్నిత అంశాలపై ఎటువంటి డాక్యుమెంటరీ ఆధారాలు లేకపోయినా, కోర్టుల్లో విచారణకు కూడా నిలబడే సాక్ష్యాలు చూపించలేకపోయినా.. జగన్ మైక్ ముందు చెప్పిన ప్రతిపాయింట్‌నూ కిందిస్థాయిలో బలవంతంగా మోయాల్సి రావడం వారి రాజకీయ అనుభవానికే అవమానకరంగా మారింది. ఆధారం లేని పోరాటం వల్ల ఎంపికైన 16,000 మందికి పైగా ఉపాధ్యాయులు, వారి కుటుంబాల ఆగ్రహానికి గురికావాల్సి వస్తోంది.తన స్వయంకృతాపరాధ నిర్ణయాలతో స్వయంగా నెత్తిపై చేయి పెట్టుకునే భస్మాసుర రాజకీయాన్ని జగన్ నడుపుతుంటే, సీనియర్లు తెలిసీ తెలియక అందులో భాగస్వాములు అవుతున్నారనేది నిగ్గు తేలిన నిజం. పార్టీ అధికారంలో ఉన్నప్పుడు కూడా సజ్జల రామకృష్ణారెడ్డి నెట్‌వర్క్ చెప్పినట్లే వినాల్సి వచ్చిందని, ఇప్పుడు ప్రతిపక్షంలో ఉన్నా సరే అదే తీరు కొనసాగుతోందని అంతర్గత మథనం వ్యక్తమవుతోంది. దశాబ్దాలుగా ప్రజాక్షేత్రంలో సంపాదించుకున్న గుర్తింపును, ఇమేజ్‌ను ఒకే వ్యక్తి రాజకీయ ఆధిపత్యం, వ్యర్థ రాజకీయ ఎజెండాల కోసం ధారపోయడం ఎంతవరకు సమంజసమనే ప్రశ్నకు వారి వద్ద సమాధానం లేదు.ఇంత బతుకు బతికి సొంత రాజకీయాన్ని, స్వయంప్రతిపత్తిని పక్కనబెట్టి జగన్ రెడ్డి వద్ద ఈ రకంగా డీలా పడిపోవడానికి వారి మనసు ఎలా ఒప్పుతుందోగానీ, ఈ ధోరణి ఇలాగే కొనసాగితే వారి రాజకీయ జీవితాలకు ఇది తీవ్రమైన నష్టం చేకూరుస్తుంది. అధినేత చెప్పే తప్పుడు కథనాలకు మద్దతుగా ప్రెస్ మీట్లు పెట్టడం ఆపి, ఇప్పటికైనా తమ రాజకీయ వ్యూహాలను సమీక్షించుకోవాల్సిన తక్షణం ఆసన్నమైంది. సమాజంలో తమకున్న గౌరవాన్ని కాపాడుకోవడానికైనా లేదా ప్రత్యామ్నాయ రాజకీయ దారులు చూసుకోవడానికైనా ఈ సీనియర్ నాయకులు మౌనం వీడాల్సిన అవసరం ఉంది.

### సాంకేతిక అవకతవకలు, అక్రమాలు

ఆంధ్రప్రదేశ్ కూటమి ప్రభుత్వం అత్యంత పారదర్శకంగా, రికార్డు స్థాయిలో 16,347 ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి నిర్వహించిన మెగా డీఎస్సీపై ప్రతిపక్షం ఆది నుంచి ఆరోపణలు గుప్పిస్తూనే ఉంది. అయితే ఆ ఆరోపణల్లో ఒక్కటంటే ఒక్క బలమైన చట్టబద్ధమైన ఆధారాన్ని కూడా వైసీపీ బయటపెట్టలేకపోయింది. సాంకేతిక అవకతవకలు, అక్రమాలు జరిగాయని ఎన్ని కథనాలు అల్లినా, నిరుద్యోగులు గానీ, పరీక్ష రాసిన వేలాది మంది అభ్యర్థులు గానీ వాటిని నమ్మే పరిస్థితి లేదు. న్యాయస్థానాలను ఆశ్రయించి పక్కా సాక్ష్యాధారాలతో సీబీఐ విచారణ కోరడంలో ఆ పార్టీ తరఫు నేతలు ఘోరంగా విఫలమయ్యారు. కోర్టుల్లో నిలబడని, ఆధారాలు సమర్పించలేని కథనాలతో వీధుల్లో రచ్చ చేయడం వల్ల ఆ పార్టీ చేస్తున్నది ప్రజాపోరాటం కాదని, కేవలం ఒక కుట్రపూరిత తప్పుడు రాజకీయం అని సామాన్య ప్రజలకు సైతం అర్థమైపోయింది.అన్నింటికంటే ముఖ్యంగా, ఈ ఉనికి లేని వివాదం వల్ల వైఎస్సార్సీపీ సమాజంలో తీవ్ర ప్రతికూలతను మూటగట్టుకుంటోంది. మెగా డీఎస్సీ ద్వారా ఎంపికైన దాదాపు 16,347 మంది ఉపాధ్యాయులు, వారి వెనుకున్న వేలాది కుటుంబాలు ఇప్పుడు ప్రతిపక్ష వైఖరిపై తీవ్ర ఆగ్రహంతో రగిలిపోతున్నాయి. దశాబ్దాల కష్టంతో, పారదర్శకమైన పోటీలో తమ ప్రతిభతో ఉద్యోగాలు సాధిస్తే, తమ అర్హతలను, ఆత్మగౌరవాన్ని పదేపదే శంకిస్తూ పొలిటికల్ మైలేజ్ కోసం వాడుకోవడాన్ని ఆ ఉపాధ్యాయ లోకం సహించలేకపోతోంది. రాయలసీమ నుంచి మొదలై కోస్తాంధ్ర వరకు ఈ ఉద్యోగ విజేతలు ఉపాధ్యాయ ఆత్మగౌరవ ర్యాలీలు నిర్వహిస్తూ ప్రతిపక్ష వైఖరిని ఎండగడుతున్నారు.ప్రజాబలం తోడుకాకపోగా, యువత నుంచి మద్దతు లభించకపోగా, పైగా ఎంపికైన 16 వేలకు పైగా కుటుంబాల నుంచి తీవ్ర వ్యతిరేకత మూటగట్టుకోవడం రాజకీయంగా ఎంత పెద్ద వ్యూహాత్మక తప్పిదమో స్పష్టమవుతోంది. రాలగొట్టుకోవడానికి ఏ రాయి అయితే ఏమిటి అన్నట్లుగా ఆలోచన లేకుండా ఒక ప్రతికూల అంశాన్ని పదేపదే పట్టుకుని వేలాడటం వల్ల వైసీపీకి లభించే రాజకీయ లబ్ధి సున్నా సరేకదా, ఉన్న అరకొర క్రెడిబిలిటీని కూడా నట్టేట ముంచేస్తోంది. ప్రజామోదం లేని ఇటువంటి వ్యర్థ పోరాటాల వల్ల ప్రభుత్వంపై ఎలాంటి ఒత్తిడి పడకపోగా, ప్రతిపక్షం తన సొంత ఓటు బ్యాంకునే మరింత దూర చేసుకుంటోందనేది అసలు నిజం

## సునీత ఒంటరి పోరాటం...

**కడప, ఆగస్టు 11 పెన్ పవర్:** మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి దారుణ హత్య కేసులో ఆయన కుమార్తె డాక్టర్ వైఎస్ సునీతారెడ్డి ఎన్నో ఏళ్లుగా వేస్తున్న అత్యంత ప్రాథమిక, కీలకమైన ప్రశ్న ఇదే. ఈ విషయం సీబీఐ అఫిడవిట్‌లోనే ఉంది. బయట ప్రపంచానికి, కనీసం ఇంట్లో పనిచేసే సిబ్బందికి కూడా తెలియక ముందే వైఎస్ జగన్ మోహన్ రెడ్డికి హత్య విషయం ఎలా తెలిసింది? ఈ ఒక్క ప్రశ్నకు చట్టబద్ధంగా విచారణ సంస్థలు సమాధానం కనుగొంటే, హత్య వెనుక ఉన్న అసలు సూత్రధారులు, పాత్రధారులు బయటపడతారని సునీత బలంగా నమ్ముతున్నారు. తెలంగాణ హైకోర్టులో సీబీఐ దాఖలు చేసిన అదనపు అఫిడవిట్‌లో సైతం మార్చి 15, 2019 ఉదయం 6:15 గంటలకు వివేకా పీఏ కృష్ణారెడ్డి ద్వారా వార్త బయటకు రావడానికి ముందే జగన్‌కు ఈ విషయం తెలుసని పేర్కొనడం ఈ అనుమానాలకు మరింత బలాన్ని చేకూర్చింది.న్యాయస్థానాల్లో ప్రతిపక్ష డిఫెన్స్ లాయర్లు దీనిపై వాదిస్తూ.. కుటుంబ సభ్యులు, బంధువుల మధ్య సమాచారం త్వరగా మార్పిడి కావడం సహజమేనని, దాంట్లో నేరపూరిత కోణం ఏమీ లేదని సరిపెట్టుకునే యత్నం చేశారు. అయితే ఇక్కడే అసలు రాజ్యాంగ, న్యాయపరమైన లోపం స్పష్టమవుతోంది. బంధువులకు సమాచారం అందింది అనే సాధారణ సాకుతో వార్త ఎక్కడి నుంచి వచ్చిందో విచారించకుండా విస్మరించడం సమంజసం కాదనేదిసునీత వాదన. హత్య జరిగిన అర్ధరాత్రి దాటిన సమయం నుంచి ఉదయం వరకు కడప ఎంపీ అవినాష్ రెడ్డి ఫోన్ నుంచి నడిచిన వాట్సాప్, వాయిస్ కాల్స్ ఐపీడీఆర్ డేటాను సీబీఐ అఫిడవిట్‌లోప్రస్తావించినప్పటికీ, ఆ సమాచారం కనెక్షన్ చివరగా ఎక్కడ ముగిసిందో పూర్తి స్థాయిలో మనీ-పవర్ ట్రయల్‌తో ముడిపెట్టి తేల్చకపోవడమే అసలు వివాదం.న్యాయం కోసం సునీత పడుతున్న తపన, సాగిస్తున్న పోరాటం సాధారణమైంది కాదు. కింది కోర్టుల నుంచి సుప్రీంకోర్టు వరకు, ఏపీ నుంచి విచారణను తెలంగాణకు బదిలీ చేయించడం వరకు ఆమె అలుపెరగకుండా పోరాడుతున్నారు. హత్య వెనుక ఎవరున్నారనేది ప్రజలందరికీ ఒక అంచనా ఉన్నప్పటికీ.. దానిని చట్టబద్ధమైన సాక్ష్యాధారాలతో కోర్టు ముందు రుజువు చేసి, నిందితులకు శిక్ష పడేలా చేయడమే ఆమె అంతిమ లక్ష్యం. ఏడేళ్లు గడిచినా ఒక మాజీ ఎంపీ కుమార్తె న్యాయం కోసం వ్యవస్థల చుట్టూ తిరగాల్సి రావడం భారతీయ నేర విచారణ వ్యవస్థ లోని మందగమనానికి అద్దం పడుతోంది.ఈ తరుణంలోనే సునీత నేరుగా భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు లేఖ రాసి, కేసులోని పెద్ద కుట్ర కోణాన్ని, ముందస్తు సమాచారం ఎవరికి ఎలా చేరిందనే అంశాన్ని త్వరితగతిన తేల్చాలని విజ్ఞప్తి చేశారు. రాజ్యాంగబద్ధ అత్యున్నత పీఠం జోక్యం చేసుకుని సీబీఐ దర్యాప్తునకు స్పష్టమైన కాలపరిమితిని, దిశానిర్దేశాన్ని ఇస్తే తప్ప ఈ కేసు ముడిపడేలా లేదు. ఒక కుటుంబం తమ ఆత్మీయుడిని కోల్పోయి, వ్యవస్థలు సహకరిస్తాయో లేదోనన్న ఆందోళనతో సాగిస్తున్న ఈ ఆత్మగౌరవ పోరాటానికి చట్టం నిజమైన న్యాయం చేస్తుందా లేదా అనేది కాలమే నిర్ణయించాలి.

# వైసీపీ ప్రోగ్రాం సక్సెస్...కానీ వాళ్ళు రాలేదు !



**హైదరాబాద్ పెన్ పవర్:** వైసీపీ గత రెండేళ్ళలో ఎన్నడూ లేని విధంగా జనం బాట పట్టింది. ఆందోళనలకు పిలుపు ఇచ్చింది. నిరసనలు పెద్ద ఎత్తున నిర్వహిస్తోంది. ఒక విధంగా చెప్పాలీ అంటే వైసీపీ ఒక ఇష్యూని పట్టుకుని ఇంత సుదీర్ఘంగా ఆందోళన చేసిన దాఖలాలు అయితే గతంలో లేవు. కానీ మెగా డీఎస్సీ విషయంలో వైసీపీ దూకుడు చేస్తోంది. అక్రమాలు జరిగాయని అంటూ ఏకంగా టీడీపీ కూటమిలో అతి ముఖ్య నాయకుడు, విద్యా శాఖ మంత్రి అయిన నారా లోకేష్ మీద ఫుల్ ఫోకస్ పెట్టేసింది. ఒక విధంగా చెప్పాలీ అంటే గట్టిగానే టార్గెట్ చేసింది. దాంతో ఏపీలో పది రోజులుగా వైసీపీ నిరసన కార్యక్రమాలు సాగుతున్నాయి. ఈ నేపథ్యంలో వాటి ప్రభావం ఎలా ఉంది, జనాల నుంచి రెస్పాన్స్ ఎలా ఉంది అన్నది కనుక చూస్తే వైసీపీ ప్రోగ్రాం సక్సెస్ అని అంటున్నారు. కానీ అని అక్కడే ఆగిపోతున్నారు.

**వైసీపీకి ఇదే ఫస్ట్ టైం :**

ఇక వైసీపీ 2024 తరువాత ఘోరంగా ఓటమి చెంది 11 సీట్లకే పరిమితం అయిన తరువాత గడచిన రెండేళ్ళ కాలంలో చేపట్టిన అనేక ఆందోళనలు నిరసనలతో పోలిస్తే మెగా డీఎస్సీ మీద ఆ పార్టీ చేపట్టిన పోరాటం మాత్రం హైలెట్ అని చెప్పాల్సి ఉంటుంది. రాష్ట్ర వ్యాప్తంగా జరిగిన ఈ ప్రోగ్రాం బాగానే సాగింది. ఒక్క ప్రకాశం జిల్లాలో తప్పించి అన్ని చోట్ల సక్సెస్ అయింది అని అంటున్నారు. మరి ఇంతలా అన్ని చోట్ల వైసీపీ ప్రోగ్రాం సక్సెస్ అయితే ఒక్క ఆ జిల్లాలోనే ఎందుకు అలా అన్నదే ఇపుడు చర్చగా ఉంది.

**ప్రకాశంలో ఎందుకంటే :**

ప్రకాశం జిల్లాలో ఇంచార్జిలు క్యాడర్ ని పెద్ద ఎత్తున తీసుకుని రాలేకపోయారు. ఈ జిల్లాలో క్యాడర్ అయితే అంత దూకుడుగా లేదా అన్నది చర్చగా ఉంది. అలాగే ఇంచార్జిలే తమ జోరుని చూపించలేకపోయారా అన్న ప్రశ్నలు కూడా వస్తున్నాయి. ఇంకో వైపు చూస్తే వైసీపీ రాష్ట్రవ్యాప్త ఆందోళనలకు జనాలు అన్ని చోట్ల పోటెత్తారు. అలాగే చాలా కాలం తరువాత వైసీపీ క్యాడర్ లో ఉత్సాహం కనిపించింది. అలాగే వైసీపీ నాయకులు కూడా అంతా కలసి హుషార్ గా పాల్గొనడం కూడా జరిగింది. అదే సమయంలో మెగా డీఎస్సీలో అక్రమాలు జరిగాయని చెబుతున్న అభ్యర్థులు కానీ నిరుద్యోగులు కానీ యువత కానీ ఈ మొత్తం ఆందోళనలో ఎక్కడా కనిపించకపోవడమే ఒక లోటుగా చెబుతున్నారు.

**అదే కారణమా అంటూ :**

మరి వారు ఎందుకు పాల్గొనలేదు అంటే దానికి రీజనబుల్ గా వచ్చే సమాధానం కూడా ఉంది. తాము వచ్చి వైసీపీ చేసే ఆందోళనలలో

పాలుపంచుకుంటే కెమెరాలకు చిక్కితే తమ భవిష్యత్తు ఎక్కడ ఇబ్బంది పడుతుందో అన్న ఆలోచనతోనే వారు వెనక్కి ఉండిపోయారు అని అంటున్నారు. ఒక రాజకీయ పార్టీ చేపట్టే ఆందోళనలో పాలు పంచుకుంటే తమకు మళ్ళీ జాబ్స్ రావు అన్న బెంగ కూడా వారికి ఉండడం వల్లనే ఎక్కడా కనిపించకుండా తెర వెనక్కే ఉండిపోయారు అని అంటున్నారు. అయితే ఎవరి కోసం ఈ కార్యక్రమం వైసీపీ చేసిందో వారు కానీ యువత కానీ కనిపించకపోవడం మాత్రం ఆ పార్టీకి మైనస్ గానే మారింది అని అంటున్నారు. దీంతో వైసీపీ నిరసనలకు జనాల నుంచి మంచి స్పందన వచ్చినా కూడా అసలైన వారు డీఎస్సీ రాసిన అభ్యర్ధులు ఎక్కడా కనిపించకపోవడంతో ఆపరేషన్ సక్సెస్ పేషెంట్ డైడ్ అన్నట్లుగా వైసీపీ ప్రోగ్రాం తయారైంది అని అంటున్నారు. ఏది ఏమైనా వైసీపీ వరకూ చూస్తే మాత్రం ఈ నిరసనలు హిట్ అయి మంచి బూస్ట్ ఇచ్చాయనే అంటున్నారు.

# సీడ్ యాక్సిస్ రోడ్ రెడీ...

**అమరావతి, ఆగస్టు 11 పెన్ పవర్:**

ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి నిర్మాణ ప్రక్రియలో ఒక చారిత్రాత్మక ఘట్టానికి ముహూర్తం ఖరారైంది. రాజధాని నగరానికి లైఫ్‌లైన్‌గా చెప్పుకుంటున్న సీడ్ యాక్సిస్ రోడ్డులోని అత్యంత కీలకమైన భాగం ఆగస్టు 13 నుంచి ప్రజలకు అందుబాటులోకి రాబోతోంది. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రతిష్టాత్మక రహదారితోపాటు, ప్రజాప్రతినిధుల కోసం నిర్మించిన ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ టవర్లను కూడా అదే రోజున అధికారికంగా ప్రారంభించనున్నారు. ఈ ప్రారంభోత్సవానికి ఒక రోజు ముందు అంటే 12 ఆగస్టు ముఖ్యమంత్రి కాన్వాయ్‌తో ఈ రహదారిపై అధికారికంగా ట్రయల్ రన్ నిర్వహించేందుకు ఆంధ్రప్రదేశ్ రాజధాని ప్రాంత అభివృద్ధి సంస్థ అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. అమరావతి మాస్టర్ ప్లాన్‌లో అత్యంత కీలకమైన ఈ రహదారిని టెక్నికల్‌గా ఈ-3 రోడ్డుఅని పిలుస్తారు. ఇది రాజధాని నగరంలోని ఉత్తరం నుంచి దక్షిణానికి ఉండే 17 ప్రధాన ఎన్ సిరీస్ రోడ్లను ఒకదానితో ఒకటి కలిపే మార్గం. ఈ సీడ్ యాక్సిస్ రోడ్డు మొత్తం పొడవు 21.78కిలోమీటర్లు. ఇది దొండపాడు గ్రామం వద్ద ప్రారంభమై రాయపూడి, వెంకటపాలెం, పెనుమాక, ఉండవల్లి, తాడేపల్లి గ్రామాల మీదుగా సాగి మణిపాల్ ఆసుపత్రి వద్ద జాతీయ రహదారితో కలుస్తుంది. ఈ రోడ్డుకు సంబంధించి రైట్ ఆఫ్ వే 60 మీటర్లుగా నిర్ణయించారు. భవిష్యత్‌లో దీనిని 8 నుంచి 9 లేన్‌ల వరకు విస్తరించేలా ప్రభుత్వం ప్లాన్ చేసింది. ప్రస్తుతం 11 మీటర్ల వెడల్పుతో కూడిన క్యారేజ్ వేస్, సర్వీస్ రోడ్లు, సెంట్రల్ బీఆర్‌టీఎస్ కారిడార్‌తో నిర్మించారు.

**మూడు దశల్లో అభివృద్ధి**

ఈ భారీ ప్రాజెక్టును అధికారులు మూడు దశలుగా విభజించారు. ఫేజ్-1 పొడవు 14. 35 కిలోమీటర్లు. ఇది దొండపాడు నుంచి వెంకటపాలెం (మంతెన ఆశ్రమం) వరకు ఉంటుంది. ఇది ఇప్పటికే పూర్తి అయ్యి రాకపోకలు సాగుతున్నాయి. రెండోది 3.92 కిలోమీటర్ల పొడవు ఉన్న ఫేజ్ -2. వెంకటపాలెం నుంచి ఉండవల్లి వరకు సాగుతుంది. ఈ భాగమే ఆగస్టు 13న ప్రారంభమవుతుంది. భూసేకరణ సమస్యలు, కోర్టు వ్యాజ్యాలను అధిగమించి ప్రభుత్వం ఈ పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేసింది. 3.50 కిలోమీటర్ల పొడవు ఉన్న ఫేజ్ -3 ఉండవల్లి నుంచి మణిపాల్ ఆసుపత్రి వరకు నిర్మిస్తున్నారు. ఇందులో ఒక భారీ ఎలివేటెడ్ కారిడార్ 320 మీటర్ల ఐకానిక్ కేబుల్ బ్రిడ్జిని నిర్మించాలని ప్రతిపాదించారు. ఈ రహదారిలో ప్రధాన ఆకర్షణగా నిలుస్తున్నవి ఉండవల్లి వద్ద నిర్మించిన భారీ స్టీల్ బ్రిడ్జ్‌లు. 110 మీటర్ల పొడవుతో బకింగ్‌హమ్ కెనాల్‌పై స్టీల్ బ్రిడ్జి నిర్మించారు. దానిపై తారు పనులు పూర్తి చేశారు. రాజధానికి వరద ముప్పు లేకుండా చేసే కొండవీటి వాగుపై 284మీటర్‌ల పొడవుతో అధునాతన స్టీల్ బ్రిడ్జిని ఏర్పాటు చేశారు. ఈ ప్రాంతాన్ని కేవలం ఒక రహదారిగానే కాకుండా, ఒక పర్యాటక కేంద్రంగా మార్చాలని ప్రభుత్వం నిర్ణయించింది. కృష్ణానది, కొండవీటి వాగు అందాలను చూసేందుకు ఇక్కడ ప్రత్యేక వ్యూ పాయింట్లను ఏర్పాటు చేస్తున్నారు. పర్యావరణహితంగా ఉండేందుకు సైక్లింగ్ ట్రాక్‌లు, వాకింగ్ ట్రాక్‌లు, సుందరమైన ల్యాండ్‌స్కేప్ గార్డెన్లను అభివృద్ధి చేస్తున్నారు. విజయవాడ నుంచి అమరావతి సచివాలయానికి హైకోర్టుకు వెళ్లే వేల మంది ఇరుకైన కరకట్ట రహదారిపై ఆధారపడేవారు. ట్రాఫిక్ జామ్‌లు, ప్రమాదకరమైన మలుపులు, గుంతల రోడ్డులతో ప్రయాణం నరకప్రాయంగా ఉండేది. ఈ సీడ్ యాక్సిస్ రోడ్డు అందుబాటులోకి రావడంతో విజయవాడ నుంచి అమరావతికి వెళ్లేందుకు సమయం ఆదా అవుతుంది. దాదాపు అర గంట కలిసి వస్తుంది. నాలుగు లేన్ల రహదారి కావడంతో ప్రమాదాల భయం లేదు. ఈ కారిడార్ వెంబడి ఉన్న ఉండవల్లి, పెనుమాక, మందడం ప్రాంతాల్లో భూముల రేట్లు పెరగనున్నాయి. ఐటీ కంపెనీలు, హోటల్స్ రానున్నాయి. ముఖ్యమంత్రి పర్యటన కోసం అమరావతి అభివృద్ధి సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ లక్ష్మీపార్థసారథి, గుంటూరు కలెక్టర్ సాయికాంత్ వర్మ, ఎస్పీ వకుల్ జిందాల్ ఉండవల్లి స్టీల్ బ్రిడ్జి ప్రాంతాన్ని సందర్శించి ఏర్పాట్లు సమీక్షించారు. ఏర్పాట్లను పర్యవేక్షించారు. అమరావతిని ప్రపంచ స్థాయి నగరంగా తీర్చిదిద్దాలనే సంకల్పంతో చేపట్టిన సీడ్ యాక్సిస్ రోడ్డు ప్రాజెక్టు కోసం మొత్తం 320. 54 ఎకరాల భూమి అవసరమని గుర్తించారు. ఇందులో ఇప్పటికే 278.93 ఎకరాలను సేకరించారు. మిగిలిన భూసేకరణ ప్రక్రియ తుది దశలో ఉంది. ఈ రహదారి కేవలం రవాణా కోసమే కాకుండా రాజధాని నగరంలో గ్యాస్ పైప్‌లైన్లు, వాటర్ మెయిన్స్, ఐసీటీ కారిడార్లు వంటి భూగర్భ వసతుల ఏర్పాటుకు ఉపయోగపడనుంది.

# నిందితులకే మద్దతా... నిన్న అప్పలరాజు... ఇవాళ పాస్టర్ కోడుకు

**రాజమండ్రి, ఆగస్టు 11 పెన్ పవర్:** రాజమండ్రిలో డాక్టర్ ప్రియాంకపై కారు ఎక్కించి దారుణంగా హత్య చేసిన ఉదంతం రాజకీయంగా, సామాజికంగా తీవ్ర ప్రకంపనలు సృష్టిస్తోంది. ఈ కేసులో ప్రధాన నిందితుల్లో ఒకరైన ఆండ్రూ జోసెఫ్ ఎడ్వర్డ్స్ ప్రసిద్ధ పాస్టర్ కుమారుడు కావడంతో, ఈ వ్యవహారం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకత్వానికి, ముఖ్యంగా వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి తీవ్రమైన సంకట పరిస్థితిని తెచ్చిపెట్టింది. ఒకవైపు నిందితుడు తమకు అత్యంత కీలకమైన ఓటు బ్యాంక్ వర్గానికి చెందిన కుటుంబ నేపథ్యం కలవాడు కావడం, మరొకవైపు అత్యంత కిరాతకానికి గురైన బాధితురాలు వైద్య విద్యార్థిని కావడం వల్ల.. ఈ కేసులో ఎటువైపు నిలబడాలో తెలియక వైసీపీ రాజకీయ డైలమాలో పడింది. ఈ విమర్శలు రావడంతో చివరికి జగన్ ప్రభుత్వాన్ని నిందిస్తూ ఓ ట్వీట్ చేసి పడేశారు.ఇటీవల కాశిబుగ్గ సమీపంలో మాజీ మంత్రి, వైసీపీ నేత సీదిరి అప్పలరాజు కుమారుడు ఆరవ్ వర్మ జరిపిన హిట్ అండ్ రన్ కేసులో ఒక పేద గొర్రెల కాపరి దానయ్య ప్రాణాలు కోల్పోతే, వైసీపీ అనుసరించిన వైఖరి పైనే ఇప్పుడు ప్రధాన చర్చ జరుగుతోంది. ఆ కేసులో సొంత పార్టీ నేత కుమారుడిని రక్షించేందుకు వేరొక అనామకుడిపై నింద మోపే ప్రయత్నం చేశారు. దానయ్యను కాపాడే ప్రయత్నం చేయలేదు. దానయ్య కుటుంబాన్ని ఆదుకోలేదు. తప్పుడు కుట్రలు చేసినందుకు సీదిరి అప్పలరాజుపై కేసు నమోదు చేస్తే దాన్ని రాజకీయ కక్ష సాధింపు గా జగన్ రెడ్డి వర్గీకరించడం తీవ్ర విమర్శలకు దారితీసింది. బాధితుడైన గొర్రెల కాపరి కుటుంబం ఆవేదనను పక్కనపెట్టి, కేవలం తమ పార్టీ నేత, కుల సమీకరణాలకే జగన్ ప్రాధాన్యత ఇచ్చారు. మత్స్యకార నాయకుడ్ని వేధిస్తున్నట్లుగా ప్రచారం చేశారు.ఇదే ప్రాతిపదికన విశ్లేషిస్తే, ఇప్పుడు రాజమండ్రి కేసులో కూడా వైసీపీ అదే తరహా సొంత వర్గ రక్షణ వ్యూహాన్ని అమలు చేస్తుందా అనే ప్రశ్నలు లేవనెత్తుతున్నాయి. జోసెఫ్ ఎడ్వర్డ్స్ కుటుంబం సామాజికంగా, మతపరంగా వైసీపీకి సాంప్రదాయకంగా మద్దతు ఇచ్చే వర్గానికి ప్రాతినిధ్యం వహిస్తోంది. ఇప్పుడు గనుక రాజమండ్రి కేసులో నిందితులకు కఠిన శిక్ష పడాలని, వారిపై ఉద్దేశపూర్వక హత్య సెక్షన్లు సమర్థనీయమేనని వైసీపీ డిమాండ్ చేస్తోంది పైపైకే. ఎందుకంటే ప్రజాగ్రహం ఎక్కువగా ఉంది కాబట్టి ఇలా ప్రియాంక కోసం మాట్లాడుతున్నారు. మరి కాశిబుగ్గ కేసులో అప్పలరాజు కొడుకుపై చట్టం చర్యలు తీసుకున్నప్పుడు ఎందుకు వ్యతిరేకించారు? అక్కడ లేని న్యాయసూత్రాలు ఇక్కడ మాత్రమే గుర్తుకొచ్చాయా?అంతేకాకుండా, ప్రియాంక తండ్రి కడుపుకోతతో మాట్లాడుతున్న మాటలను సైతం రాజకీయంగా

వక్రీకరిస్తున్నారు. చట్టం ముందు అందరూ సమానులే అయినప్పుడు, ఒక నిందితుడు తమ పార్టీ నేత కొడుకైనా, లేక ఓటు బ్యాంకుకు చెందిన ప్రముఖుడి కొడుకైనా శిక్ష ఒకేలా ఉండాలన్న కనీస ధర్మాన్ని వైసీపీ విస్మరిస్తోంది. బాధితురాలైన డాక్టర్ ప్రియాంక కుటుంబానికి న్యాయం జరగాలనే డిమాండ్ ఏపీవ్యాప్తంగా మిన్నంటుతున్న వేళ, వైసీపీ ద్వంద్వ వైఖరి ఆ పార్టీ విశ్వసనీయతను మరింత దిగజారుస్తోంది. సీదిరి అప్పలరాజు కేసులో బాధితుడికి ఒక న్యాయం, రాజమండ్రి కేసులో మరో న్యాయం అన్నట్లుగా రాజకీయాలు చేస్తున్నారు

# శ్రీలంకకు షాకిచ్చేందుకు గిల్-గంభీర్ మాస్టర్‌ప్లాన్.. ప్రాక్టీస్‌లోనే ప్రణాళికలు అమలు!

- శ్రీలంక పేసర్ల రివర్స్ స్వింగ్‌పై భారత్ ప్రత్యేక ఫోకస్
- ప్రాక్టీస్ పిచ్‌ను నాలుగో రోజు వికెట్‌లా సిద్ధం చేసిన వైనం
- గిల్ పాత, కొత్త బంతులతో రివర్స్ స్వింగ్ సాధన
- శ్రీలంక మైదానాల్లో బంతి త్వరగా పాతబడే అవకాశం
- ఇప్పటికే మూడు రోజుల వార్మప్ మ్యాచ్ ఆడిన భారత్




**హైదరాబాద్ పెన్ పవర్:** శ్రీలంకతో టెస్టు సిరీస్‌కు సిద్ధమవుతున్న భారత జట్టు.. స్పిన్‌తో పాటు పేసర్ల నుంచి ఎదురయ్యే ముప్పుపైనా ప్రత్యేక దృష్టి పెట్టింది. ఆగస్టు 15 నుంచి రెండు టెస్టుల సిరీస్ ప్రారంభం కానున్న నేపథ్యంలో కెప్టెన్ శుభ్‌మన్ గిల్, కోచ్ గౌతమ్ గంభీర్ నేతృత్వంలోని టీమ్ మేనేజ్‌మెంట్ కీలక నిర్ణయం తీసుకుంది. మ్యాచ్‌లో ఎదురయ్యే పరిస్థితులకు తగ్గట్టుగా ప్రాక్టీస్ చేయాలని భావించింది.ఎన్‌సీసీ మైదానంలో ప్రాక్టీస్ కోసం ఉపయోగించిన పిచ్‌ను.. శ్రీలంక 'ఎలెవన్'తో జరిగిన వార్మప్ మ్యాచ్ పిచ్ తరహాలో సిద్ధం చేయాలని గ్రౌండ్ సిబ్బందికి సూచించింది. పిచ్‌పై పగుళ్లు వచ్చేలా చేసి.. నాలుగో రోజు వికెట్‌ను పోలిన పరిస్థితులు కల్పించారు. బంతి రివర్స్ స్వింగ్ అయ్యే అవకాశాలను దృష్టిలో పెట్టుకుని భారత బ్యాటర్లు ఫుట్‌వర్క్‌పై ప్రత్యేకంగా సాధన చేశారు.

నెట్ సెషన్‌లో గిల్ ముగ్గురు త్రో-డౌన్ నిపుణుల నుంచి బంతులు ఎదుర్కొన్నాడు. పాత, కొత్త కూకాబుర్రా బంతులతో రివర్స్ స్వింగ్‌ను ఎదుర్కొనేలా సాధన చేశాడు. అనంతరం అకీబ్ నబీ నుంచి సెమీ-ఓల్డ్ బంతులతో బౌలింగ్ చేయించుకుని మరింత ప్రాక్టీస్ చేశాడు.గాలె పిచ్ సాధారణంగా స్పిన్నర్లకు అనుకూలంగా ఉంటుందని భావిస్తున్నారు. అయితే శ్రీలంక మైదానాల్లో బంతి త్వరగా పాతబడుతుందని..

దీంతో రివర్స్ స్వింగ్ కీలకంగా మారొచ్చని టీమ్ మేనేజ్‌మెంట్ అంచనా వేసింది.భారత్ ఇప్పటికే శ్రీలంక 'ఎలెవన్'పై మూడు రోజుల వార్మప్ మ్యాచ్ ఆడింది. శ్రీలంక మాత్రం ఎలాంటి ప్రాక్టీస్ మ్యాచ్ ఆడకుండానే సిరీస్‌లోకి దిగుతోందని మాజీ పేసర్ ఫర్వీజ్ మహరూఫ్ తెలిపారు. భారత బ్యాటింగ్‌పై సందేహాలు ఉన్నా.. సిరీస్‌కు ఆతిథ్య జట్టు కంటే భారత్ మెరుగ్గా సిద్ధమైందని ఆయన అభిప్రాయపడ్డారు.

# చోలే భటూరే నుంచి ఫిట్‌నెస్ ఐకాన్‌గా.. కోహ్లీ బాడీ ట్రాన్స్‌ఫర్మేషన్ సీక్రెట్ ఇదే!




**హైదరాబాద్ పెన్ పవర్:** భారత స్టార్ క్రికెటర్ విరాట్ కోహ్లీ కేవలం ఆటలోనే కాకుండా ప్రపంచంలోనే అత్యంత ఫిట్‌గా ఉన్న అథ్లెట్లలో ఒకడిగా సరికొత్త ప్రమాణాలు నెలకొల్పాడు. ఒకప్పుడు చోలే భటూరే, బటర్ చికెన్, స్వీట్లను ఇష్టంగా తినే బొద్దుగా ఉండే కుర్రాడి నుంచి ప్రపంచం మెచ్చే ఫిట్‌నెస్ ఐకాన్‌గా మారిన కోహ్లీ ట్రాన్స్‌ఫార్మేషన్ ప్రయాణం, అతడు పాటించే డైట్, వర్కౌట్ సీక్రెట్స్ ఏంటి అనేది ఇప్పుడు వీ6 తెలుగు వెబ్ సైట్ లో తెలుసుకుందాం.

**టర్నింగ్ పాయింట్ ఇక్కడే:**

తొలి ప్రపంచకప్ ముగిసిన తర్వాత తాను విపరీతమైన అన్‌ఫిట్‌గా ఉన్నానని, పొట్ట వేలాడుతుంటే అంతర్జాతీయ స్థాయిలో రాణించలేనని విరాట్ కోహ్లీ గ్రహించాడు. దాంతో ప్రాసెస్ చేసిన ఆహారానికి, జంక్ ఫుడ్‌కు స్వస్తి చెప్పి పూర్తి క్లీన్ వెజిటేరియన్ డైట్‌కు మారాడు. తాను ఇప్పటికి గతంలో ఆడినట్లే ఆడాలనే స్పష్టమైన లక్ష్యంతోనే కఠోరంగా శ్రమిస్తూ తన ఫిట్‌నెస్ ని కాపాడుకుంటున్నాడు.

**రోజూ కోహ్లీ ఏం తింటాడు?:**

కోహ్లీ తన డైట్‌లో ప్రోటీన్లు, ఆకుకూరలు, యాంటీ ఆక్సిడెంట్లు పుష్కలంగా ఉండేలా జాగ్రత్తపడతాడు.

ఉదయం తినే ఆహారం: గ్లూటెన్ ఫ్రీ బ్రెడ్ , నట్స్, సీడ్స్, హెల్తీ వెజిటెబుల్ డిషెస్.

రాత్రి భోజనం: కండరాల బలానికి క్వినోవా , దోసెలు, పప్పు ధాన్యాలు, పాలకూర, సోయా, ప్రోటీన్ షేక్స్ తీసుకుంటాడు.

డిటాక్స్ సీక్రెట్: మెటబాలిజాన్ని పెంచడానికి, శరీరంలోని టాక్సిన్లను బయటకు పంపడానికి నిమ్మరసంతో కలిపిన గ్రీన్‌టీని రోజుకు 3 నుంచి 4 కప్పులు తాగుతాడు. ఆహారంలో పంచదారను పూర్తిగా దూరం పెడతాడు.

**జిమ్ షెడ్యూల్, వర్కౌట్ ప్లాన్:**

**వారంలో 5,6 రోజులు జిమ్‌లో తీవ్రంగా శ్రమిస్తూ, ఒక్క రోజు మాత్రమే రెస్ట్ తీసుకుంటాడు విరాట్ కోహ్లీ.**

వెయిట్ ట్రైనింగ్, డెడ్‌లిఫ్ట్స్: శరీరంలో బలమైన కండరాలు (గాముఅ వీబంఎశ్రీవ), స్టామినా పెంచడానికి భారీ డెడ్‌లిఫ్ట్స్ చేస్తాడు.

కార్డియో: లోయర్ బాడీ స్ట్రెంగ్త్, మైదానంలో వేగంగా పరుగెత్తే సామర్థ్యం కోసం హెవీ కార్డియో వ్యాయామాలు చేస్తాడు.

# ఆగస్టు 14 నుంచి టీ 20 వరల్డ్ కప్ క్వాలిఫయర్ మ్యాచ్‌లు.. ఈ చిన్న దేశాల మధ్యనే గట్టి పోటీ




**హైదరాబాద్ పెన్ పవర్:** ఆస్ట్రేలియా, న్యూజిలాండ్‌లు సంయుక్తంగా ఆతిథ్యం ఇవ్వనున్న 2028 ఐసీసీ పురుషుల టీ20 ప్రపంచకప్ కోసం ఐసీసీ సంచలన మార్పులు చేసింది. టోర్నమెంట్‌లో ఉత్కంఠను పెంచేందుకు, వర్ధమాన (గాంంశీఎఖ్వ) దేశాలకు ప్రపంచ వేదికపై మరిన్ని అవకాశాలు కల్పించేలా సరికొత్త ఫార్మాట్‌ను రూపొందించింది. 20 జట్లు పాల్గొనే ఈ మెగా ఈవెంట్‌లో సూపర్ 10, ఎలిమినేటర్స్ రౌండ్లను కొత్తగా ప్రవేశ పెట్టింది.

**సరికొత్త ఫార్మాట్:**

పాత ఫార్మాట్ స్థానంలో మ్యాచ్ మ్యాచ్‌కూ తీవ్ర పోటీ ఉండేలా ఈ కొత్త విభాగాలు తీసుకువచ్చారు.

గ్రూప్ దశ (30 మ్యాచ్‌లు): 20 జట్లను నాలుగు జట్ల చొప్పున 5 గ్రూపులుగా విభజిస్తారు. ప్రతి గ్రూప్ నుంచి టాప్-2 సాధించిన జట్లు సూపర్ 10కి చేరుకుంటాయి.

సూపర్ 10 (20 మ్యాచ్‌లు): 10 జట్లను 5 చొప్పున రెండు గ్రూపులుగా విభజించి రౌండ్-రాబిన్ పద్ధతిలో మ్యాచ్‌లు నిర్వహిస్తారు. రెండు గ్రూపుల విజేతలు నేరుగా సెమీఫైనల్స్‌కు అర్హత సాధిస్తారు.

ఎలిమినేటర్స్ (2 మ్యాచ్‌లు): సూపర్ 10లో ప్రతి గ్రూప్‌లోని 2వ స్థానంలో నిలిచిన జట్లు, మరో గ్రూప్‌లోని 3వ స్థానంలో ఉన్న జట్లతో తలపడతాయి. ఇందులో విజేతలుగా నిలిచే రెండు జట్లు మిగిలిన రెండు సెమీఫైనల్ బెర్త్‌లను ఖరారు చేసుకుంటాయి.

**2028 టోర్నీకి నేరుగా అర్హత సాధించిన 12 జట్లు:**

2026 టీ20 ప్రపంచకప్ ప్రదర్శన, ఐసీసీ ర్యాంకింగ్స్ ఆధారంగా 12 జట్లు ఇప్పటికే 2028 టోర్నమెంట్‌కు నేరుగా తమ స్థానాలను ఖరారు చేసుకున్నాయి: ఆఫ్ఘనిస్తాన్, ఆస్ట్రేలియా, బంగ్లాదేశ్, ఇంగ్లాండ్, భారత్, ఐర్లాండ్, న్యూజిలాండ్, పాకిస్తాన్, దక్షిణాఫ్రికా, శ్రీలంక, వెస్ట్ ఇండీస్ లేదా జింబాబ్వే.

**క్వాలిఫైయర్స్ షెడ్యూల్ ఇదే:**

టీ20 వరల్డ్ కప్ లో మిగిలిన 8 స్థానాల కోసం అర్హత ప్రక్రియను ఐసీసీ మరింత ఆసక్తికరంగా డిజైన్ చేసింది. దాని గురించి ఇప్పుడు తెలుసుకుందాం..

నేరుగా గ్లోబల్ క్వాలిఫైయర్: 2026లో ఆడి నేరుగా అర్హత పొందని కెనడా, ఇటలీ, నమీబియా, నేపాల్, నెదర్లాండ్స్, ఒమన్, యూఏఈ, యూఎస్ఏ జట్లు నేరుగా గ్లోబల్ క్వాలిఫైయర్ ఆడుతాయి.

రీజినల్ క్వాలిఫికేషన్: ప్రాంతీయ టోర్నీల ద్వారా మరో 8 జట్లు (ఆఫ్రికా-2, ఆసియా-2, యూరప్-2, అమెరికాస్-1, ఈఏపీ-1) గ్లోబల్ క్వాలిఫైయర్‌లో ఎంట్రీ ఇస్తాయి. ఇక స్కాట్లాండ్ నేరుగా యూరప్ రీజినల్ ఫైనల్ ఆడుతుంది.

ఆఫ్రికా - ఉగాండా, కెన్యా, టాంజానియా, నైజీరియా, రువాండా, నమీబియా

ఆసియా - నేపాల్, ఒమన్, యూఏఈ , హాంకాంగ్, మలేషియా, కువైట్, బహ్రెయిన్

యూరప్ - స్కాట్లాండ్, జెర్సీ, డెన్మార్క్, ఇటలీ, జర్మనీ, గ్వెర్న్సీ, పోర్చుగల్

తూర్పు ఆసియా-పసిఫిక్ - పాపువా న్యూ గినియా , జపాన్, వనౌటు, ఫిజి, దక్షిణ కొరియా, ఇండోనేషియా

అమెరికాస్ - కెనడా, యూఎస్ఏ , బెర్ముడా, కేమాన్ ఐలాండ్స్, అర్జెంటీనా



# దర్శకులుగా వచ్చి హీరోలుగా!

దర్శకత్వం అనేది ఎంతో బాధ్యతతో కూడుకున్న సవాలుతో కూడిన ప్రయాణం. కెమెరా వెనుక నిలబడి వందలాది మంది సాంకేతిక నిపుణులను, నటీనటులను సమన్వయం చేస్తూ తెరపై అద్భుతాలను ఆవిష్కరించే దర్శకులకు తెరపై నటించడం అంత సులువైన విషయం కాదు. కానీ కొందరు ప్రతిభావంతులైన దర్శకులు ఈ హద్దులను చెరిపేస్తూ కెమెరా ముందు నటిస్తూ బాక్సాఫీస్ వద్ద అసాధారణ రికార్డు సృష్టిస్తున్నారు. కేవలం అతిథి పాత్రలకే పరిమితం కాకుండా పూర్తి స్థాయి హీరోలుగా మారి తమకంటూ ప్రత్యేకమైన గుర్తింపును సంపాదించుకుంటున్నారు.

ఈ అరుదైన కోవకు చెందిన ట్రెండ్‌లో తమిళ, కన్నడ , తెలుగు పరిశ్రమలలో పలువురు ప్రముఖులు ముందు వరుసలో ఉన్నారు. కెమెరా ముందుకొచ్చి ప్రేక్షకులను మెప్పించడం ప్రతి దర్శకుడికి సాధ్యం కాదు. కానీ సరైన కథ, బలమైన స్క్రిప్ట్ పడితే బాక్సాఫీస్ మోత మోగిపోతుందని నిరూపించారు. తమ సినిమాలకే కాకుండా ఇతర దర్శకుల చిత్రాల్లోనూ హీరోగా నటిస్తూ ఇండస్ట్రీలో కొత్త ఒరవడికి శ్రీకారం చుడుతున్నారు. ఈ కోవలో లోకేష్ కనగరాజ్, ప్రదీప్ రంగనాథన్, రిషబ్ శెట్టి, ఉపేంద్ర, ఎస్.జె. సూర్య వంటి దర్శకులు హీరోలుగా సత్తా చాటుతున్నారు.

కోలీవుడ్‌లో తనదైన టెర్రిఫిక్ మేకింగ్ స్టైల్‌తో స్టార్ డైరెక్టర్‌గా ఎదిగిన లోకేష్ కనగరాజ్ తాజాగా డీసీ తో నటుడిగానూ అదృష్టాన్ని పరీక్షించుకుని సంచలనం సృష్టిస్తున్నారు. ఎలాంటి అంచనాలు లేకుండా విభిన్నమైన ఇంటెన్స్ పాత్రలో కనిపిస్తూ అద్భుతమైన నటనతో సినిమాను బ్లాక్‌బస్టర్ వైపు నడిపిస్తున్నారు. ఈ రేంజ్ పెర్ఫార్మెన్స్ చూస్తుంటే లోకేష్ కేవలం డైరెక్టర్‌గానే కాకుండా నటుడిగానూ ఇండస్ట్రీలో సుస్థిరమైన స్థానాన్ని ఏర్పరచుకోవడం ఖాయంగా కనిపిస్తోంది.

మరో యంగ్ అండ్ టాలెంటెడ్ డైరెక్టర్ ప్రదీప్ రంగనాథన్ -లవ్ టుడే- సినిమాతో దర్శకుడిగా విజయం సాధించి, ఏకంగా హీరోగా మారి బాక్సాఫీస్ వద్ద రఫ్ ఆడిస్తున్నారు. ఆ తర్వాత వరుసగా -డ్రాగన్-, -డ్యూడ్- వంటి క్రేజీ ప్రాజెక్టులతో యూత్‌లో విపరీతమైన ఫాలోయింగ్ సంపాదించుకుని పాన్-ఇండియన్ స్టార్ రేంజ్‌కు ఎదుగుతున్నారు. మరోవైపు కన్నడ చిత్రసీమ నుంచి గ్లోబల్ పాన్-ఇండియన్ స్టార్‌గా ఎదిగిన రిషబ్ శెట్టి కూడా ముందుగా దర్శకుడిగానే ప్రయాణాన్ని ప్రారంభించారు. -కిరిక్ పార్టీ- లాంటి సంచలన సినిమాను తెరకెక్కించిన ఆయనే -కాంతార- చిత్రంతో పూర్తిగా హీరోగా మారి సృష్టించిన సునామి గురించి చెప్పనవసరం లేదు.కన్నడ పరిశ్రమలో సరికొత్త ట్రెండ్‌కు నాంది పలికిన ఉపేంద్ర కూడా దర్శకుడిగా కెరీర్ ప్రారంభించి ఆ తర్వాత హీరోగా మారి సెన్సేషనల్ హిట్స్‌తో ట్రెండ్‌సెట్టర్‌గా నిలిచారు. అలాగే తమిళంలో ఎస్.జె. సూర్య కూడా నాని రీమేక్ చిత్రం ద్వారా హీరోగా మారి అటుపై విలక్షణ పాత్రలతో పాటు హీరోగా నటిస్తూ సత్తా చాటుకుంటున్నారు. తరుణ్ భాస్కర్, అభిజిత్ వంటి పలువురు దర్శకులు కూడా ఇదే బాటలో నడుస్తూ కెమెరా ముందు అదృష్టాన్ని పరీక్షించుకుంటున్నారు.

అంతిమంగా చూస్తే.. తెర వెనుక కథలను అల్లుతూ చిత్ర పరిశ్రమను శాసించిన దర్శకులు, తెర ముందుకు వచ్చి నటులుగా కూడా ప్రతిభను చాటుకోవడం టాలీవుడ్ .. ఇతర భాషా పరిశ్రమలకు ఎంతో ఉత్సాహాన్ని ఇస్తోంది. సాంకేతిక పరిజ్ఞానంపై, కథా కమామిషూపై పూర్తి అవగాహన ఉన్న వీరు హీరోలుగా మారడంతో చిత్రాల స్థాయి మరింత పెరుగుతోంది. భవిష్యత్తులోనూ దర్శకుల నుంచి మరిన్ని అద్భుతమైన చిత్రాలు వచ్చే అవకాశం ఉంది.





Printed By Published By Gantyada Apparao On Behalf Of Gantyada Apparao, Printed At Sri Sai Ganga Printers And Publications D.No: 49-1-35, Miriyalapalem Center, Railway Station Road, Prakasam, Andhra Pradesh - 523001 And Published At published at D. No. 41-1/5-1, Srinivasa Tower, Flat No. S2, Gowthami Nagar, Krishnalanka, Vijayawada, NTR Dist. editor GANTYADA APPARAO. PRGI Registration No. " APTEL/25/A4561" e-mail :editorpenpower@gmail.com, Mobile: 9059465965